

రాష్ట్రంలో యూరియా పుష్కలంగా ఉంది. అన్నదాత సుఖీభవ నిధులు ఖాతాల్లో జమ కావడంతో రైతులు ఖరీఫ్ పంటల పెట్టుబడి భారం లేకుండా సంతోషంగా ఉన్నారు. కానీ వైసీపీ అసత్య ప్రచారంతో లేని సమస్యను సృష్టించి రైతులను గందరగోళానికి గురిచేస్తోంది.

**ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ**


శుక్రవారం 05.09.2025

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక


సంపుటి - 33 సంచిక - 141 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00


రాష్ట్రంలోని ప్రతి పౌరుడికి వైద్యం హక్కే అన్న నినాదంతో 'యూనివర్సల్ హెల్త్ పాలసీ'

3,257 వైద్యసేవలు

ప్రభుత్వ-ప్రైవేటు ఆసుపత్రుల్లో అందుబాటులోకి

# చంద్రన్న వరం



సీఎం చంద్రబాబు అధ్యక్షతన మంత్రివర్గ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు

## ప్రతి కుటుంబానికి ఏటా రూ.25 లక్షల ఉచిత ఆరోగ్య బీమా

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన రాష్ట్ర సచివాలయంలో జరిగిన మంత్రివర్గ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. రాష్ట్ర ప్రజలందరికీ నాణ్యమైన వైద్యం అందించేందుకు 'యూనివర్సల్ హెల్త్ పాలసీ'కి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ప్రతి కుటుంబానికి ఏటా రూ. 25 లక్షల వరకు ఉచిత వైద్యం అందించేందుకు మంత్రి వర్గం ఏకగ్రీవంగా ఆమోదించింది.

**25 లక్షల ఉచిత వైద్యం :** ఆయుష్మాన్ భారత్-పీఎంజేఏవై, డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవల పథకాలను కలిపి హైబ్రిడ్ విధానంలో కొత్త పాలసీ అమలు చేయనున్నారు. దాదాపు 5 కోట్ల మంది ప్రజలకు ఈ పథకం ద్వారా వైద్యం అందనుంది. మొత్తం 3,257 రకాల వైద్య సేవలు ఉచితంగా అందించనున్నారు. ప్రభుత్వ ఉద్యోగులు (ఈహెచ్ఎస్ కింద ఉన్నవారు) మినహా, వర్కింగ్ జర్నలిస్టులు సహా అందరికీ ఈ పథకం వర్తించనుంది.

**కొత్త వైద్య కళాశాలలు :** పీపీపీ విధానంలో రాష్ట్రంలో 10 కొత్త వైద్య కళాశాలలను స్థాపించేందుకు ఆమోదం లభించింది. ఫేజ్-1లో ఆదోని, మదనపల్లి, మార్కాపురం, పులివెందులలో కళాశాలల నిర్మాణం చేపడతారు. 2027-28 విద్యా సంవత్సరం నుంచి అడ్మిషన్లు ప్రారంభమయ్యేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

**అక్రమ కట్టడాల క్రమబద్ధీకరణ :** రాష్ట్రవ్యాప్తంగా 59,375 అక్రమ నిర్మాణాలు, 49,936 డీవియేషన్లు, 10,212 అదనపు అంతస్తులను క్రమబద్ధీకరించేందుకు మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. 2025 ఆగస్టు 31లోపు దరఖాస్తులు స్వీకరించి జరిమానాలు విధించి క్రమబద్ధీకరించనున్నారు.


**పెట్టుబడులు - పరిశ్రమలు :** మదర్ డెయిరీ రూ. 425 కోట్లు, ఏస్ ఇంటర్నేషనల్ రూ. 750 కోట్లు, హెచ్ఎఫ్సీఎల్ సంస్థ రూ. 1197 కోట్ల పెట్టుబడులతో పరిశ్రమలు స్థాపించనున్నారు. మంత్రివర్గం వీటికి ఆమోదం తెలిపింది. అలాగే మంత్రాలయం, అమరావతి, విశాఖలో స్టార్ హోటళ్లకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. మిగతా 2లో...



# దివ్యాంగులకు గుడ్‌న్యూస్

## ఎంపీసీ, బైపీసీ కోర్సులు చదవడానికి అనుమతి

## మంత్రి లోకేష్ చొరవతో జీఓ విడుదల



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** దృష్టిలోపం దివ్యాంగ విద్యార్థుల భవిష్యత్తుకు అడ్డు కాకూడదని, వారికి మిగిలిన విద్యార్థులతో సమానంగా అవకాశాలు కల్పించడానికి మంత్రి నారా లోకేష్ ప్రత్యేకంగా చొరవ చూపారు. దృష్టి లోపం గల దివ్యాంగ విద్యార్థులకు ఈ విద్యా సంవత్సరం నుంచి ఇంటర్మీడియట్ లో ఎంపీసీ, బైపిసి కోర్సులు చదవడానికి అవకాశం కల్పించాలని నిర్ణయించారు. ఈ మేరకు కళాశాల విద్యాశాఖ జీ ఓ 278 జారీ చేసింది. తమకు సైన్స్ కోర్సుల్లో అవకాశం కల్పించాలని దృష్టిలోపం గల విద్యార్థులు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి లోకేష్ కు విన్నవించారు. దివ్యాంగుల మనోభావాలను తెలుసుకున్న లోకేష్ వారి విన్నపాన్ని పరిశీలించాల్సిందిగా విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. ప్రాక్టికల్స్ పరీక్షలకు ఆ విద్యార్థులు హాజరు కావడం కష్టమని అధికారులు తెలిపారు. అందుకు ప్రత్యామ్నాయంగా వారికి లఘురూప ప్రశ్నలు ఇచ్చి ఎసెస్ మెంట్ చేయాల్సిందిగా మంత్రి లోకేష్ సూచించారు. ఈ మేరకు విధివిధానాలతో జీఓ విడుదలైంది. తమ మనోభావాలను గౌరవించి సైన్స్ కోర్సుల్లో అవకాశం కల్పించిన లోకేష్ కు దృష్టిలోపం గల దివ్యాంగులు కృతజ్ఞతలు తెలిపారు. గతంలోకి ఐఐటిల్లో ప్రవేశానికి దివ్యాంగ విద్యార్థులకు సమస్య తలెత్తినపుడు మంత్రి లోకేష్ చొరవ చూపి ప్రత్యేక జీఓ విడుదల చేయించారు.

# పారదర్శకంగా యూరియా సరఫరా



- గత ప్రభుత్వంలో కన్నా ఎక్కువ యూరియా మార్క్ ఫెడ్ ద్వారా పంపిణీ చేశాం
- కృత్రిమ కొరత సృష్టించి బ్లాక్ మార్కెట్ కు తరలించామనే వార్త పూర్తిగా అవాస్తవం
- ఈ-కేవైసీ పూర్తయిన రైతులకు అన్నదాత సుఖీభవ నగదు జమ
- వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

2 లో

# పి4కు సహకరిస్తే పన్ను రాయితీ

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** పి-4 కార్యక్రమానికి సహకరించే మార్గదర్శకులకు ఆధాయపు పన్ను రాయితీ కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. విరాళాలకు వర్తింపచేసే 80జి సెక్షన్ను ఈ పథకానికి కూడా వర్తింపచేయాలని నిర్ణయించింది. పి-4 అమలు చేసే విభాగాన్ని కూడా రిజిస్టర్ చేయడం వల్ల బంగారు కుటుంబాలకు సాయం చే నేందుకు ముందుకొచ్చే వారికి కూడా ఈ సెక్షన్ వర్తిస్తుందని అధికారులు చెబుతున్నారు. ఈ సెక్షన్ ద్వారా విరాళాలు అందించే వారు, చెక్కులు, డ్రాఫ్టతోపాటు నేరుగా నగదును కూడా అందించి, వాటిపై పి-4ని ర్వాహక సంస్థ ఇచ్చే రసీదులను ఆదాయపు పన్ను శాఖకు ఇవ్వడం ద్వారా 80జి సౌకర్యాన్ని పొందవచ్చు. మిగతా 2లో...

# యూరియా ఫుల్!



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలో ప్రస్తుతం సరిపడి యూరియా అందుబాటులో ఉందని రైతులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ రైతులకు విజ్ఞప్తి చేశారు. రిలయెన్స్ సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్రంలో 65వేల కోట్ల రూ. లతో కంప్రెస్డ్ బయో గ్యాస్ ప్లాంట్లు ఏర్పాటు చేయన్నుందున అందుకు సంబంధించిన భూములను త్వరితగతిన అప్పంగించాలని జిల్లా కలక్టర్లను ఆదేశించారు. మైనర్ ఇరిగేషన్ ట్యాంకులు, భుగర్భ జలాలు, పియం కుసుమ్, మిగతా 2లో...

# గంజాయిపై ఉక్కుపాదం

- సమాచార విశ్లేషణకు డ్యాష్ బోర్డు రూపొందించండి
- గంజాయి వినియోగం దుష్పరిణామాలపై విద్యాసంస్థల్లో అవగాహన కార్యక్రమాలు
- డి-అడిక్షన్ కేంద్రాల నిర్వహణకు కార్యాచరణ రూపొందించండి
- గంజాయి, డ్రగ్స్ నియంత్రణపై ఉండవల్లి నివాసంలో మంత్రివర్గ ఉపసంఘం సమావేశం

3

# ఏపీ పర్యాటకానికి విస్తృత ప్రచారం



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** అంతర్జాతీయ పర్యాటకులను ఆకర్షించేందుకు వేదికగా క్యూరేటెడ్ ట్రావెల్ ఫర్ టార్గెటెడ్ గ్రోత్ అనే థీమ్ తో సెప్టెంబర్ 2 నుండి 4 వరకు ముంబయిలోని జియో వరల్డ్ కన్వెన్షన్ లో జరిగిన ఐటీబీ-2025 సదస్సు నిలిచింది. ఈ సదస్సులో ఏపీ టూరిజం అథారిటీ మిగతా 3లో...

# మరో ప్రాణం పోనివ్వం... ఇది మంత్రి సత్యకుమార్ భరోసా

అంతుచిక్కని వ్యాధితో వరుస మరణాలపై ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ ఫోకస్

తురకపాలెంలోని మరణాల కారణాలపై సమగ్ర అధ్యయనం చేయాలి

వైద్య శాఖ ముఖ్య కార్యదర్శి నుంచి క్షేత్రస్థాయి సిబ్బంది వరకు తురకపాలెంలోనే ఉండాల్సిందే

అత్యవసర వైద్యులు, వైద్య సదుపాయాలు నిరంతరం అందుబాటులో ఉంచండి

'సర్వైలెన్స్' వ్యవస్థను పటిష్టం చేయాలి

తురకపాలెం మరణాలపై సమీక్షలో ఉన్నతాధికారులకు మంత్రి సత్యకుమార్ ఆదేశాలు

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** గుంటూరు రూరల్ మండలం తురకపాలెం గ్రామంలో ఇటీవల వరుస మరణాలు చోటుచేసుకోవడం రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కలిగిస్తోంది. ఈ ఘటనపై రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ గురువారం సచివాలయంలో సమీక్ష నిర్వహించి, అధికారులను సత్వర చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

**అసాధారణ మరణాలపై అప్రమత్తం కావాలి :** గ్రామంలో సాధారణ పరిస్థితులకు విరుద్ధంగా మరణాలు జరుగుతున్న సందర్భంలో, అలాంటి పరిస్థితులను ముందుగానే గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని మంత్రి సత్యకుమార్ స్పష్టంగా సూచించారు. అప్రమత్తం కావడంలో విఫలమైతే ప్రజల ప్రాణాలకు ముప్పు వాటిల్లుతుందని హెచ్చరించారు. మంత్రివర్గ సమావేశం ప్రారంభానికి ముందు మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రత్యేకంగా తురకపాలెం ఘటనపై చర్చించారు. ఈ సందర్భంగా రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు, ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీరపాండియన్, డీఎంఈ డాక్టర్ రఘునందన్ పాల్గొన్నారు.

**పరీక్షలు - రక్త నమూనాలపై దృష్టి :** తురకపాలెం బాధితుల నుంచి సేకరించిన రక్త



మిగతా 2లో...




## ఆహార భద్రత: వాగ్దానం నుండి వాస్తవం వరకు

ఆహారం మానవుడి అత్యంత ప్రాథమిక అవసరం. అయినప్పటికీ, ఆకలి మరియు పోషకాహార లోపం భారతదేశంలో ఇప్పటికీ కోట్ల మందిని బాధిస్తోంది. ఈ సమస్యను ఎదుర్కొనే క్రమంలో జాతీయ ఆహార భద్రతా చట్టం (2013) అమలులోకి వచ్చింది. దేశ జనాభాలో దాదాపు మూడింట రెండువంతులకు ఆహారం హక్కును చట్టబద్ధం చేసిన ఈ చట్టం, రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 – జీవించే హక్కు, గౌరవ హక్కులో భాగమైంది.

గత పన్నెండు సంవత్సరాల అమలు అనుభవం చూస్తే, ఈ చట్టం పలు విజయాలు సాధించినా, ఆకలి సమస్యను పూర్తిగా తీరుస్తుందని చెప్పలేం. మిడ్–డే మీల్, ఐసీడీఎస్, సబ్సిడీ ధాన్యాల పంపిణీ వంటి పథకాలు విస్తరించినా, గ్లోబల్ హంగర్ ఇండెక్స్ 2022లో భారతదేశం 121 దేశాలలో 107వ స్థానంలో నిలిచింది. ఐదేళ్ల లోపు పిల్లల్లో 38% మంది పోషక లోపంతో బాధపడుతుండగా, మహిళల్లో సగానికి పైగా రక్తహీనతతో ఉన్నారు.

అమలు లోపాలు ఈ విఫలతకు ప్రధాన కారణాలు. 2011 జనగణన ఆధారంగా లబ్ధిదారులను నిర్ణయించడం వల్ల లక్షలాది మంది వంచించబడ్డారు. ప్రజాపంపిణీ వ్యవస్థలో లీకేజీలు, అవినీతి, మౌలిక సదుపాయాల కొరత సమస్యలను పెంచాయి. అనేక రాష్ట్రాలు సమగ్ర నియమాలు రూపొందించడంలో విఫలమయ్యాయి. అలాగే ధాన్యాలపై అధిక ఆధారపడటం వల్ల ప్రోటీన్, సూక్ష్మపోషక పదార్థాల అవసరం నిర్లక్ష్యం చేయబడింది.

ఆహార హక్కు దాతృత్వం కాదు, న్యాయం. ఆకలి మరణాలు సహజ పరిణామం కాదు, అవి వ్యవస్థాగత వైఫల్యాల ఫలితాలు. కాబట్టి లబ్ధిదారుల సంఖ్యను తాజా జనాభా డేటాతో నవీకరించడం అవసరం. పిల్లలు, మహిళలకు నాణ్యమైన పోషకాహారానికి తగిన బడ్జెట్ కేటాయింపులు చేయాలి. రాష్ట్రస్థాయి నియమాలు, ఫిర్యాదు పరిష్కార వ్యవస్థలు బలోపేతం కావాలి. పాఠశాలలు, పీడీఎస్ ద్వారా స్థానికంగా లభించే వైవిధ్యభరిత ఆహారాన్ని ప్రోత్సహించాలి.

భారతదేశంలో ధాన్యాగారాలు నిండిపోతున్నా, ఆకలి కొనసాగడం నైతిక వైఫల్యం. ప్రతి భారతీయుని జీవన హక్కు, గౌరవం కాపాడటానికి బలమైన రాజకీయ సంకల్పం, పారదర్శక పాలన, తగిన వనరులు అత్యవసరం. అప్పుడే జాతీయ ఆహార భద్రతా చట్టం తన అసలు లక్ష్యాన్ని సాధించగలదు.

-అజయ్ చంద్ర, ఎడిటర్, జర్నలిస్ట్ ఫైల్

## చంద్రన్న వరం ....ప్రతి కుటుంబానికి ఏటా రూ.25 లక్షల ఉచిత ఆరోగ్య బీమా

(మొదటి పేజీ తరువాయి)



**మంగళగిరి గోల్డ్ క్లస్టర్ :** గుంటూరు జిల్లా మంగళగిరి మండలం ఆత్మకూరు గ్రామంలో 78.01 ఎకరాల్లో "గోల్డ్ క్లస్టర్ ల్యాండ్ పూలింగ్ స్కీమ్" ఏర్పాటు చేయడానికి మంత్రి వర్గం ఆమోదం తెలిపింది.

**ఇతర నిర్ణయాలు**

రవాణా వాహనాలపై గ్రీన్ టాక్స్ తగ్గింపు బిల్లుకు ఆమోదం.
ప్రైవేటు విశ్వవిద్యాలయాల ఏర్పాటుకు అడ్డంకిగా ఉన్న నిబంధనల్లో సవరణ.
అందరికీ ఇళ్లు పథకం కింద పట్టణాల్లో 2 సెంట్లు, గ్రామాల్లో 3 సెంట్ల భూమి కేటాయింపు.
గిరిజనులకు 5 కేజీల సిలిండర్ల స్థానంలో 14.2 కేజీల సిలిండర్ల సబ్సిడీ.
ప్రకాశం బ్యారేజీ వద్ద ఇసుక తవ్వకాల కోసం డీసిల్టింగ్ కార్యక్రమం.

**జీఎస్టీ స్లాబ్ తగ్గింపుపై అభినందనలు :** కేంద్రం జీఎస్టీని నాలుగు స్లాబుల నుంచి రెండు స్లాబులుగా తగ్గించడాన్ని రాష్ట్ర కేబినెట్ అభినందించింది.

**తురకపాలెం మరణాలు - నిపుణుల వైద్యం :** గుంటూరు జిల్లా తురకపాలెంలో కొత్త జ్వరంతో వరుస మరణాలపై చర్చించి, జాతీయస్థాయి వైద్య నిపుణులను పిలిపించి ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని సీఎం ఆదేశించారు.

**సామాజిక మాధ్యమాలపై నియంత్రణ :** తప్పుడు పోస్టుల నివారణకు చట్టం రూపొందించేందుకు హోంమంత్రి అనిత, నాదెండ్ల మనోహర్, అనగాని, పార్థసారథిలతో ఉపసంఘం ఏర్పాటు చేశారు. తప్పుడు పోస్టులు పెట్టిన వారిపై కఠిన చర్యలు తీసుకునేలా కొత్త చట్టాన్ని సిద్ధం చేయనున్నారు.

**సుగాలి ప్రీతి కేసు :** సుగాలి ప్రీతి అనుమానాస్పద మృతి కేసు సీబీఐ విచారణలో ఉందని, కుటుంబానికి న్యాయం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందని సీఎం స్పష్టం చేశారు.

**వైఎస్సార్సీపీ దుష్ప్రచారం :** రాష్ట్రంలో యూరియా నిల్వలపై వైఎస్సార్సీపీ దుష్ప్రచారాన్ని సీఎం మండిపడ్డారు. ఇకపై ఇలాంటి దుష్ప్రచారాలపై అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించారు.

**విమర్శలకు గట్టి సమాధానం :** ఎన్డీఏ భాగస్వామి పక్షాలపై వచ్చే విమర్శలకు సమర్థవంతంగా ప్రతిస్పందించాలని చంద్రబాబు సూచించారు.

## మరో ప్రాణం పోనివ్వం.. ఇది మంత్రి సత్యకుమార్ భరోసా

(మొదటి పేజీ తరువాయి)



నమూనాలు ప్రస్తుతం గుంటూరు ప్రభుత్వ మెడికల్ కాలేజీ ల్యాబ్‌లో పరీక్షల కోసం ఉన్నాయని అధికారులు మంత్రికి వివరించారు. ఈ పరీక్షల ఫలితాలు వచ్చిన వెంటనే వ్యాధి స్వరూపాన్ని నిర్ధారించి తగు చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. అంతేకాకుండా, గ్రామ ప్రజలందరికీ కిడ్నీ పనితీరు పరీక్షలు, హెచ్బీఎ1సీ (షుగర్), బీపీ పరీక్షలు నిర్వహించాలని స్పష్టంగా ఆదేశించారు.

**సర్వైలెన్స్ వ్యవస్థలో మార్పులు :** తురకపాలెం ఘటన నేపథ్యంలో సర్వైలెన్స్ వ్యవస్థలో తగిన మార్పులు చేయాలన్నారు. సమాచార సేకరణలో లోపం ఉండకూడదన్నారు మంత్రి సత్యకుమార్. ఈ ఘటనను ముందుగానే గుర్తించలేకపోవడానికి కారణాలను అధికారులు మంత్రికి వివరిస్తూ, ప్రస్తుత వ్యవస్థలో గ్రామ స్థాయిలో మరణాల వివరణ, కారణాల విశ్లేషణ కోసం సరైన మెకానిజం లేనందున సమస్య ఏర్పడిందని తెలిపారు. దీనికి పరిష్కారంగా సర్వైలెన్స్ వ్యవస్థలో తగిన మార్పులు చేసి, సమాచార సేకరణలో లోపాలు రాకుండా చర్యలు తీసుకుంటామని ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు హామీ ఇచ్చారు.

**తురకపాలెంలోనే అత్యున్నత స్థాయి వైద్య బృందం :** వైద్య విద్యాసంచాలకులు ప్రొఫెసర్ జి. రఘునందన్ మంత్రికి సమర్పించిన నివేదికలో జూలైలో 10 మంది, ఆగస్టులో 10 మంది, సెప్టెంబర్ 3వ తేదీ వరకు మరో ముగ్గురు మరణించారని తెలిపారు. మంత్రి ఆదేశాల మేరకు వైద్య విద్యా సంచాలకులు ప్రొఫెసర్ తో పాటు వైద్యుల బృందం బుధవారం తురకపాలెం గ్రామంలో పర్యటించి పరిస్థితులను సమీక్షించినట్లు తెలిపారు. పర్యటనలో గ్రామంలోని ప్రస్తుత ఆరోగ్య పరిస్థితులను అంచనా వేసి, వ్యాధి వ్యాప్తిని అరికట్టడానికి అవసరమైన చర్యలు చేపట్టినట్లు నివేదిక సమర్పించారు. గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ ప్రొఫెసర్ ఎస్.ఎస్.వి రమణ, డీఎంఈ కార్యాలయంలోని వైద్య విద్య అదనపు సంచాలకులు ప్రొఫెసర్ డి.వెంకటేశ్వరరావు నేతృత్వంలోని మరో బృందం గురువారం తురకపాలెంలో క్షేత్రస్థాయి పరిశీలన జరుపుతూ, అవసరమైన వారికి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు మంత్రికి తెలిపారు .ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... మరో ప్రాణం పోకూడదు అని వైద్య శాఖ ముఖ్య కార్యదర్శి నుంచి క్షేత్రస్థాయి సిబ్బంది వరకు తురకపాలెంలోనే ఉండాల్సిందే అని స్పష్టం చేశారు.

**పరిస్థితులు అదుపులోనే :** ప్రస్తుతం గ్రామంలోని పరిస్థితులు అదుపులో ఉన్నాయని, ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అధికారులు తెలిపారు. వ్యాధి కారణాలపై పూర్తి స్థాయి రిపోర్టు అందిన వెంటనే తగిన చర్యలు తీసుకోవడానికి సిద్ధంగా ఉన్నామని మంత్రి సత్యకుమార్ యాదవ్ స్పష్టం చేశారు.

## పి4కు సహకరిస్తే పన్ను రాయితీ

(మొదటి పేజీ తరువాయి)

అయితే నగదు రూపంలో సాయం అందించేవారు కనిష్టంగా రెండు వేల రూపాయలను అందించాల్సి ఉంటుంది. ఇక సాయం చేసే వారికి 80జి ద్వారా 50 నుంచి 100 శాతం వరకు ఆదాయపు పన్ను రాయితీ లభిస్తుంది. పి4 కింద ముందుకొచ్చే మార్గదర్శులను మరింతగా ఆకర్షించేందుకు ఆదాయపు పన్ను రాయితీ తాయిలాన్ని కూడా ప్రకటించినట్లు సమాచారం. అయినా.. అంతంతమాత్రమే..! ఈ నిర్ణయం తీసుకోవడంతో పాటు, మార్గదర్శకులుగా గతంలోనే గుర్తించిన పలువురికి ఈ విషయాన్ని కూడా ప్రభుత్వం ఇప్పటికే తెలియచేసినట్లు సమాచారం. అయినా, ఆశించిన స్థాయిలో స్పందన కనిపించ డం లేదని అధికారులు చెబుతున్నారు. 20 లక్షల కుటుంబాలను ఆదుకోవాలంటే ప్రభుత్వ అంచనా మేరకు కనీసం 10 లక్షల మంది మార్గదర్శులు కావాలన్నది ప్రభుత్వ అంచనా! ఇప్పటి వరకు వీరిలో సగం మ0ది కూడా సమకూరలేదని ఒక అధికారి చెప్పారు. ఈ నేపథ్యంలో మరిన్ని ప్రోత్సాహకాలను ప్రకటించేవి షయాన్ని కూడా ప్రభుత్వం పరిశీలిస్తున్నట్లు తెలిసింది.

## యూరియా ఫుల్!

(మొదటి పేజీ తరువాయి)



కంప్రెస్డ్ బయో గ్యాస్ ప్లాంట్లకు భూమి అప్పగించుట,స్వచ్ఛాంధ్ర అవార్డులు తదితర అంశాలపై గురువారం రాష్ట్ర సచివాలయం నుండి ఆయన జిల్లా కలెక్టర్లతో వీడియో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా సిఎస్ మాట్లాడుతూ రాష్ట్రంలో రిలయెన్స్ సంస్థ ద్వారా ఏర్పాటు చేయనున్నకంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్లకు సంబంధించి మొదటి దశ కింద 9 జిల్లాల్లో 2లక్షల 34 వేల ఎకరాల భూమిని గుర్తించడం జరిగిందని ఆయా భూములను త్వరిత గతిన అప్పగించాలని కలక్టర్లను ఆదేశించారు. అనంతరం మైనర్ ఇరిగేషన్ ట్యాంకులు,భూగర్భ జలాల పెంపు అంశాలపై మాట్లాడుతూ వృధాగా పోతున్న వర్షపు నీటిని పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకునేందుకు అన్ని మైనర్ ఇరిగేషన్ ట్యాంకులను పూర్తిగా నింపేందుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. అలాగే భూగర్భ జలాలను పెంపొందించేందుకు ఉపాధిహామీ పథకంలో అవసరమైన షెల్ఫ్ అఫ్ ప్రాజెక్టులను సిద్ధం చేసి చేపట్టేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అంతేగాక వర్షపు నీటి సంరక్షణ,భూగర్భ జలాలు పెంపును కలెక్టర్లు బాధ్యతగా తీసుకోవాలని చెప్పారు.

రాష్ట్రంలో ఎక్కడా యూరియా కొరత లేదని అని జిల్లాల్లో సరిపడిన మేర యూరియా నిల్వలు ఉన్నాయని కావున రైతులు ఎవరూ ఆందోళన పడాల్సిన అవసరం లేదని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ స్పష్టం చేశారు. యూరియా అందుబాటులో లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని వివిధ ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా సహా సోషల్ మీడియాలో వచ్చే వ్యతిరేక వార్తలు,కథనాలపై సకాలంలో స్పందించి రిజాయిండర్ ఇచ్చి ప్రచురితం మరియు ప్రసారం అయ్యే విధంగా తగిన చర్యలు తీసుకోవడంతో పాటు ఎప్పటి కప్పుడు ప్రజలకు వాస్తవాలను తెలియజేయాలని కలక్టర్లను సిఎస్ ఆదేశించారు. అంతేగాక అన్నిరైతు సేవా కేంద్రాలు,పిఏసిఎస్లు తదితర చోట్ల రోజువారీ ఓపెనింగ్ బ్యాలెన్సు మరియు క్లోజింగ్ బ్యాలెన్సు వివరాలను డిస్ప్లే చేయించాలని చెప్పారు. అనంతరం ఉల్లిపాయలు,పొగాకు పంటల ఉత్పత్తి,కొనుగోలు ప్రభుత్వం అందిస్తున్న మద్ధత్తుధర తోడ్పాటుపై కూడా సిఎస్ కలక్టర్లతో సమీక్షించారు.

స్వచ్ఛాంధ్ర అవార్డుల గురించి సిఎస్ మాట్లాడుతూ రాష్ట్రంలో స్వచ్ఛాంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమంలో ఉత్తమ సేవలు అందించిన వారిని గౌరవించేందుకు అక్టోబరు 2వతేదీన రాష్ట్ర స్థాయిలో 52,జిల్లా స్థాయిలో 55 వంతున 26 జిల్లాలకు కలిపి మొత్తం 1421 అవార్డులను ప్రదానం చేయడం జరుగుతుందని చెప్పారు. వాటిలో ముఖ్యంగా స్వచ్ఛ మున్సిపాలిటి,స్వచ్ఛ ఎస్ఎల్ఎఫ్,స్వచ్ఛత వారియర్స్ (శానిటేషన్ వర్కర్),స్వచ్ఛగ్రామ పంచాయితి,విలేజ్ ఆర్గనైజేషన్,స్వచ్ఛత గ్రీన్ అంబాసిడర్, స్వచ్ఛ స్కూల్,స్వచ్ఛ అంగన్వాడి,స్వచ్ఛ ఆసుపత్రులు,స్వచ్ఛ బస్ స్టేషన్లు,స్వచ్ఛ రైతు బజారులు,స్వచ్ఛ హాస్టల్స్,స్వచ్ఛ పరిశ్రమలు-లాంగ్/మెగా పరిశ్రలు,ఎంఎస్ఎంఇలు,స్వచ్ఛ ప్రభుత్వ కార్యాలయాలు,స్వచ్ఛ ఎన్జిఓలు,స్వచ్ఛ రెసిడెన్సియల్ పాఠశాలలు-బిసి వెల్ఫేర్, డా.బిఆర్ అంబేద్కర్ గురుకులాలు,ఎపి ట్రైబల్ వెల్ఫేర్ గురుకులాలు,మోడల్ స్కూల్స్,ఎపి ఆర్ఇఐఎస్, కెజిబివిలకు అవార్డులు అందించడం జరుగుతుందన్నారు. ఇందుకు సంబంధించి ఈనెల 9వ తేదీ నాటికి ఆయా అవార్డులకు సంబంధించిన నామినేషన్లను స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ కు పంపాలని జిల్లా కలక్టర్లను ఆదేశించారు. తదుపరి ఈనెల 11 నుండి థర్డ్ పార్టీ మూల్యాంకనం ప్రారంభించడం జరుగుతుందని,అక్టోబరు 2వ తేదీన స్వచ్ఛ ఆంధ్ర అవార్డులను ప్రదానం చేయడం జరుగుతుందని సిఎస్ విజయానంద్ చెప్పారు.

అంతకు ముందు ఈసమావేశానికి వర్చువల్ గా పాల్గొన్న రాష్ట్ర జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయి ప్రసాద్ మైనర్ ఇరిగేషన్ ట్యాంకులు,జిల్లాల వారీ గ్రౌండ్ వాటర్ రీఛార్జి కార్యాచరణ ప్రణాళిక ప్రగతిని కలెక్టర్లతో సమీక్షించారు. ఇందుకు సంబంధించి టీంలను ఏర్పాటు చేసి వేగవంతంగా పనులు జరిగేలా చూడాలని కలక్టర్లను ఆదేశించారు.

ఈసమావేశంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఢిల్లీ రావు,సమాచార శాఖ డైరెక్టర్ హిమాన్షు శుక్ల,ఆర్టీజిఎస్ సిఇఒ ప్రఖర్ జైన్,నెడ్ క్యాప్ ఎండి కమలాకర్ బాబు,తదితర అధికారులు పాల్గొన్నారు. అదే విధంగా రాష్ట్ర వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్,పిఆర్ అండ్ ఆర్డి ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్,పలువురు కలెక్టర్లు వర్చువల్ గా పాల్గొన్నారు.

## మైనార్టీల అభ్యున్నతికి కృషి చేస్తున్న మంత్రి లోకేష్‌కి ధన్యవాదాలు తెలిపిన టిడిపి నాయకులు



● యండి ఇబ్రహీం ను ఘనంగా సత్కరించిన జవ్వాది

**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్):** ఏపీ మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన టిడిపి సీనియర్ నాయకుడు, నియోజకవర్గ మైనారిటీ సెల్ అధ్యక్షుడు ఎండి ఇబ్రహీం ను గురువారం మంగళగిరి పట్టణంలోని ఎంఎస్ఎస్ భవన్ టిడిపి కార్యాలయంలో మంగళగిరి వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ జవ్వాది కిరణ్ చంద్ ఇబ్రహీం ని కలిసి శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ ఆయన, "ఇబ్రహీం నియామకం మైనారిటీలకు గర్వకారణం. ఆయన కృషి, పట్టుదలతో నియోజకవర్గ అభివృద్ధి మరింత బలపడుతుంది. మైనారిటీ వర్గాల అభ్యున్నతికి ఆయన చేస్తున్న కృషికి ఇది సరైన గుర్తింపు" అని అన్నారు. ఇబ్రహీం నియామకం టిడిపి బలోపేతానికి తోడ్పడుతుందనీ తెలియజేసారు...సత్కరించిన వారిలో ఏఎంసీ డైరెక్టర్ వీరిశెట్టి శ్రీనివాసరావు, మాదాల రమేష్ బాబు తదితరులు సత్కరించారు.

## 6న ఛలో విజయవాడ



**మైదుకూరు(జర్నలిస్ట్ ఫైల్) :** విద్యారంగలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో సెప్టెంబర్ 6వ తేదీన జరిగే ఛలో విజయవాడ కార్యక్రమం జయప్రదం చేయాలని జిల్లా అధ్యక్షుడు వై,రాహుల్ పిలుపునిచ్చారు మైదుకూరు పట్టణంలోని మేధా డిగ్రీ కళాశాల నందు విద్యార్థులు చేతుల మీద కరపత్రం విడుదల చేయడం జరిగింది, ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు రాహుల్ ఉపాధ్యక్షుడు రాజశేఖర్ మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం ముగుస్తుందని విద్యార్థుల సమస్యలను ఇచ్చిన హామీలను గాలికొదిలేసిందన్నారు. విద్యార్థుల ఫీజులు యాజమాన్యాల ఖాతాల్లోకి జమ చేస్తామని హామిఇచ్చి గత రెండు సంవత్సరాలుగా ఫీజురీయింబర్స్‌మెంట్ ఒక్క దఫా కూడా పూర్తిస్థాయిలో విడుదలచేయలేదని అన్నారు. దీనితో ఫీజులు కడితేనే పరీక్షలు అనుమతి ఇస్తామని యాజమాన్యాలు తేల్చిచెప్పడంతో ఫీజులు చెల్లించేందుకు విద్యార్థుల తల్లిదండ్రులు అప్పులపాలౌతున్నారని అవేదన వ్యక్తంచేసారు. యువగళం పాదయాత్రలో నేటి విద్యా శాఖా మంత్రి నారా లోకేష్ గత ప్రభుత్వం తీసుకొచ్చిన జిఓ 77 ను రద్దు చేసి పీజి ఎక్కడ చదువుకున్నా ఫీజులు చెల్లిస్తామని దీనిని అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లో అమలు చేస్తామని చెప్పి ఇప్పుడు నోరు మెదపడంలేదని తెలిపారు. వేలాది మంది విద్యార్థులకు పిజి చదువును కలగానే కూటమి ప్రభుత్వం మిగిల్చిందన్నారు. సంక్షేమ వసతి గృహాలు సమస్యలకు నిలయాలుగా ఉన్నాయని హాస్టళ్ళలో ఉండే విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందడంలేదని వారికి పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ ఛార్జీలను రూ. 3వేలకు పెంచాలని కోరారు. హాస్టళ్ళ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని డిమాండ్ చేసారు. యూనివర్శిటీలో ఖాళీగా ఉన్న విసి అధ్యాపక పోస్టులు భర్తీ చేయాలని కోరారు. అదేవిధంగా రాష్ట్రంలో ఉన్న విద్యార్థులందరికి ఉచిత బస్‌పాస్‌లు ఇవ్వాలని డిమాండ్ చేసారు. పాఠశాల జూనియర్ కళాశాలల్లో విద్యార్థి సంఘాలకు ప్రవేశాన్ని నిషేదిస్తూ ఇచ్చిన ఉత్తర్వులను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమానికి రాష్ట్రంలో ఉన్న విద్యార్థి లోకం పాల్గొని జయపద్రం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ గర్ల్స్ కన్వీనర్ శిరీష విద్యార్థులు పాల్గొన్నారు.

## పారదర్శకంగా యూరియా సరఫరా




**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్ర వ్యాప్తంగా రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని యూరియా సరఫరా, పంపిణీని ప్రభుత్వం పూర్తిగా పారదర్శకంగా నిర్వహిస్తోందని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ప్రతి ఒక్కరికి అవసరమైనంత యూరియా సమయానికి అందేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. రాష్ట్రప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రతి జిల్లాలో యూరియా సరఫరా, పంపిణీ వ్యవస్థను పర్యవేక్షిస్తూ, ఎక్కడా కొరత తలెత్తకుండా తగినన్ని నిల్వలు సిద్ధం చేశామని, ఏవైనా అవకతవకలు లేకుండా రైతులకు నేరుగా యూరియా చేరేలా కఠిన చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. రైతుల ప్రయోజనమే ప్రభుత్వ లక్ష్యమని, యూరియా సరఫరాలో అవినీతి, అక్రమాలకు అవకాశం లేకుండా పారదర్శక విధానాన్ని అమలు చేస్తూ, ఎక్కడ సమస్య తలెత్తినా వెంటనే పరిష్కరించేలా వ్యవస్థను ఏర్పాటు చేశామని అన్నారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, యూరియా సమృద్ధిగా లభ్యమవుతుందని, తప్పుడు కథనాలు, మాటలు నమ్మొద్దని సూచించారు.

యూరియా సరఫరా లో గత వైసిపి ప్రభుత్వం కన్నా 48,478 మెట్రిక్ టన్నుల యూరియాను అధికంగా మార్క్ ఫెడ్ ద్వారా రైతులకు పంపిణీ చేశామని మంత్రి తెలిపారు. కృత్రిమ కొరత సృష్టించి బ్లాక్ మార్కెట్ కు తరలించామనే వార్త పూర్తిగా అవాస్తవమని అన్నారు. గత ప్రభుత్వం లో మార్క్ ఫెడ్ ద్వారా సొసైటీలకు ఎరువుల సరఫరా నిర్వీర్యం చేస్తే కూటమి ప్రభుత్వం మార్క్ ఫెడ్ ను గాడిలో పెట్టి సొసైటీలకు అధిక మొత్తంలో యూరియా సరఫరా చేసి గ్రామీణ రైతాంగానికి అందుబాటులో ఉంచిన విషయం గుర్తించాలని తెలిపారు. గతానికి భిన్నంగా మార్క్ ఫెడ్ : ప్రైవేట్ పంపిణీ నిష్పతి ని 50 : 50 నుండి 70:30 పెంచామని, మార్క్ ఫెడ్ ద్వారా (ఆర్ ఎస్ కే, పీఏసీఎస్) 20% ఎక్కువగా యూరియాను పంపిణీ చేసిన ఘనత కూటమి ప్రభుత్వానిది దక్కుతుందన్నారు. 2021- 22 నుండి 2023 - 24 వరకు గత వైసిపి మూడు సంవత్సరాల సరాసరి యూరియా సరఫరా కేవలం 1,55,617 మెట్రిక్ టన్నులు కాగా ఈ ఒక్క సంవత్సరం(2025- 26)లో ఆగస్టు చివరి నాటికి 2,04,096 మెట్రిక్ టన్నుల యూరియాను రైతులకు సరఫరా చేసామని అన్నారు. గతంతో పోలిస్తే ఈ సంవత్సరం యూరియా సరఫరా 31% శాతం గతం కంటే ఎక్కువ అని తెలిపారు. ఏ ఒక్క రైతుకు యూరియా అందని పరిస్థితి రాకూడదనేది ముఖ్యమంత్రి చంద్రబాబు ఆకాంక్షఅని, రైతు శ్రేయస్సు కూటమి ప్రభుత్వం లక్ష్యం అని అన్నారు.

విజిలెన్స్ రెవెన్యూ అధికారుల నిరంతర నిఘా, క్రమం తప్పని తనిఖీల ద్వారా అందుబాటు ధరలోనే మార్కెట్ లో యూరియా లభిస్తుందని, ఎటువంటి బ్లాక్ మార్కెట్ లేదని స్పష్టం చేశారు. ఎటువంటి రాద్ధాంతం చేయకుండా క్రమశిక్షణతో వరుసగా లైన్ లో సాగుతూ ఎరువులను తీసుకుంటున్న రైతులను మెచ్చుకుంటూ వాడుక భాషలో అందరికి అర్థమయ్యే విధంగా బఫె మాదిరిగా అన్న పదానికి వక్రభాష్యం పలకటం వైసీపీ వారి చౌక బారుతనానికి నిదర్శనని ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక చొరవ చూపించి ఎప్పటికప్పుడు కేంద్రంతో సంప్రదింపులు జరపడం ద్వారా మన రాష్ట్రానికి క్లిష్టమైన పరిస్థితుల్లో కూడా ఇతర రాష్ట్రాల కంటే అధిక మొత్తంలో యూరియాను కేంద్రం కేటాయించిందని తెలిపారు. ఇప్పటివరకు గత ఏడాది కన్నా 87,880 మెట్రిక్ టన్నుల యూరియాను వివిధ పంటలకు రాష్ట్ర రైతాంగం వినియోగించిందన్నారు. రాష్ట్రంలో యూరియా సరఫరా, పంపిణీ విషయంలో రైతులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చేస్తున్నామని, ఎక్కడ నిరసనలు లేవని ,వాటిని అణిచివేసే ధోరణి ఉత్పన్నం కాదని ఈ ప్రభుత్వం అటువంటి అణిచివేత పనులు చేయదని తేల్చిచెప్పారు. నల్లబర్లీ పొగాకు ,కోకో ,తోతాపురి మామిడి ,ఉల్లి ధరల విషయాలలో ఆ పంటలకు మద్దతు ధర లేకపోయినా సీఎం చంద్రబాబు నాయుడు చొరవతో వాటిని రాష్ట్ర ప్రభుత్వమే కొనుగోలు చేసిన విషయాన్ని గోవర్ధన్ రెడ్డి గుర్తించాలని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు.

**ఈ-కేవైసీ పూర్తయిన రైతులకు అన్నదాత సుఖీభవ నగదు జమ :** అన్నదాత సుఖీభవ– పీయం కిసాన్ పథకం ద్వారా అర్హత గల ప్రతి రైతు కుటుంబానికి సంవత్సరానికి రూ. 20,000/- ఆర్థిక సహాయం అందచేసేందుకు తొలి విడతగా ఇప్పటికే 7 వేల రూపాయలను రైతులకు జమ చేసామని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. అర్హత కలిగి ఉండి కూడా ఈ పథకం లబ్ది పొందని రైతుల కోసం ఆగస్టు 3 వ తేదీ నుండి 20 వ తేదీ వరకు అన్నదాత సుఖీభవ పోర్టల్ లోని గ్రీవెన్స్ మోడ్యూల్ అందుబాటులో ఉంచడం జరిగిందని, సంబంధిత అగ్రికల్చర్ అసిస్టెంట్ లు రైతుల ఫిర్యాదులు పోర్టల్ లో పరిచారని తెలిపారు. ఈ ఫిర్యాదులన్నింటిని అన్నదాత సుఖీభవ మార్గదర్శకాల ప్రకారం అర్హతా ప్రామాణికాలతో రాష్ట్ర స్థాయిలో ధ్రువీకరణ చేయగా 36,722 మంది అర్హులు గా గుర్తించామని తెలిపారు. అర్హులయ్యుండి e-KYC లేక , రైతుల బ్యాంకు అకౌంట్ కి NPCI ACTIVATION లేని కారణంగా కొంతమంది రైతులకు ఈ పథకం లబ్ది అందలేదని, అలాంటి రైతులలో ప్రస్తుతం e -KYC చేయించుకున్న వారికి అలాగే NPCI ACTIVATION చేయించుకున్న వారికి, ఫిర్యాదుల ధృవీకరణలో అర్హతపొందిన రైతులతో కలిపి మొత్తం 47,161 మందికి సెప్టెంబర్ 4వ తేదీన మొదటి విడత లబ్ది రూ. 5000/- రూపాయల చొప్పున మొత్తం 23.58 కోట్లు విడుదల చేయడం జరిగిందని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు.

# జీఎస్టీ స్లాబ్‌ల తగ్గింపు నిర్ణయం హర్షణీయం : సీఎం చంద్రబాబు



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** జీఎస్టీ స్లాబ్‌ల తగ్గింపుపై కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్వాగతించారు. ఈ నేపథ్యంలో ఆయన ట్వీట్ చేస్తూ, నిత్యావసర వస్తువులు, విద్యా, ఆరోగ్యరంగం, వ్యవసాయ ఉత్పత్తులపై పన్నులు గణనీయంగా తగ్గడం పేదలకు వరమని, అభివృద్ధి పథానికి దోహదం చేస్తుందని తెలిపారు.
సమాజంలోని వేర్వేరు వర్గాలకు, ముఖ్యంగా రైతుల నుంచి వ్యాపారుల వరకు అందరికీ ఈ నిర్ణయం ప్రయోజనం చేకూరుస్తుందని సీఎం పేర్కొన్నారు. విప్లవాత్మక నిర్ణయం తీసుకున్న ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌లకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు.
"పౌరులకు ఉపకరించేలా తీసుకున్న ఈ నెక్స్ట్ జనరేషన్ జీఎస్టీ సంస్కరణలు పన్నుల వ్యవస్థను వ్యూహాత్మకంగా మార్చడంతో పాటు ప్రతీ భారతీయుడి జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తాయి" అని సీఎం చంద్రబాబు తన ట్వీట్‌లో స్పష్టం చేశారు.

# శ్రీయోగివేమారెడ్డి చారిటబుల్ ట్రస్టు నూతనకార్యవర్గనియామకం



**తెనాలి (జర్నలిస్ట్ ఫైల్ )** నిరుపేదల అవసరాలు గుర్తించి అందుకు అనుగుణంగా సేవలు అందించడమే శ్రీయోగి వేమారెడ్డి చారిటబుల్ ట్రస్టు లక్ష్యమని సంస్థ కార్యదర్శి సిహెచ్ విజయభాస్కర్ రెడ్డి పేర్కొన్నారు. స్థానిక గంగానమ్మపేటలోని శశి వేదిక ప్రాంగణంలో గురువారం శ్రీయోగి వేమారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. శ్రీయోగి వేమారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులుగా డాకా సాంబిరెడ్డి, కార్యదర్శిగా సిహెచ్ విజయభాస్కర్ రెడ్డి, కోశాధికారిగ వెంకట కృష్ణారెడ్డి, సభ్యులుగా చంద్రశేఖర్ రెడ్డి కిక్కురి చిన్న కృష్ణారెడ్డి, తిరుమల రెడ్డి లక్ష్మారెడ్డి లను ప్రకటించారు. గత రెండు సంవత్సరాలుగా సంస్థ ద్వారా చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. ప్రజా ప్రయోజన కార్యక్రమాలతో సంస్థకు తగు గుర్తింపు తీసుకు వస్తామన్నారు. ఈక్రమంలొ నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారం చేశారు. ఈసందర్భంగా నూతన కార్యవర్గం సంస్థ భవిష్యత్ కార్యాచరణను వివరించారు. పలువురు సంఘీయ సభ్యులు పాల్గొన్నారు.

## జాతీయ ర్యాంకుల్లో ఆంధ్రా యూనివర్శిటీ సత్తా..



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ప్రతిష్ఠాత్మక ఆంధ్రా యూనివర్సిటీ (ఏయూ) జాతీయ స్థాయిలో మరోసారి సత్తా చాటింది. కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ ఏటా ప్రకటించే నేషనల్ ఇన్‌స్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్ (ఎన్ఐఆర్ఎఫ్) ర్యాంకుల్లో ఏయూ అద్భుతమైన ప్రతిభ కనబరిచింది. దేశవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ విశ్వవిద్యాలయాల (స్టేట్ పబ్లిక్ యూనివర్సిటీ) విభాగంలో నాలుగో స్థానాన్ని కైవసం చేసుకుంది. ఈ ఘనతతో రాష్ట్రంలోని ప్రభుత్వ యూనివర్సిటీల్లో అగ్రస్థానంలో నిలిచింది.
గతేడాది ఇదే విభాగంలో 7వ స్థానంలో ఉన్న ఆంధ్ర యూనివర్సిటీ, ఈసారి ఏకంగా మూడు స్థానాలు మెరుగుపరుచుకుని 4వ ర్యాంకును దక్కించుకోవడం విశేషం. కేవలం ఇదే కేటగిరీలో కాకుండా, ఇతర విభాగాల్లోనూ ఏయూ తన స్థానాన్ని మెరుగుపరుచుకుంది. దేశంలోని అన్ని విశ్వవిద్యాలయాలతో కూడిన జాబితాలో గతేడాది 25వ స్థానంలో ఉండగా, ఈ సంవత్సరం 23వ స్థానానికి చేరుకుంది.
మరోవైపు, దేశంలోని కేంద్రీయ, రాష్ట్ర విశ్వవిద్యాలయాలు, పరిశోధన సంస్థలతో కూడిన ఓవరాల్ కేటగిరీలో ఏయూ తన 41వ స్థానాన్ని నిలబెట్టుకుంది. అలాగే, ఫార్మసీ విభాగంలో 34 నుంచి 31వ స్థానానికి, ఇంజనీరింగ్ విభాగంలో 90 నుంచి 88వ స్థానానికి మెరుగుపడింది. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ న్యాయ కళాశాల సైతం తన 16వ ర్యాంకును పదిలంగా ఉంచుకుంది.

**సుదీర్ఘ లక్ష్యాలను నిర్దేశించుకోవాలి: మంత్రి లోకేశ్**

ఈ సందర్భంగా రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ ఆంధ్ర విశ్వవిద్యాలయానికి అభినందనలు తెలిపారు. ర్యాంకును మెరుగుపరుచుకోవడంపై హర్షం వ్యక్తం చేసిన ఆయన, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఇంకా సాధించాల్సింది చాలా ఉందని, సుదీర్ఘ లక్ష్యాల సాధన కోసం మరింతగా కృషి చేయాలని యూనివర్సిటీ యాజమాన్యానికి, సిబ్బందికి సూచించారు.

## ముగ్గురు పిల్లలపై పెట్రోల్ పోసి నిప్పంటించి ఆపై తానూ ఆత్మహత్య

**వెల్దండ:** నాగర్‌కర్నూల్ జిల్లాలో ఘోరం జరిగింది. తన ముగ్గురు పిల్లలపై పెట్రోల్ పోసి నిప్పంటించిన కిరాతక తండ్రి.. ఆపై తానూ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని ప్రకాశం జిల్లా యర్రగొండపాలేం మండలం పెద్దబోయపల్లికి చెందిన గుత్తా వెంకటేశ్వర్లు, దీపిక దంపతులు. వీరికి కుమార్తెలు మోక్షిత (8), వర్షిణి (6), శివధర్మ(4) ఉన్నారు. భార్యతో కలహాల నేపథ్యంలో గత నెల 30న కుమార్తెలు, కుమారుడిని తీసుకుని వెంకటేశ్వర్లు శ్రీశైలం వెళ్లాడు. అక్కడి నుంచి అదేరోజు రాత్రి పిల్లలను తీసుకుని తెలంగాణలోని నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట మండలం హాజీపూర్‌కు వెళ్లాడు.
31న ఉప్పునుంతల మండలం సూర్యతండా సమీపంలో చిన్నకుమార్తె వర్షిణి, కుమారుడు శివధర్మపై పెట్రోల్ పోసి నిప్పంటించాడు. ఆ తర్వాత కల్వకుర్తి మండలం తాండ్ర సమీపంలో పెద్దకుమార్తె మోక్షితను కూడా అదే తరహాలో చంపేశాడు. అనంతరం కల్వకుర్తి పట్టణానికి వెళ్లి పురుగుల మందు కొనుగోలు చేసి తాగాడు. వెల్దండ మండలం పెద్దాపుర్ శివారు బూరకుంట వద్ద బుధవారం ఉదయం వెంకటేశ్వర్లు మృతదేహం లభ్యమైంది. వెంకటేశ్వర్లు మృతదేహం లభ్యం కావడంతో అతడి సోదరుడు మల్లికార్జునరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వెల్దండ ఎస్సై కురుమూర్తి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# గంజాయిపై ఉక్కుపాదం





**ఉండవల్లి , (జర్నలిస్ట్ ఫైల్) :** గంజాయి, మాదకద్రవ్యాల సరఫరా నెట్‌వర్క్ ఆర్థికమూలాలు ఛేదించి వారిపై ఉక్కుపాదం మోపాలని గంజాయి, డ్రగ్స్ నియంత్రణ కోసం ఏర్పాటుచేసిన మంత్రివర్గ ఉపసంఘం అధికారులను ఆదేశించింది. రాష్ట్రంలో గంజాయి సాగు, డ్రగ్స్ వంటి ఇతర మాదకద్రవ్యాల నియంత్రణపై హోంమంత్రి వంగలపూడి అనిత అధ్యక్షతన ఉండవల్లి నివాసంలో మంత్రివర్గ ఉపసంఘం సమావేశమైంది. ఈ భేటీకి ఈగల్ టీం సభ్యులు, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు. రాష్ట్రంలో గంజాయి, డ్రగ్స్ నియంత్రణకు ఇప్పటివరకు చేపట్టిన చర్యలను అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. రాష్ట్రంలో గంజాయి సాగు విస్తీర్ణం తగ్గుదలపై మంత్రివర్గ ఉపసంఘం సభ్యులు ఆరా తీశారు. సరిహద్దు రాష్ట్రాల్లో గంజాయి సాగు నియంత్రణకు ఆయా రాష్ట్రాలతో సమన్వయం చేసుకుని గంజాయి సాగు, రవాణాను అరికట్టాలని మంత్రివర్గ ఉపసంఘం ఆదేశించింది. కొండ ప్రాంతాల్లో గంజాయి సాగు నియంత్రణకు శాటిలైట్ చిత్రాలు, డ్రోన్ సాయంతో తీసిన ఛాయాచిత్రాలు, వీడియోలను ఏఐ ద్వారా విశ్లేషించాలని ఉపసంఘం సభ్యులు సూచించారు. గంజాయి, మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై అన్ని విద్యాసంస్థల్లో నెలలో ఒక శనివారం ఈగల్ క్లబ్స్ ద్వారా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. గంజాయి, మాదక ద్రవ్యాల సరఫరా నెట్ వర్క్ ఆర్థిక మూలాలను ఛేదించి.. అక్రమార్కులపై ఉక్కుపాదం మోపాలని, కేసుల విషయంలో త్వరితగతిన ఛార్జిషీట్లు వేసి వారికి శిక్షలు పడేవిధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గంజాయి, మాదక ద్రవ్యాల వినియోగ ప్రాంతాలను హాట్ స్పాట్ లుగా గుర్తించి.. క్షేత్రస్థాయిలో ప్రజల నుంచి విలువైన సమాచారాన్ని రాబట్టాలని సూచించారు.

**సమాచార విశ్లేషణకు డ్యాష్ బోర్డు రూపొందించండి**

గంజాయి సాగు కోసం అమాయక గిరిజనులను పావులుగా వినియోగిస్తున్నారని, అనర్థాలపై ఐటీడీఏలు, గిరిజన సంక్షేమ శాఖ ద్వారా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని మంత్రివర్గ ఉపసంఘం ఆదేశించింది. గంజాయి, మాదక ద్రవ్యాలకు సంబంధించి క్షేత్రస్థాయి సమాచారం, కేసుల పురోగతి, నిఘా విభాగం సమాచారం, శాటిలైట్, డ్రోన్ చిత్రాల విశ్లేషణకు ఆర్టీజీఎస్ ద్వారా డ్యాష్ బోర్డ్ రూపొందించాలని ఉపసంఘం సభ్యులు ఆదేశించారు. గంజాయి, డ్రగ్స్ నియంత్రణకు ఇతర రాష్ట్రాల్లో అవలంబిస్తున్న ఉత్తమ విధానాలను అధ్యయనం చేయాలి. గంజాయి, మాదక ద్రవ్యాల మత్తుకు బానిసలైన వారిని అందులో నుంచి బయటపడేసేందుకు ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో డి-అడిక్షన్ కేంద్రాల నిర్వహణకు కార్యాచరణ రూపొందించి మెరుగైన రీతిలో పర్యవేక్షించాలని ఆదేశించారు.
ఈ కార్యక్రమంలో హోంమంత్రి వంగలపూడి అనితతో పాటు మంత్రులు నారా లోకేష్, కొల్లు రవీంద్ర, సత్యకుమార్ యాదవ్, గుమ్మడి సంధ్యారాణి, డీజీపీ హరీష్ కుమార్ గుప్తా, ఈగల్ ఐజీ ఆకే రవికృష్ణ, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఏపీ పర్యాటకానికి విస్తృత ప్రచారం

(మొదటి పేజీ తరువాయి)



తరపున హాజరైన చీఫ్ మార్కెటింగ్ అధికారిణి, కమ్యూనికేషన్ ఆఫీసర్ పద్మారాణి సీలా, రీజినల్ డైరెక్టర్ ప్రసన్న లక్ష్మీ, ఏడీ ప్రసన్న అదే విధంగా రాష్ట్రంలోని జీఆర్టీ, ఎస్ఎల్ వీ టూర్స్, సదరన్ ట్రావెల్స్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా దక్షిణ భారతదేశ పర్యాటకానికి ఏపీ ముఖ ద్వారమని ఏపీ పర్యాటక శాఖ ప్రతినిధులు పేర్కొన్నారు. సదస్సులో భాగంగా అంతర్జాతీయ దిగ్గజ కంపెనీలతో పరిచయాలు ఏర్పరుచుకోవడంతో పాటు రాష్ట్ర పర్యాటక వాణిని వినిపించారు. ఏపీ పర్యాటకానికి విస్తృత ప్రచారం కల్పించారు. రాష్ట్ర పర్యాటక రంగానికి ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీలు, ప్రోత్సాహకాలను అక్కడికి వచ్చిన ఎంఐసీఈ, కార్పొరేట్, ట్రావెల్, టెక్నాలజీ రంగాల జాతీయ, అంతర్జాతీయ ఆపరేటర్లకు వివరించారు. దాదాపు వెయ్యి కిలోమీటర్లకు పైగా సుదీర్ఘ విశాల సముద్రతీరం, సుందర బీచ్‌లు, ఎత్తైన హిల్ ప్రదేశాలు, ప్రకృతి రమణీయ ప్రాంతాలు, ప్రసిద్ధ అధ్యాత్మిక క్షేత్రాలు ఏపీ సొంతమని తెలిపారు. అమరావతి, నాగార్జున కొండ, తొట్లకొండ తదితర ప్రాంతాలు బుద్ధిజానికి ప్రతీకగా నిలిచాయని తెలిపారు. సుస్థిర, బాధ్యతాయుత, సమగ్ర, పర్యావరణహిత పర్యాటక విధానాలతో రూపొందించిన రాష్ట్ర పర్యాటక పాలసీ-2024-29ని, పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదా కల్పనను వివరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర పర్యాటక ప్రాంతాలపై పలు దేశాల టూర్ ఆపరేటర్లు, ట్రావెలర్లు ఆసక్తి చూపారు. ఏపీ పర్యాటక ప్రాంతాల విశిష్టత, భౌగోళిక సమాచారం తీసుకున్న ఆయా సంస్థల ప్రతినిధులు తీసుకున్నారు. అనంతరం ఏపీలోని టూర్ అండ్ ట్రావెల్ ఆపరేటర్లతో ఇతర దేశాల ప్రతినిధుల సమన్వయం చేసుకున్నారు. ఈ సదస్సు ద్వారా ఏపీలో బుద్ధిస్ట్ సర్క్యూట్ లలో, సాహస పర్యాటకం, చారిత్రక సాంస్కృతిక పర్యాటకంలో పెట్టుబడులు పెట్టేందుకు పలువురు ఆసక్తి చూపారని ఏపీ ప్రతినిధులు స్పష్టం చేశారు. ఐటీబీ ఇండియా 2025తో భారతదేశం మరియు దక్షిణాసియాలో ఏపీ పర్యాటక రంగం గురించి తెలియడంతో పాటు తమకు స్నేహపూర్వక సంబంధాలు ఏర్పడ్డాయని అంతర్జాతీయ కంపెనీల ప్రముఖులు పేర్కొన్నారు. ఈ సదస్సు ద్వారా భవిష్యత్ లో రాష్ట్ర పర్యాటక రంగం అభివృద్ధి చెందే అవకాశం ఉంది.

## రెండు ఓటరు కార్డులు కలిగి ఉండడం నేరం!



**ఢిల్లీ :** దేశవ్యాప్తంగా ఓటర్లకు భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) ఒక కీలకమైన హెచ్చరిక జారీ చేసింది. ఒక వ్యక్తి పేరు మీద ఒకటి కంటే ఎక్కువ ఓటర్ గుర్తింపు కార్డులు ఉండటం తీవ్రమైన నేరమని, అలాంటి వాటిని వెంటనే ప్రభుత్వానికి అప్పగించాలని స్పష్టం చేసింది. ఈ నిబంధనను ఉల్లంఘించిన వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తేల్చిచెప్పింది.
ఎన్నికల ప్రక్రియలో పారదర్శకతను కాపాడటంలో భాగంగా ఈసీఐ ఈ నిర్ణయం తీసుకుంది. ఒకే వ్యక్తి బహుళ ఓటు హక్కును వినియోగించుకోవడాన్ని నివారించేందుకే ఈ నిబంధనలను కఠినంగా అమలు చేస్తున్నట్లు పేర్కొంది. ప్రజాప్రాతినిధ్య చట్టం ప్రకారం ఇది శిక్షార్హమైన నేరమని అధికారులు గుర్తు చేస్తున్నారు. ఎన్నికల వ్యవస్థపై ప్రజలకు నమ్మకం కలిగించడమే తమ లక్ష్యమని ఈసీఐ తెలిపింది.
ఈ నేపథ్యంలో, ఓటర్లు తమ పేరు మీద ఎన్ని కార్డులు ఉన్నాయో సరిచూసుకోవాలని ఎన్నికల సంఘం సూచించింది. ఈసీఐ అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించడం ద్వారా గానీ, సమీపంలోని ఎన్నికల కార్యాలయానికి వెళ్లి గానీ తమ వివరాలను తనిఖీ చేసుకోవచ్చు. ఒకవేళ అదనపు కార్డులు ఉన్నట్లు గుర్తిస్తే, నిర్దేశిత పద్ధతిలో వాటిని వెంటనే సరెండర్ చేయాల్సి ఉంటుంది. ఫారం-7ని సమర్పించడం ద్వారా ఒక ఓటరు కార్డు రద్దు చేసుకోవాలని ఈసీ సూచించింది.
ఆదేశాలను బేఖాతరు చేసి, అదనపు ఓటర్ కార్డులను కలిగి ఉన్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎన్నికల సంఘం గట్టిగా హెచ్చరించింది. కాబట్టి, ఓటర్లందరూ బాధ్యతగా వ్యవహరించి, తమ వద్ద ఉన్న అదనపు కార్డులను స్వచ్ఛందంగా అప్పగించి, ఎన్నికల వ్యవస్థ పవిత్రతను కాపాడటంలో సహకరించాలని విజ్ఞప్తి చేసింది.

## స్మార్ట్ రేషన్ కార్డు ద్వారా మెరుగైన ప్రయోజనం : ఎమ్మెల్సీ ఆలపాటి



**తెనాలి,(జర్నలిస్ట్ ఫైల్)** క్యూఆర్ కోడ్ ఆధారిత స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా తెల్ల రేషన్ కార్డుదారులకు ఏ రేషన్ షాప్ లో అయినా రేషన్ తీసుకునే సదుపాయం ప్రభుత్వం కల్పించిందని,నిత్యావసర రేషన్ అందుబాటులోకి రానుందని
ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. పట్టణంలోని 16, 17 వార్డులలో గురువారం ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయా వార్డు కౌన్సిలర్లు వెంటరాగ, మైనార్టీ మహిళలకు స్మార్ట్ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కోటి 46 లక్షల తెల్ల కార్డుదారులకు స్మార్ట్ కార్డులు పంపిణీ జరుగుతుందన్నారు. రేషన్ పంపిణీ కార్యాచరణలో తీసుకున్న మార్పులను వివరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షులు మహమ్మద్ కుద్దూస్, వార్డు కౌన్సిలర్లు దీవి అనిత, అన్నం పిన్నారావు, పసుపులేటి త్రిమూర్తులు, మల్లీశ్వరి, కుదరవల్లి శ్రీను తదితరులు ఉన్నారు.

## బ్యాంక్ అకౌంట్ రెంటల్ ఫ్రాడ్..

**కోల్‌కతా :** మీ బ్యాంకు ఖాతా వివరాలను ఎవరికైనా ఇస్తున్నారా? అయితే జాగ్రత్తగా ఉండండి. అమాయకుల బ్యాంకు ఖాతాలను అద్దెకు తీసుకుని, వారి పేరుతో లక్షల్లో రుణాలు తీసుకుంటున్న ఒక కొత్త తరహా మోసం కోల్‌కతాలో వెలుగు చూసింది. ఈ "బ్యాంక్ అకౌంట్ రెంటల్ ఫ్రాడ్" కారణంగా బాధితులు తెలియకుండానే రుణ ఎగవేతదారులుగా మారి అరెస్ట్ అవుతుండటంతో, కోల్‌కతా పోలీసులు ప్రజలను హెచ్చరిస్తున్నారు.

**ఏం జరుగుతోంది?**

ఈ మోసంలో కేటుగాళ్లు సులభంగా రుణాలు ఇప్పిస్తామనో, ఇతర ఆర్థిక ప్రయోజనాలు కల్పిస్తామనో నమ్మించి ప్రజల నుంచి వారి బ్యాంకు ఖాతా వివరాలు సేకరిస్తున్నారు. ముఖ్యంగా గృహిణులు, ఆర్థికంగా వెనుకబడిన వారే వీరి లక్ష్యంగా ఉంటున్నారు. బాధితుల పేరుతో నకిలీ పే-స్లిప్‌లు, ఇతర పత్రాలు సృష్టించి వాటిని రుణ సంస్థలకు సమర్పిస్తున్నారు. రుణం మంజూరైన వెంటనే, ఆ డబ్బును తమ ఖాతాల్లోకి మళ్లించుకుంటున్నారు.
ఈ వ్యవహారం జరుగుతున్నంత సేపు అసలు ఖాతాదారునికి ఎలాంటి సమాచారం ఉండదు. రుణం తీసుకున్న మోసగాళ్లు వాయిదాలు చెల్లించకపోవడంతో సంబంధిత రుణ సంస్థలు అసలు ఖాతాదారునిపై ఫిర్యాదు చేస్తున్నాయి. దీంతో ఏ పాపం తెలియని అమాయకులు అప్పుల ఊబిలో కూరుకుపోవడమే కాకుండా, పోలీసుల చేతిలో అరెస్ట్ అవుతున్నారు.
ఇటీవల కోల్‌కతాలోని టాలీగంజ్ ప్రాంతానికి చెందిన రీటా వైద్య సేన్‌గుప్తా అనే మహిళను పోలీసులు అరెస్ట్ చేశారు. ఆమె పేరు మీద నకిలీ పత్రాలతో ఒక రుణ సంస్థ నుంచి ఏకంగా ఐదు లక్షల రూపాయల రుణం తీసుకున్నట్లు తేలింది. అయితే ఆ రుణం గురించి తనకు ఏమీ తెలియదని ఆమె వాపోయారు. అదేవిధంగా, బాన్స్‌ద్రోణి ప్రాంతానికి చెందిన ఇమ్రాన్ అన్సారీ అనే యువకుడిని కూడా చండీగఢ్ పోలీసులు కోల్‌కతా పోలీసుల సహాయంతో అరెస్ట్ చేశారు. అతని బ్యాంకు ఖాతాను ఉపయోగించి మోసగాళ్లు భారీ రుణం పొందడమే ఇందుకు కారణం. ఈ రెండు ఘటనల్లోనూ బాధితులకు తెలియకుండానే మోసం జరిగిపోయింది.
ఈ మోసాల వెనుక ఒక పెద్ద సూత్రధారి ఉన్నాడని, అతని కోసం గాలిస్తున్నామని కోల్‌కతా పోలీస్ డిటెక్టివ్ బ్రాంచ్‌కు చెందిన ఓ సీనియర్ అధికారి గురువారం తెలిపారు.

# ఆఫ్ఘనిస్థాన్ లో భూకంప విలయం...



**ఆఫ్ఘనిస్థాన్ :** ఆఫ్ఘనిస్థాన్‌లో సంభవించిన భారీ భూకంపం పెను విషాదాన్ని మిగిల్చింది. దేశ తూర్పు ప్రాంతాన్ని కుదిపేసిన ఈ ప్రకృతి విపత్తులో మరణించిన వారి సంఖ్య 2,200 దాటింది. మరో 4,000 మంది ప్రజలు తీవ్రంగా గాయపడ్డారు. పాకిస్థాన్ సరిహద్దుకు సమీపంలో ఉన్న కునార్ ప్రావిన్స్‌లో భూకంప తీవ్రత అత్యధికంగా ఉంది. సహాయక చర్యలు కొనసాగుతున్నప్పటికీ, కొండ ప్రాంతాలు కావడంతో సహాయక బృందాలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి.
తాలిబాన్ ప్రభుత్వ వర్గాల సమాచారం ప్రకారం, ఈ భూకంపంలో ఇప్పటివరకు 2,217 మంది ప్రాణాలు కోల్పోయారని, సుమారు 4,000 మంది గాయపడ్డారని డిప్యూటీ ప్రభుత్వ ప్రతినిధి హందుల్లా ఫిత్రత్ 'ఎక్స్' ద్వారా వెల్లడించారు. సహాయక చర్యలు ఇంకా కొనసాగుతున్నాయని ఆయన తెలిపారు. భూకంప తీవ్రత రిక్టర్ స్కేలుపై 6.0గా నమోదైంది.
భూకంప ధాటికి అనేక గ్రామాలు పూర్తిగా నేలమట్టమయ్యాయి. మట్టి, కలపతో నిర్మించిన ఇళ్లు పేకమేడల్లా కూలిపోవడంతో వందలాది కుటుంబాలు శిథిలాల కింద చిక్కుకుపోయాయి. హెలికాప్టర్లు దిగలేని మారుమూల పర్వత ప్రాంతాల్లో చిక్కుకున్న వారిని రక్షించేందుకు తాలిబాన్ అధికారులు కమాండోలను గాల్లోంచి దించుతున్నారు. ఇదిలా ఉండగా, గురువారం మరోసారి 4.8 తీవ్రతతో భూమి కంపించడం ప్రజలను మరింత భయాందోళనకు గురిచేసింది. యూఎస్ జియోలాజికల్ సర్వే ప్రకారం, మంగళవారం కూడా 5.2 తీవ్రతతో భూకంపం సంభవించింది.
ఈ విపత్తుపై స్పందించిన భారత్, ఆఫ్ఘనిస్థాన్‌కు అండగా నిలిచింది. 21 టన్నుల సహాయ సామగ్రితో కూడిన విమానాన్ని కాబూల్‌కు పంపింది. ఇందులో టెంట్లు, దుప్పట్లు, అత్యవసర మందులు, జనరేటర్లు, నీటి ట్యాంకులు ఉన్నాయి. పరిస్థితిని నిశితంగా గమనిస్తున్నామని, అవసరమైన మరింత సహాయం అందిస్తామని భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ తెలిపారు. యూరేషియన్, ఇండియన్ టెక్టోనిక్ ప్లేట్ల సమీపంలో ఉండటం, బలహీనమైన నిర్మాణాల కారణంగా ఆఫ్ఘనిస్థాన్‌లో తరచూ భూకంపాలు తీవ్ర నష్టాన్ని కలిగిస్తున్నాయి.

# అమెరికా ఆంక్షల వేళ.. జర్మనీ వైపు భారత విద్యార్థుల చూపు!

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** విద్యార్థులు, వలసదారులపై అమెరికా కఠిన ఆంక్షలు విధిస్తున్న వేళ.. భారతీయ విద్యార్థులు అగ్రరాజ్యం వైపు శీతకన్ను వేస్తున్నట్లు తెలుస్తోంది. గతేడాదితో పోలిస్తే ఈసారి అమెరికా యూనివర్సిటీల్లో దరఖాస్తులు భారీగా తగ్గినట్లు తాజా నివేదిక వెల్లడించింది.
భారతీయ విద్యార్థులు ఉన్నత చదువుల కోసం ఇటీవల అమెరికా కాకుండా ప్రత్యామ్నాయ దేశాలను చూసుకుంటున్నట్లు తెలుస్తోంది. గతేడాదితో పోలిస్తే అమెరికాకు దరఖాస్తులు 13శాతం తగ్గగా.. జర్మనీ, యూఏఈ వైపు భారీగా చూస్తున్నట్లు 'ట్రాన్స్‌నేషనల్ ఎడ్యుకేషన్ రిపోర్ట్ 2024-25' పేరుతో ఎడ్‌టెక్ కంపెనీ 'అప్‌గ్రాడ్' రూపొందించిన నివేదిక వెల్లడించింది. 2022లో జర్మనీకి 13.2శాతం ఉండగా.. 2024-25లో 32.6శాతానికి పెరిగింది. కాగా యూఏఈలోని విదేశీ విద్యార్థుల్లో 42శాతం భారతీయులే కావడం విశేషం.
భారతీయ విద్యార్థులకు పశ్చిమాసియా గమ్యస్థానంగా మారుతోందని తాజా నివేదిక వెల్లడించింది. దుబాయ్, ఖతార్‌లలోని జార్జ్‌టౌన్, జాన్స్ హాప్కిన్స్, ఆర్ఐటీ, కార్నెగీ మెలన్, వెయిల్ కార్నల్ వంటి అమెరికా యూనివర్సిటీ శాటిలైట్ క్యాంపస్‌లు.. స్వదేశంలో మాదిరి సమాన స్థాయి డిగ్రీలను అందిస్తున్నాయని తెలిపింది.
2022లో భారతీయ విద్యార్థులకు అమెరికా (19శాతం), కెనడా (18శాతం)లు ప్రధాన గమ్యస్థానాలుగా ఉన్నట్లు తాజా నివేదిక వెల్లడించింది. 2023లో అమెరికాకు భారీగా దరఖాస్తులు పెరిగినప్పటికీ.. ఆ తర్వాత పరిస్థితుల కారణంగా ప్రత్యామ్నాయాలవైపు విద్యార్థులు చూస్తున్నట్లు తెలిపింది. కెనడాకు కూడా 2022లో 18శాతం దరఖాస్తులు రాగా, 2025కు వచ్చేసరికి ఈ సంఖ్య 9శాతానికి తగ్గిందని పేర్కొంది.
ఇక బ్రిటన్ మాత్రం ఏటా వేలాది మంది విద్యార్థులను ఆకర్షిస్తున్నట్లు తెలిపింది. ప్రపంచ ప్రఖ్యాత యూనివర్సిటీలు ఉండటం, స్వల్పకాలిక పీజీలు, విస్తృత విభాగాల్లో కోర్సులు అందించడం ఇందుకు దోహదం చేస్తోందని సదరు నివేదిక పేర్కొంది. ఐర్లాండ్ కూడా భారత విద్యార్థులను ఆకర్షిస్తున్నట్లు సమాచారం.

### కాంగ్రెస్, బిఆర్ఎస్ మధ్య డీల్‌తో

# కమిషన్ నివేదిక లోపభూయిష్టం

### బిజెపి మాజీ ఎమ్మెల్యే ఎన్‌విఎస్ఎస్ ప్రభాకర్

**హైదరాబాద్, సెప్టెంబరు 4(జర్నలిస్ట్‌ఫైల్):** కాంగ్రెస్, బిఆర్ఎస్ మధ్య జరిగిన డీల్ వల్లే కమిషన్ నివేదిక లోపభూయిష్టంగా ఉందని బిజెపి మాజీ ఎమ్మెల్యే ఎన్‌విఎస్ఎస్ ప్రభాకర్ అన్నారు. బుధవారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడారు. బీహార్ ఎన్నికల కోసం ఖజానా చోరీ జరిగిందని, సూట్‌కేసులు అందాక బిఆర్ఎస్ కోర్టుకు వెళ్లి ఉపశమనం పొందిందన్నారు. విచారణ కోసం సిబిఐకి ఇస్తున్నట్లు కొత్త నాటకానికి తెర లేపిందన్నారు. ప్రభుత్వం కాంగ్రెస్ వ్యవహారం తెలిసే బిజెపి ముందు నుంచి సిబిఐకి ఇవ్వాలని డిమాండ్ చేసిందన్నారు. రేవంత్ కమిషన్ వేస్తే రాహుల్ గాంధీ కమీషన్ దండుకోవాలని చూస్తున్నార న్నారు. కెసిఆర్, హరీష్ రావును కాపాడుతుంది రాహుల్ గాంధీ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించిన ఏజీ న్యాయస్థానంలో ఎవరి కోసం వాదిస్తున్నారనే అనుమానం ప్రజలకు కలుగుతుం దన్నారు.కాళేశ్వరం కమిషన్ నివేదికపై ప్రభుత్వం సిబిఐ విచారణ కోరిందన్నారు. పిసి ఘోష్ కమిషన్ నివేదికపై రాష్ట్ర హైకోర్టులో ప్రభుత్వ అడ్వకేట్ జనరల్ బలమైన వాదనలు వినిపించకపోవడంవల్లనే టిఆర్ఎస్ నాయకులు కెసిఆర్‌కి, హరీష్‌రావుకి ఉపశమనం కలిగిందన్నారు.

# 20 శాతం అదనపు సీట్లు కేటాయించాలి

### సిఎం రేవంత్‌రెడ్డికి ఎంపి ఆర్.కృష్ణయ్య లేఖ

**హైదరాబాద్, సెప్టెంబరు 4(జర్నలిస్ట్‌ఫైల్):** రాష్ట్రంలో 100 బీసీ కాలేజీ హాస్టల్‌ను మంజూరు చేయాలని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి రాసిన లేఖను మీడియాకు విడుదల చేశారు. ప్రస్తుత కొనసాగుతున్న హాస్టల్లో 20 శాతం అదనపు సీట్లు కేటాయించాలన్నారు. హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్, నల్లగొండ, వరంగల్, కరీంనగర్, సంగారెడ్డి, నిజాంబాద్ జిల్లా హెడ్ క్వార్టర్లలో సీట్లు లభించక వేలాది మంది విద్యార్థులు సీట్ల కోసం ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కావున వెంటనే ప్రభుత్వం స్పందించి డిమాండ్ అధికంగా ఉన్న జిల్లాలలో బిసి కాలేజీ హాస్టళ్లను మంజూరు చేయాలని ఆయన సీఎంకు విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ జిల్లాలో 10 బాలికల,10 బాలుర హాస్టల్స్ చొప్పున మంజూరు చేయాలని, అలాగే మహబూబ్‌నగర్ జిల్లాలో ఐదు బాలికల, ఐదు బాలుర హాస్టల్స్, సంగారెడ్డి జిల్లాలో ఐదు బాలికల,ఐదు బాలుర హాస్టల్స్,వికారాబాద్ జిల్లాలో ఐదుబాలుర ,ఐదు బాలికల హాస్టల్స్, వరంగల్ జిల్లాలో ఐదు బాలికల, ఐదు బాలుర హాస్టల్స్, నల్లగొండ జిల్లాలో ఐదు బాలికల, ఐదు బాలుర హాస్టల్స్, వరంగల్ జిల్లాలో ఐదు బాలికల, ఐదు బాలుర హాస్టల్స్,మేడ్చల్ జిల్లాలో ఐదు బాలికల,ఐదు బాలురు హాస్టల్స్,రంగారెడ్డి జిల్లాలో ఐదు బాలికల, ఐదు బాలుర హాస్టల్స్‌లను మంజూరు చేయాలని ఆర్.కృష్ణయ్య సిఎంకు విజ్ఞప్తి చేశారు.

# అంగన్‌వాడీ టీచర్ల సమస్యలు పరిష్కరించాలి

### మంత్రి సీతక్కకు విజ్ఞప్తి చేసిన ఎఐటియుసి నాయకులు

**హైదరాబాద్,సెప్టెంబరు 4(జర్నలిస్ట్‌ఫైల్):** అంగన్‌వాడీ టీచర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ హెల్పర్స్ అసోషియేషన్ (ఎఐటియుసి) రాష్ట్ర అధ్యక్షురాలు సాయీశ్వరి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నందూరి కరుణకుమారి,రాష్ట్ర డిప్యూటి జనరల్ సెక్రటరి సీతా మహాలక్ష్మీలు మంత్రి సీతక్కకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు వారు బుధవారం సచివాలయంలో ఆమెకు వినతి పత్రం అందించారు. పోషణ్ ట్రాకర్ యాప్‌లో భాగంగా ఫేస్‌రికగ్నిజేషన్ సిస్టమ్‌ను అమలు చేయడంతో అంగన్‌వాడీలు సేవలు అందించేందుకు ఇబ్బందులను ఎదుర్కొంటున్నామన్నారు. ఐసిడిఎస్ పరిధిలో అంగన్‌వాడీ సేవలు గర్భిణీలకు, పాలిచ్చే తల్లులకు, 6 నెలల నుండి 3 సంవత్సరాల వరకు ఉన్న పిల్లలకు టేక్ హోమ్ రేషన్ (టిహెచ్‌ఆర్) మరియు పోషక సహాయం అందించేవని, అయితే, ఇప్పుడు ఎఫ్‌ఆర్ఎస్ అమలుతో అనేక మంది లబ్ధిదారులు పోషకాహారాన్ని పొందలేక పోతున్నారు. డిజిటైలేజషన్ ఆమోదించదగ్గదే కాని ఇది బలహీన వర్గాల కోసం ఇబ్బంది కలిగించే సాధనంగా మారకూడదన్నారు. ఎఫ్ఆర్ ఎస్ తప్పనిసరి అమలు రద్దు చేయాలని, ఆధార్ లేదా ఫేస్ రికగ్నిషన్ లేకుండా అర్హులైన లబ్ధిదారులు పోషణ పొందేలా చూడాలన్నారు. ఎన్‌హెచ్‌టిఎస్ పోషణ ట్రాకర్ యాప్‌లను ఒకటిగా రూపొందించి సరళతరం చేయాలని మంత్రికి వారు విజ్ఞప్తి చేశారు.

# కాళేశ్వరం అవినీతి బయటపడ్డాక, కెసిఆర్ కుటుంబంలో పంచాయతీ: మంత్రి అడ్లూరి లక్ష్మణ్

**హైదరాబాద్, సెప్టెంబరు 4(జర్నలిస్ట్‌ఫైల్):** కాళేశ్వరం అవినీతి బయట పడిన తరువాత కెసిఆర్ కుటుంబంలో పంచాయతీ మొదలైందని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ అన్నారు. బుధవారం గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడారు. అది కుటుంబ తగాదా అని, కవిత టిఆర్ఎస్‌పై అనేకసార్లు దాడి చేసిందన్నారు. కల్వకుంట్ల కుటుంబంలో ఆరు నెలల నుంచి ఇంటర్నల్ పంచాయతీ జరుగుతుందన్నారు. లక్ష కోట్లు దోచుకున్నాక మాట్లాడడం ఏంటి? అంటూ ప్రశ్నించారు. హరీష్ రావు వెనుక రేవంత్ రెడ్డి ఉంటే కాళేశ్వరంపై విచారణ ఎందుకు చేయిస్తారు, కమిషన్ ఎందుకు వేస్తారు అన్నారు. మీ కుటుంబం దొంగతనం చేసిందని ఒప్పుకుంటున్నావు కదా? కాళేశ్వరం అవినీతిలో హరీష్ రావు, సంతోష్ రావు బాధ్యులని కవిత ఒప్పుకుందన్నారు. వారు మీ కుటుంబ సభ్యులే కదా, మాకేం సంబంధం అనడం ఏమిటన్నారు. పది ఏళ్లలో రాష్ట్ర ఖజానలో వేల కోట్లు ఖూనీ చేశారని, హరీష్ రావు వెనుక రేవంత్ రెడ్డి ఉన్నారనేది గ్లోబల్ ప్రచారం మాత్రమే అన్నారు. కవితని బిఆర్ఎస్ నుంచి సస్పెండ్ చేయాల్సింది ఇప్పుడు కాదు, లిక్కర్ స్కామ్‌లో అరెస్ట్ అయినప్పుడే సస్పెండ్ చేయాలి కదా అన్నారు.

# తాటికుంట రిజర్వాయర్‌లో భార్య భర్తలు గల్లంతు

### బోటులో వెళ్లి పరిశీలించిన ఎమ్మెల్యే, ఎస్పీ




**మల్దకల్ సెప్టెంబరు 4(జర్నలిస్ట్‌ఫైల్) :** మల్దకల్ మండలం తాటికుంట గ్రామంలో చేపల వేటకు వెళ్లిన దంపతులు గల్లంతవడంతో గ్రామంలో విషాదం చాయలు అలుముకున్నాయి. పోలిసులు తెలిపిన వివరాల ప్రకారం మంగళవారం సాయంత్రం ఆరు గంటల సమయంలో తాటికుంట గ్రామానికి చెందిన దుబ్బోనీబావి రాముడు (40), భార్య సంధ్య (35) ఇద్దరూ తాటికుంట రిజర్వాయర్ కు చేపల వేట కోసం వెళ్లారు. అయితే రాత్రి తిరిగి ఇంటికి రాకపోవడంతో బంధువులు ఆందోళనకు గురయ్యారు. స్థానికులు వెతికినా ఎటువంటి ఆచూకీ లభించకపోవడంతో వెంటనే అధికారులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న వెంటనే ఎస్ డి ఆర్ ఎఫ్ బృందాలు సంఘటన స్థలానికి చేరుకొని గాలింపు చర్యలు ప్రారంభించాయి. ఇప్పటివరకు దంపతుల ఆచూకీ తెలియకపోవడంతో గ్రామంలో ఆందోళన నెలకొంది. విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి , జిల్లా ఎస్పీ శ్రీనివాసులు రావు సంఘటన స్థలానికి చేరుకుని రిజర్వాయర్‌లోకి బోటులో వెళ్లి పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామంలో తీవ్ర విషాద సంఘటన జరగడం చాలా బాధాకరం అని తెలిపారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రభుత్వం నుండి వారికి సహాయమందించే విధంగా కృషి చేయడం జరుగుతుంది తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ వ్యవసాయ మార్కెట్ యార్డ్ ఛైర్మన్ శ్రీధర్ గౌడ్, మాజీ కౌన్సిలర్ మురళి, నాయకులు ప్రభాకర్ గౌడ్, అజమ్, చంద్రశేఖర్ రెడ్డి, అధికారులు నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# నీటి సంపులో పడి ఇద్దరు చిన్నారుల మృతి

**ఊట్కూర్, సెప్టెంబరు 4(జర్నలిస్ట్‌ఫైల్):** ఊట్కూర్ మండలం పరిధిలోని తిమిరెడ్డిపల్లె తండాలో ఘోర విషాదం చోటుచేసుకుంది. స్థానికుల సమాచారం మేరకు జయమ్మ-పునే నాయక్ దంపతులకు ఇద్దరు కుమారులు అభి, ఆకాష్ నీటి సంపులో జారిపడి ప్రాణాలు కోల్పోయారు. జీవనోపాధి కోసం హైదరాబాద్‌లో కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్న కుటుంబం, వినాయక నిమజ్జనానికై స్వగ్రామానికి వచ్చింది. ఇటీవల ఇంటి నిర్మాణం కోసం గ్రామంలో కొత్తగా నీటి సంపు తవ్వించగా, అందులో చిన్నారులు జారిపడినట్లు గ్రామస్థులు తెలిపారు.

# స్థానిక సంస్థలలో వికలాంగులకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలి

### టిపిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్‌ను కోరిన వికలాంగుల సాధన కమిటీ

**హైదరాబాద్, సెప్టెంబరు 4(జర్నలిస్ట్‌ఫైల్):** రాష్ట్రంలో త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో వికలాంగులకు తగిన ప్రాధాన్యత కల్పించాలని వికలాంగుల ప్రాతినిధ్య సాధన కమిటీ సభ్యులు టిపిసిసి ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్‌ను వికలాంగుల సాధన కమిటీ సభ్యులు కోరారు. బుధవారం గాంధీభవన్‌లో మహేష్‌కుమార్‌గౌడ్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ప్రతి మండలానికి కనీసం రెండు ఎంపిటిసి స్థానాల్లో వికలాంగులు ప్రాతినిధ్యం వహించేలా ప్రభుత్వం తక్షణమే చొరవ తీసుకోవాలని వారు కోరారు.

# సమ్మక్కసారక్క జాతర ఖ్యాతి ఖండాంతరాలు దాటాలి

### మేడారం మాస్టర్ ప్లాన్ సమీక్షా సమావేశంలో మంత్రులు కొండా సురేఖ, సీతక్క, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

**హైదరాబాద్,సెప్టెంబరు 4(జర్నలిస్ట్‌ఫైల్):** తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీక అయిన సమ్మక్క సారక్క వనదేవతల జాతర ఖ్యాతి ఖండాంతరాలు దాటాలని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వెల్ఫేర్‌శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌లు పేర్కొన్నారు. బుధవారం రాష్ట్ర సచివాలయంలోని దేవాదాయ శాఖ మంత్రి కార్యాలయం కాన్ఫరెన్స్‌హాలులో మేడారం మాస్టర్ ప్లాన్ సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సమ్మక్క సారలమ్మ పూజారుల సూచనల మేరకు మేడారం దేవాలయ ప్రాంగణ నూతన డిజైన్‌ను మంత్రులు ప్రత్యేకంగా పరిశీలించారు. డిజైన్లలో చేయాల్సిన మార్పులపై మంత్రులు సూచనలు చేశారు. మేడారం నిర్వహణ పనులను సకాలంలో పూర్తి చేసే విధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మహా మేడారం జాతరలోపు పూర్తి చేయాల్సిన పనులను త్వరగా చేపట్టాలని మంత్రులు సూచించారు. భక్తుల సందర్శనార్థం అమ్మవారి గద్దెల ఎత్తు పెంచాలని పూజారులు ప్రభుత్వం దృష్టికి తీసుకురాగా తగిన మేరకు డిజైన్లు మార్చాలన్నారు. భక్తుల సందర్శనార్థం సమ్మక్క, సారలమ్మ, పగిడిద్దరాజు గోవిందరాజుల గద్దెలు ఒకే వరుస క్రమంలో ఉండేలా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. తద్వారా ఎలాంటి జాప్యం లేకుండా సమ్మక్క సారలమ్మ అమ్మవార్లను భక్తులు దర్శించుకునేందుకు అనువుగా ఉంటుందని మంత్రులు చెప్పారు. గత జాతర అనుభవాలను దృష్టిలో ఉంచుకొని మరిన్ని ఏర్పాట్లు చేయాల్సిన అవసరం ఉందన్నారు. సమ్మక్క సారలమ్మ సేవ కోసం జాతర సమయంలో భక్తులకు సహాయపడేందుకు వాలంటీర్లను నియమించాలన్నారు. ఆదివాసి సంస్కృతి సాంప్రదాయ బద్ధంగా మేడారం పరిసరాలను తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందన్నారు. మేడారం చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఈ మహా మేడారం జాతరకు రూ. 150 కోట్లు ప్రజా ప్రభుత్వం కేటాయించిందని గుర్తు చేశారు. అవసరమైతే ఇతర శాఖల సహాయంతో మరిన్ని నిధులు కేటాయిస్తామన్నారు. జాతర నిర్వహణ ఏర్పాట్లు, మేడారం మాస్టర్ ప్లాన్ డిజైన్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్ళి ఆయన అనుమతి తీసుకున్న తర్వాత ముందుకు వెళతామన్నారు. మేడారం అభివృద్ధి ప్రతి దశలో పూజారుల ను భాగస్వామ్యం చేస్తామన్నారు. సమ్మక్క సారలమ్మల త్యాగాన్ని ఔన్నత్యాన్ని మరింత చాటి చెప్పే విధంగా మేడారం ఆలయ ప్రాంగణాన్ని సిద్ధం చేస్తామన్నారు. సమ్మక్క, సారలమ్మ దర్శనానికి వచ్చే భక్తుల సంఖ్య ప్రతి ఏటా పెరుగుతూ వస్తుందని మంత్రులు చెప్పారు. దేశ విదేశాల నుంచి వచ్చే వారి కోసం సకల సౌకర్యాలు కల్పించేందుకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. శాశ్వత ప్రాతిపదికన ఏర్పాట్లు జరిగితే మేడారం జాతరమరింత అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. జాతర సమయంలో వెహికల్ మేనేజ్మెంట్ సరైన విధంగా ఉండేలా డిజైన్‌లు రూపకల్పన చేయాలని, ఫ్యూరిఫైడ్ వాటర్ అందించాలని మంత్రి సురేఖ సూచించారు. బెల్లం కింద పడకుండా చర్యలు తీసుకోవాలని మంత్రి అడ్లూరి సలహానిచ్చారు. బ్యాటరీ వెహికల్స్‌ను వినియోగించుకోవాలన్నారు. క్రౌడ్ మేనేజ్‌మెంటుకి ఏఐ ఎనబుల్డ్ కెమేరాలను ఉపయోగించాలని, సేవా పద్ధతిన భక్తులను మ్యాన్ పవర్ కింది వినియోగించుకోవాలన్నారు. వనజాతర వస్తున్న తరుణంలో దారి పొంటి ఉన్న టెంపుల్స్‌ను కూడా అవసరమైన మేరకు అలంకరణ చేయాలన్నారు. ఈ క్రమంలో భక్తులు ఆయా టెంపుల్‌లను దర్శించుకుంటారని మంత్రి సురేఖ చెప్పారు. జాతర వెళ్ళే దారి ఇందిరా మహిళా క్యాంటీలను ద్వారా తినుబండారాలను అందే విధంగా చూడాలన్నారు. అవసరమైతే అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలను వివిధ ప్రదేశాల్లో ఉపయోగించుకొని తగు సేవలు భక్తులకు అందజేయాలన్నారు. జాతర విజయవంతం రహదారులపై ఆధారపడి ఉంటుందని అందుకే, మేడారం ఊరట్టం, మేడారం కన్నెపల్లితో పాటు మరో నాలుగు మార్గాల విస్తరణ పనులు చేపడుతున్న వివరాలు మంత్రులకు అధికారులు తెలిపారు. నేషనల్ హైవే అధికారులతో అవసరమైతే మరొకసారి రివ్యూ చేయాలని మంత్రులు నిర్ణయించారు. సమ్మక్క, సారక్క అమ్మవార్ల గద్దెల ప్రాంగణంలో పూర్వం నుంచి చోటుచేసుకున్న మార్పులు, పూజారుల ప్రమేయం, అంగీకారంతోనే చేయాలని మంత్రులు అధికారులకు సూచించారు. గద్దెల ప్రాంగణంలో భక్తుల రద్దీ అధికంగా ఉంటుందని మాస్టర్ ప్లాన్ లో భాగంగా దాన్ని క్రమబద్ధీకరించే విధంగా ఏర్పాట్లు చేయాలన్నారు. డిసెంబర్ వరకు ఎంతమేరకు వర్కులు పూర్తవుతాయో చెప్పాలన్నారు. మాస్టర్ ప్లాన్‌లో మొత్తం రెండు ఫేజ్‌లుగా స్థానికంగా అభివృద్ధి పనులు చేపడుతున్నరని అన్నారు. గతం కంటే ఈ సారి చాలా ఘనంగా జరపాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలోఎండోమెంటు ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, ములుగు కలెక్టర్ దివాకర్ తదితరులు పాల్గొన్నారు. పలుమార్లు కుంభమేళలు నిర్వహించిన సంస్థకు మాస్టర్ ప్లాన్ నిర్వహణ బాధ్యతలు అప్పగించినట్లు అధికారులు మంత్రులకు వివరించారు. మొత్తం రూ. 236.2 కోట్లతో మాస్టర్ రూపొందించగా, గద్దెల అభివృద్ధికి రూ. 58.2 కోట్లు గద్దెల వద్ద కళాకృతి పనులకు రూ. 6.8 కోట్లు జంపన్న వాగు అభివృద్ధి కోసం రూ. రూ39 కోట్లు. భక్తుల అకామిడేషన్ నిమిత్తం రూ. 50 కోట్లు రోడ్ల అభివృద్ధి నిమిత్తం రూ. 52.5కోట్లు మిగతావి ఇతరత్రా ఖర్చుల నిమిత్తం వెచ్చించనున్నారు.



బుధవారం జరిగిన సమీక్షలో పాల్గొన్న మంత్రులు కొండాసురేఖ, సీతక్క, అడ్లూరి లక్ష్మణ్ కుమార్

# అక్రమ సంబంధం అడ్డుతోనే డబుల్ మర్డర్..

### జూన్ 25న కవిత భర్త కుమారస్వామి, ఆగస్టు 3న వర్షిణీ హత్య

### క్షుద్రపూజలుగా చిత్రీకరించిన వైనం

### హత్య కేసును ఛేదించిన కాటారం పోలీసులు



మీడియాకు వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ కిరణ్ ఖరే

**(జర్నలిస్ట్‌ఫైల్)జయశంకర్ భూపాలపల్లి బ్యూరో:** కాటారం పోలీస్ స్టేషన్‌లో గత నెల ఆగస్టు 25న నమోదైన కప్పల వర్షిణీ హత్య కేసుకు సంబంధించిన వివరాలను జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే మీడియాకు వివరాలు వెల్లడించారు. జిల్లా ఎస్పీ కథనం మేరకు గత నెల 28న కాటారం పోలీస్ స్టేషన్ పరిధిలో కమలాపూర్ క్రాస్ రోడ్డు సమీపంలో గుర్తుతెలియని అమ్మాయి మృతదేహంపడి ఉందని, శవానికి చుట్టు పక్కల క్షుద్ర పూజలు చేసినట్టుగా ఆనవాళ్లు ఉన్నాయని సమాచారం రాగా కాటారం ఎస్సై ఆకుల శ్రీనివాస్,సిఐ నాగార్జునరావు, డిఎస్పి సూర్యనారాయణ సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించగా చనిపోయిన అమ్మాయి కప్పల వర్షిణీ గుర్తించారన్నారు. గత నెల 3వ తేదీ నుండి కనిపించడం లేదని వర్షిణి తల్లి అయిన కప్పల కవిత స్థానిక పోలీస్ స్టేషన్ చిట్యాలలో గత నెల 6న ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కాగా మంగళవారం కాటారం సిఐ నాగార్జున రావు తన సిబ్బందితో గంగారం క్రాస్ రోడ్ సమీపంలో వాహన తనిఖీ చేస్తుండగా టీవీఎస్ ఎక్సెల్ మోటార్ సైకిల్ పైన మృతురాలి తల్లి అయిన కప్పల కవిత, మరొక వ్యక్తితో కొయ్యూరు నుండి కాటారం వైపుగా వస్తుండగా పోలీసు చూసి తమ వాహనాన్ని అక్కడే వదిలేసి పారిపోయే ప్రయత్నం చేయగా వెంబడించి పట్టుకొని విచారించగా వారి నేరమును అంగీకరించినట్లు తెలిపారు. ఈమేరకు పోలీసు విచారణలో విస్తుపోయే విషయాలు వెలుగులోకి వచ్చినట్లు తెలిపారు. చిట్యాల మండలం ఒడితల గ్రామానికి చెందిన కప్పల కుమారస్వామి తండ్రి సమ్మయ్య మొదటి భార్య చనిపోగా కొయ్యూరు మండలం తాడిచర్ల గ్రామానికి చెందిన మాదరవేణి కవితను రెండో వివాహం చేసుకొన్నారు. వీరి ఇరువురికి ఇద్దరు ఆడ సంతానం. కాగా వారిలో పెద్ద అమ్మాయి కప్పల వర్షిణీ(22), చిన్న అమ్మాయి కప్పల హన్సిక (21) ఉన్నారు.కాగా చిన్న అమ్మాయికి వివాహమై ఇంటి నుండి వెళ్లిపోగా ఒడతల గ్రామంలో పెద్దమ్మాయి వర్షిణీతో పాటు భార్య భర్తలు వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నారు. కాగా గత ఐదు సంవత్సరముల క్రితం కవిత భర్తకు పక్షవాతం వచ్చి ఇంటికి పరిమిత మయ్యాడు. కాగా కప్పల కవితకు అదే గ్రామానికి చెందిన అవివాహితుడైన జంజర్ల రాజ్ కుమార్ తండ్రి మారయ్య (24) పరిచయంతో అక్రమ సంబంధం ఏర్పడిందన్నారు. ఈ విషయం కప్పల కవిత భర్త కుమారస్వామికి తెలియడంతో తరచూ తగాదాలు జరుగుతున్నాయన్నారు. భర్తఅడ్డును తొలగించాలని భావించి జూన్ 25న తన కూతురు ఇంట్లోలేని సమయంలో భర్తను కవిత కదలకుండా కాళ్లు పట్టుకోగా రాజ్ కుమార్ నోరు మూసి గొంతు నొలిమి హత్య చేసి, అక్కడి నుండి వెళ్లిపోగా కవిత తన భర్త అనారోగ్యంతో చనిపోయాడని ఊరివారిని, బంధువులని నమ్మించి అంత్యక్రియలు జరిపించారు. తర్వాత కొన్ని రోజులకు వర్షిణీ తన తల్లిని నిలదీయడంతో అమ్మాయిని అడ్డు తొలగిస్తే, అక్రమ సంబంధానికి ఎటువంటి అడ్డంకులు ఉండవని రాజ్ కుమార్ తెలుపగా దానికి అంగీకరించిన కవిత ఇద్దరు కలిసి ముందస్తు పన్నాగంతో గత నెల 2న అర్ధరాత్రి తెల్లవారితే 03/08/2025 ఉదయం రెండు గంటల సమయంలో ఇంట్లో గాఢ నిద్రలో ఉన్న తన కూతురు వర్షిణీని తన భర్తను చంపిన విధంగానే హత్య చేసి మృతురాలిని తన ఇంట్లో ఉన్న సంచిలో మూటకట్టి ఇంటి వెనకాల ఉన్న చెట్ల పొదలలో దాచిపెట్టి, అదే రోజు రాత్రి అక్కడి నుండి ఒడితల గ్రామ శివారులో ఉన్న గవర్నమెంట్ హాస్పిటల్ వెనకాల ఉన్న దుబ్బగట్టుగుట్ట చెట్ల పొదలలో పడవేశారన్నారు. కాగా గత నెల 6న కప్పల కవిత చిట్యాల పోలీస్ స్టేషన్‌కి వచ్చి తన కూతురైన వర్షిణీ కనిపించడం లేదని ఫిర్యాదు చేయగా చిట్యాల పోలీస్ స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారన్నారు. ఇదిలా ఉండగా దుబ్బగట్టు గుట్టలో దాచిన శవంను రాజకుమార్ రెండు రోజులకు ఒకసారి వెళ్లి చూసి వస్తూ ఆట్టి శవాన్ని ఎవరైనా చూస్తే వారి ఇరువురి పైకి వస్తుందనే భయంతో గత నెల 25సాయంత్రం ఏడు గంటల సమయంలో శవాన్ని రాజ్ కుమార్ యూరియా సంచిలో ఉంచి దానికి తాడుకట్టి టీవీఎస్ ఎక్సెల్ మోటార్ సైకిల్ పైన మధ్యలో శవాన్ని ఉంచుకొని ఒడితల గ్రామం నుంచి తీసుకొని వచ్చి కమలాపూర్ క్రాస్ రోడ్ దాటిన తర్వాత నేషనల్ హైవేకి పక్కన పడేయడం జరిగిందన్నారు. పోలీసువారి దృష్టి మరల్చడం కోసం శవం పైన పసుపు, కుంకుమ చల్లి, నిమ్మకాయలు ఉంచి శవం చుట్టూ ఇనుప మేకులు కొట్టి క్షుద్ర పూజలు చేసి చంపినట్లుగా చిత్రీకరించి అక్కడ నుండి ఒడితల గ్రామానికి వెళ్లిపోయి ఎవరికి ఏమీ తెలియనట్లుగా ఎవరింట్లో వారు ఉన్నారన్నారు. కవిత తన భర్తను, కూతురిని చంపిన విషయం ఎప్పటికైనా బయటకి వస్తుందన్న భయంతో రాజ్‌కుమార్‌తో కలిసి ఒడితల గ్రామంనుండి బస్వాపూర్ రోడ్డు మీదుగా కొయ్యూరు నుండి గంగారం క్రాస్ మీదుగా మహారాష్ట్రవెళ్లే ఉద్దేశంతో వస్తూ ఉండగా పోలీసు వారు వారినిపట్టుకుని అరెస్టు చేసికోర్టుకు తరలించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా హత్య కేసులను చాకచక్యంగా ఛేదించిన అధికారులను జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే అభినందించినట్లు తెలిపారు.

# విధుల్లో చేరిన లెఫ్టినెంట్ జనరల్ హార్పల్ సింగ్

### మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రాహుల్ బొజ్జాలను మర్యాద పూర్వకంగా కలసిన సింగ్



**హైదరాబాద్,సెప్టెంబరు 4(జర్నలిస్ట్‌ఫైల్):** తెలంగాణా రాష్ట్ర నీటిపారుదల శాఖా సలహాదారుడిగా నియమితులైన లెఫ్టినెంట్ జెనరల్ కల్నల్ హార్పల్ సింగ్ విధుల్లో చేరారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుని పూర్తి చేసేందుకు రూపొందించిన ఎస్.ఎల్.బి.సి పనుల పునరుద్ధరణ నిమిత్తం బుధవారం రోజున మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొన్నారు. అంతకు ముందు లెఫ్టినెంట్ జెనరల్ హార్పల్ సింగ్ నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డితో పాటు రాష్ట్ర ప్రభుత్వ నీటిపారుదల శాఖా ప్రధాన కార్యదర్శి రాహుల్‌బొజ్జ, సలహాదారు ఆదిత్యా దాస్ నాథ్, ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్, సహాయ కార్యదర్శి కె. శ్రీనివాస్ లతో పాటు ఇ. ఎన్.సి లు అంజద్ హుస్సేన్, శ్రీనివాస్, రమేష్ బాబు లను ఆయన మర్యాద పూర్వకంగా కలిశారు. సివిల్ ఇంజినీరింగ్ లో పట్టభద్రుడైన లెఫ్టినెంట్ జెనరల్ హార్పల్ సింగ్ టన్నెల్ నిర్మాణ రంగంలో అపార అనుభవం గడించిన దృష్ట్యా ఆయనను ఈ శాఖలో నియమించిన విషయం విదితమే. ముఖ్యంగా మూడు లక్షల ఎకరాలకు సాగు నీటితో పాటు ఫ్లోరోసిస్ బారిన పడిన నల్లగొండ జిల్లా ప్రజలకు సురక్షితమైన త్రాగునీరు అందించేందుకు ఉద్దేశించ బడిన ఎస్.ఎల్.బి.సి సొరంగ మార్గం తవ్వకంలో జరిగిన ప్రమాదాన్ని దృష్టిలో పెట్టుకున్న ప్రభుత్వం లెఫ్టినెంట్ జెనరల్ హార్పల్ సింగ్ అనుభవాన్ని వినియోగించుకునేందుకు వీలుగా ఈ నియామకం చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా భావించి ఎస్.ఎల్. బి.సి పనులు పూర్తి చేసి త్వరితగతిన పూర్తి చేయాలని నియమించిన నేపద్యంలో ఆధునిక పరిజ్ఞానం అందుబాటులోకి తేనుంది. ఈ క్రమంలోనే సొరంగ మార్గం తవ్వకాలలో అపార అనుభవం గడించిన హార్పల్ సింగ్ సేవలు వినియోగించుకోనుంది.

# పార్టీని ధిక్కరిస్తే సస్పెండ్ చేయాల్సిందే : మాజీ మంత్రి మల్లారెడ్డి

**హైదరాబాద్,సెప్టెంబరు 4(జర్నలిస్ట్‌ఫైల్):** పార్టీలో కొనసాగుతూ.. పార్టీ నియమాలు, విధానాలను ధిక్కరిస్తేవారు ఎంతటివారైనా సరే నిరాక్షిణ్యంగా సస్పెండ్ చేయాల్సిందేనని బిఆర్ఎస్ నేత, మాజీ మంత్రి మల్లారెడ్డి అన్నారు. బుధవారం కల్వకుంట కవిత మాజీ మంత్రి హరీష్‌రావు, మాజీ రాజ్యసభ సభ్యుడు సంతోష్ రావులపై చేసిన ఆరోపణలపై మలారెడి స్పందించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ కవిత ప్రస్టేషన్‌లో మాట్లాడుతున్నారన్నారు. పార్టీకి నష్టం చేకూర్చే ఎవరినీ ఊపేక్షించేది లేదని, తమ పార్టీ అధినేత కెసిఆర్‌కు కన్నబిడ్డ కన్నా ప్రజలు,తెలంగాణే ముఖ్యమన్నారు. కుటుంబంలో సమస్యలు సర్వసాధారణమని అవన్ని త్వరలోనే సమసిపోతాయని కామెంట్ చేశారు. కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రపంచంలోనే గొప్ప ప్రాజెక్ట్ అని.. కావాలనే తప్పుడు ప్రచారం చేస్తున్నారని, మండిపడ్డారు. సిబిఐ పేరుతో కేసి ఆర్‌ను ఇబ్బంది పెటాలనుకోవడం సరికాద న్నారు. తెలంగాణ తెచ్చిన వ్యక్తి మనందరికీ నాయకుడిగా ఉండటం అదృష్టమని మాజీ మంత్రి మల్లారెడ్డి అన్నారు.

# మైక్రోబ్రూవరీల ఏర్పాటుకు దరఖాస్తులకు ఆహ్వానం

**హైదరాబాద్,సెప్టెంబరు 4(జర్నలిస్ట్‌ఫైల్):** టీసీయుఆర్ (తెలంగాణ కోర్ అర్బన్ రీజన్),6 మునిసిఫల్ కార్పోరేషన్లలో మైక్రోబ్రీవరీల ఏర్పాటుకు ఎక్సైజ్‌శాఖ నిర్ణయం తీసుకుంది. దీంతోమైక్రోబ్రీవరీల ఏర్పాటుకు పలు సంస్థలకు దరఖాస్తు చేసుకునే అవకాశం కలగడంతోప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌శాఖ కొత్త మైక్రోబ్రీవరీ 25 పాలసీకి శ్రీకారం చుట్టినట్లయ్యింది. ఈ పాలసీ వల్ల పలు సంస్థలు కొత్తగా మైక్రోబ్రీవరీలను ఏర్పాటు చేసుకోవడానికి అవకాశం ఏర్పడనుంది. ఈ మేరకు కొత్త మైక్రోబ్రీవరీల ఏర్పాటుకు అవసరమైన నోటి పికేషన్‌ను జారీ చేశారు. ఈ నెల 3 నుంచి 25 వరకు దరఖాస్తులు చేసుకోవడానికి అవకాశం కల్పించారు. ప్రతి దరఖాస్తుకు రూ.1,00,000 (లక్ష)గా నిర్ణయించారు. మైక్రోబ్రీవరీలను బార్లు, ఎలైట్ బార్లు, క్లబ్‌లకు, టూరిజం స్థలాల్లోను, హోటల్,రెస్టారెంట్, ఆహార పదార్థలను అందజేసే సంస్థలు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంటుంది. మైక్రో బ్రీవరీల ఏర్పాటుకు అవసరమైన 1000 స్క్వైర్ ఫిట్ స్థలాన్ని ఉండే విధంగా చూసుకోవాల్సి ఉంటుంది. దరఖాస్తులు సంబంధిత శాఖలు జారీ చేసిన అనుమతి పత్రాలను కలిగిన వారు మాత్రమే దరఖాస్తులకు అర్హులుగా ఉంటారని పేర్కొన్నారు.

# సహకార సంఘాల బలోపేతానికి కృషి: నాబార్డు ఛైర్మన్ శాజి

**హైదరాబాద్, సెప్టెంబరు 4(జర్నలిస్ట్‌ఫైల్):** తెలంగాణ లోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల (పిఎసిఎస్)బలోపేతానికి కృషి చేస్తున్నట్లు జాతీయ వ్యవసాయ మరియు గ్రామీణాభివృద్ధి బ్యాంక్ (నాబార్డ్) ఛైర్మన్ కెవి శాజి తెలిపారు. సహకార సంఘాల బలోపేతంపై హైదరాబాద్‌లో బుధవారం వర్క్‌షాప్ జరిగింది. ఇందులో పాల్గొన్న ఛైర్మన్ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా సహకార సంఘాల కంప్యూటరైజేషన్ ప్రాజెక్టు మంచిఫలితాలు ఇస్తోందన్నారు. ఇప్పటి వరకు 52,500కి పైగా పిఏసి ఎస్ డే-ఎండ్ ఆపరేషన్స్ పూర్తి చేశాయని వివరించారు. 9 వేలకుపైగాసంఘాల డైనమిక్-డే ఎండ్ నిర్వహిస్తున్నాయని వెల్లడిం చారు. కాగా 33 వేలకు పైగా ఆడిట్లు ఈపాస్ సాఫ్ట్‌వేర్ ద్వారా పూర్తయ్యాయని చెప్పారు. సహకార మం త్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి సిద్దార్థ్ జైన్ మా ట్లాడుతూ సహకార సంఘాలు గ్రామీణ సమృద్ధిని పెంచడంలో, ఆహార భద్రతను మెరుగు పరచడంలో, సమగ్ర అభి వృద్ధిని సాధించడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని ప్రశంసించారు. ఈ వర్క్‌షాప్‌లో నాబార్డ్ డిప్యూటీ మేనేజింగ్ డైరక్టర్ గోవర్ధన్ సింగ్ రావత్, తెలంగాణ ప్రాంతీయ కార్యాలయం చీఫ్ జనరల్ మేనేజర్ బి.ఉదయ భాస్కర్, నాబార్డు ప్రధాన కార్యాలయం సిజిఎం సంజయ్ గుప్తా, డాక్టర్ సుమన్‌కుమార్ పాల్గొన్నారు.

# కారుణ్య ఉద్యోగులకు డిగ్రీ ఉంటే క్లర్క్: సిఎండి బలరామ్

**హైదరాబాద్, సెప్టెంబరు 4(జర్నలిస్ట్‌ఫైల్):** బొగ్గు గని ప్రమాద ఘటనల్లో కారుణ్య వారసులకు డిగ్రీ విద్యార్హత ఉంటే అటువంటి వారికి గ్రేడ్3 క్లర్క్ పోస్టులకు అర్హత కలిగి ఉంటుందని సింగరేణి సిఎండి ఎన్.బలరామ్ తెలిపారు. హైదరాబాద్ లోని సింగరేణి భవన్‌లో జరిగిన చర్చల్లో ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. దీనికి సంబంధించి త్వరలోనే ఆదేశాలు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. గతంలో ఈ విద్యార్హత కలిగిన వారు జనరల్ అసిస్టెంట్లుగా మాత్రమే పనిచేసే అవకాశం ఉండేదన్నారు.

అయితే 2009 లో జారీ చేసిన సర్క్యులర్ ప్రకారం టెక్నికల్ డిగ్రీలైన మైనింగ్, మెకానికల్, ఎలక్ట్రికల్, సివిల్ ఇంజినీ రింగ్, డిప్లొమా (మైనింగ్, మెకానికల్, ఎలక్ట్రి కల్), ఐటీఐ (ఎలక్ట్రికల్, ఫిట్టర్, వెల్డర్) కోర్సులు పూర్తి చేసిన వారికి విద్యార్హతలకు తగిన ఉద్యో గాలు కల్పించడానికి అంగీకరించడం జరిగిం దన్నారు. తాజాగా డిగ్రీ అర్హతను కూడా చేర్చినట్లు చెప్పారు.

## క్షేత్రస్థాయిలో కలెక్టర్ లక్ష్మీశ విస్తృత తనిఖీలు

- ఎరువులు, పురుగు మందుల దుకాణం తనిఖీ
- ఎరువుల ప్రతి లెక్కా పక్కాగా ఉండాలని స్పష్టీకరణ
- కృత్రిమ కొరత సృష్టించినా, అధిక ధరలకు అమ్మినా కఠిన చర్యలు: ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



**విజయవాడ, సెప్టెంబర్ 4(జర్నలిస్ట్‌ఫైల్):**

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ నందిగామ డివిజన్‌లో పర్యటించి విస్తృత తనిఖీలు చేపట్టారు. నందిగామ పట్టణంలో బుధవారం గ్రోమోర్ ఎరువులు, పురుగు మందుల దుకాణాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అమ్మకాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ అత్యంత పారదర్శకంగా, జవాబుదారీతనంతో ఎరువుల పంపిణీ జరిగేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఎరువుల పంపిణీకి సంబంధించి ప్రతి లెక్కా చాలా పక్కాగా ఉండాలని.. ఎక్కడ ఎలాంటి ఫిర్యాధులు రానీయరాదన్నారు. ఎరువులు సరఫరాపై ఫిర్యాదులు లేదా సమాచారం అందించేందుకు ప్రతి షాపు వద్ద 91549 70454 నంబరును డిస్ప్లే బోర్డులో ప్రదర్శించాలన్నారు. ఎరువుల వివరాలు వాటి ధరలు, ఇప్పటి వరకు జరిగిన అమ్మకాల వివరాలను నోటీస్ బోర్డు నందు తప్పని సరిగా పొందుపరచాలని జిల్లా కలెక్టర్ ఆదేశిం చారు. వ్యవసాయ అధికారుల సూచనల మేరకే ఎరువులను సరైన విధంగా వినియోగించాలని, అవసరానికి మించి తీసుకోకుండా అవగాహన కల్పించాలని సూచించారు. ఎరువులను అధిక ధరలకు అమ్మడం, ఇతర ప్రయోజనాలకు మళ్ళించడం వంటి వాటివి తారసపడితే వెంటనే సమాచారం అందించాలని జిల్లా కలెక్టర్ లక్ష్మీశ అన్నారు.

## ఉద్యాన పంటలతో రైతుల ఇంట సిరులు

### అన్నదాతల జీవన ప్రమాణాల మెరుగు: కలెక్టర్ జి.లక్ష్మీశ

**నందిగామ, సెప్టెంబర్ 4(జర్నలిస్ట్‌ఫైల్):**



ఉపాధి హామీ పథకం అనుసంధానంతో ఉచితంగా పండ్ల, పూల మొక్కల సాగును చేపట్టవచ్చని, ఉద్యాన పంటలతో రైతులకు సుస్థిర ఆదాయాలు లభిస్తాయనడంలో ఎలాంటి సందేహం లేదని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. చందర్లపాడు మండలం, ముప్పాళ్ల గ్రామ రైతు నాగేశ్వరరావు ఉపాధి హామీ పథకం కింద ఎకరా విస్తీర్ణంలో వేసిన తైవాన్ జామ తోటను కలెక్టర్ లక్ష్మీశ.. అధికారులతో కలిసి సందర్శించారు. మొత్తం 444 మొక్కలు వేయగా.. పథకం కింద మొదటి ఏడాది రూ. 1,26,110, రెండో ఏడాది రూ. 60,707, మూడో ఏడాది రూ. 64,407 మొత్తం రూ. 2.51 లక్షల సాయం అందుతుంది. గుంతలు తవ్వేందుకు మార్కింగ్ చేసింది మొదలు.. మొక్కల కొనుగోలుకు, రవాణాకు, నాటడానికి, సంరక్షణకు ఇలా వివిధ పనులకు ఆర్థిక సహాయం అందుతుంది. ఉపాధి పథకం ద్వారా ఈ పంట వేసినందుకు చాలా ఆనందంగా ఉందని.. రెండో ఏడాది నుంచి ఆదాయం రావడం మొదలవుతుందని, ఏడాదికి రూ. 2 లక్షల నుంచి రూ. 2.50 లక్షల వరకు ఆదాయం వస్తుందని రైతు చెప్పారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ రైతుల క్షేమం, సంక్షేమా నికి ప్రభుత్వాలు అత్యంత ప్రాధాన్యమిస్తున్నాయని.. స్వర్ణాంధ్ర సాధనకు వ్యవసాయ, అనుబంధ రంగాల జీవీఏలో ప్రగతి కీలకమని, ఈ నేపథ్యంలో ఉద్యాన పంటలతో పాటు పశు పోషణను ప్రోత్సహిస్తున్నట్లు వివరించారు. జిల్లా లో ఈ ఏడాది నాలుగు వేల ఎకరాల్లో ఉద్యాన పంటల సాగును లక్ష్యంగా నిర్దేశిం చుకోగా దాదాపు లక్ష్యాన్ని చేరుకోవడం జరిగింద న్నారు. రైతులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలను సద్వినియోగం చేసుకో వాలని.. పొలం పిలుస్తోంది కార్యక్రమాల ద్వారా సలహాలు సూచనలు అందిం చడంతో పాటు అన్ని విధాలా చేయిపట్టి నడిపించడం జరుగుతోందన్నారు. అగ్రీ టెక్‌పైనా అవగాహన పెంపొందించుకోవాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు. కార్య క్రమంలో డ్వామా పీడీ ఎ.రాము, నందిగామ ఆర్డీవో కె.బాలకృష్ణ పాల్గొన్నారు.

## ఎరువుల ధరలు పెంచే అమ్మితే కఠిన చర్యలు

- ఎంఏఓ కే సి హెచ్ సూరిబాబు
- ఎరువుల ప్రవేట్ డీలర్స్ మరియు పిఎసిఎస్ లతో ప్రత్యేక సమావేశం.. రైతులకు అందుబాటులో యూరియా



**జి కొండూరు, సెప్టెంబర్ 4(జర్నలిస్ట్‌ఫైల్):**

జి కొండూరు మండలంలోని ఎరువులపై మండల శాఖ అధికారి సూరిబాబు జి కొండూరు మండలంలోని ఎరువుల ప్రైవేట్ డీలర్స్ మరియు పిఎసిఎస్ లకు బుధవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఎరువుల దుకాణ దారులు భౌతిక నిలువలను ఈపాస్ లో సరి చేసుకోవాలని, డీలర్స్ యూరియాను ఎమ్మార్పీ కంటే ఎక్కువకు అమ్మిన మరియు బ్లాక్ మార్కెట్లో అమ్మిన కఠిన చర్యలు తీసుకుం టామని హెచ్చరించారు. మండలంలో యూరియా స్టాక్స్ అందుబాటులో ఉన్నా యని తెలియజేశారు. యూరియా స్టాక్స్ అందుబాటులో ఉన్న ఎరువుల దుకా ణాలు కవులూరు పిఎసిఎస్ లో 20 మెట్రిక్ టన్నులు, వెలగలేరు పిఎసిఎస్ లో 45 మెట్రిక్ టన్నులు, వెల్లటూరు పిఎసిఎస్ లో 10 మెట్రిక్ టన్నులు, మన గ్రోమో ర్ సెంటర్ నందు 15 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉన్నాయని తెలియ జేశారు. రైతులు ఎవరు అధైర్యపడవద్దని యూరియా స్టాక్స్ వస్తాయని తెలిపారు.

# ఏషియన్ మస్క్యులో స్కెలిటల్ సొసైటీ అధ్యక్షునిగా ప్రముఖ రేడియాలజిస్టు డాక్టర్ వి.ఎన్.వరప్రసాద్







- ఇటీవల సింగపూర్‌లో జరిగిన 27వ వార్షిక సమావేశంలో బాధ్యతలు స్వీకరణ
- అభినందించిన వర ప్రసాద్ మిత్రులు, శ్రేయోభిలాషులు



**విజయవాడ, సెప్టెంబర్ 4(జర్నలిస్ట్‌ఫైల్):**

ఏషియన్ మస్క్యులో స్కెలిటల్ సొసైటీ అధ్యక్షునిగా ప్రముఖ రేడియాలజిస్టు డాక్టర్ వి.ఎన్. వరప్రసాద్ పదవీ బాధ్యతలు స్వీకరించడం శుభపరిణామం అని పలువురు వక్తలు ప్రశంసించారు. డాక్టర్ వేమూరి నాగ వరప్రసాద్ ఏషియన్ మస్క్యులో స్కెలిటల్ సొసైటీ నూతన అధ్యక్షునిగా నియామకం కావడం, బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ఇండియన్ రేడియాలజి అండ్ ఇమేజింగ్ అసోసియేషన్ జాతీయ ఉపాధ్యక్షులు డాక్టర్ జి.వి.మోహన్ ప్రసాద్ ఆధ్వర్యంలో మహాత్మాగాంధీ రోడ్డులోని హొటల్ మినర్వాలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డాక్టర్ వర ప్రసాద్‌ను ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సంద ర్భంగా డాక్టర్ జి.వి.మోహన్ ప్రసాద్ మాట్లాడుతూ, డాక్టర్ వేమూరి నాగ వరప్రసాద్ గతంలో ఇండియన్ కాలేజ్ ఆఫ్ రేడియాలజీ అండ్ ఇమేజింగ్ (ఐసీఆర్ఐ) అధ్యక్షునిగా మరియు ఇండి యన్ రేడియాలజీ అండ్ ఇమేజింగ్ అధ్యక్షులుగా కూడా పదవీ బాధ్యతలు నిర్వహించినట్లు తెలిపారు. అదేవిధంగా ఏషియన్ మస్క్యులో స్కెలిటల్ సొసైటీ అధ్యక్షునిగా పదవీ బాధ్య తలు స్వీకరించక ముందు ఈ సంఘానికి సెక్రటరీ జనరల్‌గాను మరియు ప్రెసిడెం ట్ ఎలక్ట్‌గా కూడా వ్యవహరిం చినట్లు పేర్కొ న్నారు. ఈ పదవి నిర్వహి స్తున్న మొట్టమొదటి భారతీయ రేడియాలజిస్టుగా డాక్టర్ వి.ఎన్.వరప్రసాద్ ఎంపిక కావడం దేశానికి గర్వకారణమన్నారు. డాక్టర్ వి.ఎన్.వరప్రసాద్ మాట్లాడు తూ, వివిధ దేశాలలో గల సొసైటీలు మరియు రేడియాల జీలోని మస్క్యులో స్కెలిటల్ విభాగంలో ఉన్న పద్దతుల మధ్యలో అంతరాలను సరిచేస్తూ వాటిని అనుసంధానం చేయడం అనే నినాదంతో సింగపూర్‌లో నిర్వహించిన 27వ వార్షిక సమావేశంలో ఎన్నికైన తాను, వచ్చే రెండేళ్ళలో ఈ థీమ్ లక్ష్యాన్ని నెరవేరు స్తానని తెలిపారు. వివిధ వ్యాధి నిర్ధారణ పద్దతుల మధ్యన ఉన్న హద్దులను తొలగిస్తూ ఒక నిర్ణయానికి రావడం దీనిపై ప్రపంచ స్థాయిలో అవగాహన పెంపొందించేందుకు ఆసియా ఖండంలోని వివిధ దేశాల మస్క్యులో స్కెలిటల్ రేడియాలజీ సంఘాల మధ్య అనుసంధాన కర్తగా వ్యవహరిం చేందుకు తాను నిరంతరం కృషి చేస్తానని స్పష్టం చేశారు. శరీరంలోని కీళ్లు, కండరాలు, ఎముకలతో కూడిన ఈ మస్క్యులో స్కెలిటల్ విభాగం వ్యాధి నిర్ధారణలో ఆధునిక పద్దతు లైన ఆర్టిఫిషీయల్ ఇంటిలిజెన్స్ (కృత్రిమ మేథ)తో నూతనంగా రూపొందించిన సిటీస్కాన్, ఎమ్మారై, అల్ట్రా సౌండ్ వంటి పరికరాలు మస్క్యులో స్కెలిటల్ రేడియా లజీ వైద్యంలో కీలక పాత్ర వహిస్తాయని తెలిపారు. ఈ విధానాలపై సమావేశంలో వివిధ దేశాలు నుండి హాజరైన నిష్ణాతులు చర్చించారని పేర్కొన్నారు. సింగపూ ర్‌లో జరిగిన 27వ వార్షిక సమావేశంలో తాను ఏషియ న్ మస్క్యులో స్కెలిటల్ సొసైటీ అధ్యక్షునిగా పదవీ బాధ్యతలు స్వీకరించినట్లు తెలిపారు. పదవీకాలం 2 సంవత్సరాలు పాటు ఉంటుందని, 2027 ఆగష్టు నెల వరకు తాను ఈ పదవిలో కొనసాగుతానని పేర్కొ న్నా రు. సమావేశంలో ఐఆర్ ఐఏ, సెంట్రల్ కౌన్సిల్ మెం బర్ డాక్టర్ చలసాని కులదీప్, ఐఆర్ఐ ఏ విజయ వాడ చాప్టర్ ప్రెసిడెంట్ డాక్టర్ బి.రాజ్ కుమార్ పాల్గొన్నారు.

# బంగారు కుటుంబాలలో ఆనంద హేళ

- ముప్పాళ్ల వేదికగా పీ4 కార్యాచరణలో అద్భుత ఫలితాలు
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ

**విజయవాడ, సెప్టెంబర్ 4(జర్నలిస్ట్‌ఫైల్):**



రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆలోచనలకు ప్రతిరూపమైన పీ4 మార్గదర్శి–బంగారు కుటుంబం కార్యరూపం దాల్చగా నేడు ముప్పాళ్లలో మార్గదర్శుల ద్వారా బంగారు కుటుంబాలకు అందు తున్న సహాయాన్ని ప్రత్యక్షంగా పరిశీలించిన ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతిష్టాత్మకంగా పీ4 కార్యక్రమంలో భాగంగా మార్గదర్శి – బంగారు కుటుంబాలతో లబ్ధి పొందు తున్న కొండ్రు వెంకటరావమ్మ, కోట వెంకటరత్నం ఇళ్ళకు బుధవారం జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ, ఆర్డీవో కె.బాలకృష్ణతో కలిసి వెళ్ళి వారి కుటుంబ సభ్యులతో ముచ్చటించి, వారి స్థితిగతులు, ఆదాయ పెరుగుదలను అడిగి తెలుసు కున్నారు. ఈ సందర్భం గా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతిష్టాత్మకంగా పీ4 కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హామీ మేరకు కొండ్రు వెంకటరావమ్మ బంగారు కుటుంబానికి ప్రభుత్వం నుంచి ఇళ్ల స్థలం, ఇంటి మంజూరు, ఆటో, కుట్టు మిషన్, కోట వెంకటరత్నం బంగారు కుటుంబానికి ఆటో ఇప్పించడంతో పాటు పిల్లలను ఉన్నత చదువులు చదివించి పేదరికం నుంచి బయట పడే వరకు మార్గదర్శులు తోడుండే విధంగా చర్యలు తీసుకున్నామన్నారు. పీ4 కార్యక్రమం మహాయజ్ఞం వంటిదని, దేశ చరిత్రలో ఏ రాష్ట్రంలోనూ ఇటువంటి కార్యక్రమాన్ని చేపట్టిన దాఖలాలు లేవన్నారు. ఎంతో ముందుచూపు కలిగిన ముఖ్యమంత్రి పీ4 విధానాన్ని ప్రవేశపెట్టి బంగారు కుటుంబాలను ఎంపిక చేసి, మార్గదర్శుల సాయంతో ఆ కుటుంబాలు ఆర్థికంగా నిలదొక్కుకొని, పేదరికం నుంచి బయటపడాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకున్నారన్నారు. ఎన్టీఆర్ జిల్లాలో పీ4 కార్యక్రమం కార్యరూపం దాల్చడం, జిల్లా అధికారిగా నాకు గర్వకారణంగా ఉందన్నారు. జిల్లాలో 96 వేల బంగారు కుటుంబాలను గుర్తించడం జరిగిందని, వీటికి మార్గదర్శులను తోడు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని, మార్గదర్శుల స్ఫూర్తితో ముందడుగు వేసేందుకు మరింత మంది మార్గదర్శులు ముందుకు రావాలన్నారు. బంగారు కుటుంబాలకు, సహాయాన్ని స్వయంగా వారే అందించి, వారు ఉన్నత స్థాయికి ఎదిగేందుకు కృషిచేయడం ద్వారా రాబోయే తరంలో వారి కుటుంబ సభ్యులకు ఒక మంచి కార్యక్రమాన్ని అందించామనే సంతృప్తి మార్గదర్శులకు మిగుల్చుతుందనే దాంట్లో ఎలాంటి సందేహం లేదని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. పర్యటనలో ఎంపిడివో పద్మజ్యోతి, తహాశీల్ధార్ రామకోటేశ్వరావు ఉన్నారు.

# ప్రకృతి సేద్యంలో జిల్లాను నెం.1గా నిలబెట్టాలి

- విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి
- సచివాలయం యూనిట్‌గా జీవామృతాలపై అవగాహన పెంచాలి
- సాగు ఖర్చులు తగ్గి.. అన్నదాతకు ఆదాయాలు పెరగాలి
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

**విజయవాడ, సెప్టెంబర్ 4(జర్నలిస్ట్‌ఫైల్):**



ప్రతి గ్రామంలో రైతులను ప్రకృతి వ్యవసాయం దిశగా ప్రోత్సహించాలని, శాస్త్రీయ ఆధారాలతో అపోహలను తొలగించి, ముఖ్యంగా స్వయం సహాయక సంఘాల మహిళలను ప్రకృతి సాగు దిశగా చేయిపట్టి నడిపించాలని, ఇందుకు అవసరమైన సహాయసహ కారాలు అందించాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. ఏపీ కమ్యూనిటీ మేనేజ్డ్ నేచురల్ ఫార్మింగ్ (ఏపీ సీఎన్ఎఫ్), నేషనల్ మిషన్ ఆన్ నేచురల్ ఫార్మింగ్ (ఎన్ఎంఎన్ఎఫ్)పై బుధవారం కలెక్టరేట్ శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ గ్రామ సచివాలయం యూనిట్‌గా ప్రకృతి వ్యవసాయంలో ఉపయోగించే ఘన, ద్రవ జీవామృతాల తయారీ, వినియోగంపై అవగాహన కల్పించాలన్నారు. ప్రకృతి సేద్య విధానాలు నేలసారం తగ్గకుండా. పంటకు సత్తువనిస్తాయని, తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు వస్తాయన్నారు. ప్రకృతి విపత్తులు, వాతావరణ మార్పులనూ తట్టుకునే సామర్థ్యం ఈ విధానాల పంటలకు ఉంటుందన్నారు. జిల్లా వ్యవసాయ అధికారి డీఎంఎఫ్ విజయకుమారి మాట్లాడుతూ నేల ఆరోగ్యం, వాతావరణ స్థితిస్థాపకతలకు అనుగుణంగా రైతులకు ఖర్చు తగ్గించి నికరాదాయం పెంచే విధంగా ప్రకృతి సేద్య విధానాలతో ముందుకెళ్లాల్సి ఉందన్నారు. జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ వై.శంకర్ నాయక్ మాట్లాడుతూ ఎన్ఎంఎన్ఎఫ్ అనేది కేంద్ర ప్రాయోజత పథకమని.. ఇది వ్యవసాయం, రైతు సంక్షేమ శాఖ పరిధిలో పనిచేస్తోందని.. దీనిద్వారా శాస్త్రీయంగా నిర్ధారించిన పద్ధతులను ఉపయోగించి సుస్థిరత, వాతావరణ అనుకూలిత, సురక్షిత ఆహార ఉత్పత్తులను ప్రోత్సహించడం జరుగుతోందన్నారు. జిల్లాస్థాయిలో ప్రస్తుతం 149 వీవోలు పనిచేస్తున్నాయని.. వీటిలో 94 వీవోలను ఎన్ఎంఎన్ఎఫ్ కింద తీసుకోవడం జరిగిందన్నారు. ప్రకృతి సేద్యాన్ని ప్రోత్సహించడంలో వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్ధక శాఖ, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ, కేవీకేలు, విశ్వవిద్యాలయాలు, కృషి సఖీస్ తదితరాలు భాగస్వాములుగా ఉన్నాయని వివరించారు. కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ లక్ష్మీశ.. అధికారులతో కలిసి ప్రకృతి వ్యవసాయం – వివిధ పంటల్లో పురుగులు/తెగుళ్ల యాజమాన్య దీపిక పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యాన అధికారి పి.బాలాజీ కుమార్, డీఆర్డీఏ పీడీ ఏఎన్వీ నాంచారరావు, జిల్లా పశు సంవర్ధక అధికారి డా. హనుమంతరావు, ఏటీఎంఏ ఏడీ టి.మాధవీలత, కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ డా. ఎం.రవికిశోర్, ఆర్‌వైఎస్ఎస్ సీనియర్ టీమ్ లీడర్ సీహెచ్ చంద్రశేఖర్, ఆర్.అరుణ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# భారత్, అమెరికా బంధం ఏకపక్షమే: ట్రంప్



**వాషింగ్టన్, సెప్టెంబరు 4:** భారత్, అమెరికాల బంధం ఇప్పటివరకూ ఏకపక్షంగా కొనసాగిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యానించారు. భారత్ పై మొన్నటి వరకు అమెరికా ఎలాంటి సుంకాలు విధించలేదని, భారత్ మాత్రం అమెరికా వస్తువులపై 100 శాతం పన్నులు విధించిందని ఆరోపించారు. దీంతో భారత వస్తువులు అమెరికాలోకి డంప్ అయ్యేవనీ, అమెరికా మాత్రం భారత్ కు ఎలాంటి ఎగుమతులు చేయలేకపోయిందని చెప్పారు. భారత దేశం మనపై ప్రపంచంలోనే అత్యధికంగా సుంకాలు విధిస్తుంటే మనమేమో ఫూలిష్ గా భారత్ పై అసలు సుంకాలే వేయలేదని ట్రంప్ వ్యాఖ్యానించారు. ఈ సుంకాల వ్యత్యాసం వల్ల భారత వస్తువులు మన మార్కెట్ ను ఆక్రమించాయని, ఆ వస్తువులు ఇక్కడ తయారయ్యే అవకాశం లేకుండా పోయిందని చెప్పారు. భారత్ సుంకాల విధానం కారణంగా అమెరికా కంపెనీలు బయటకు వెళ్లి నిర్మాణాలు చేపడుతున్నాయన్నారు. ఈ మేరకు మంగళవారం ఓవెల్ కార్యాలయంలో ట్రంప్ విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా భారత్ పై విధించిన సుంకాలను తగ్గించే అవకాశం ఉందా? అన్న ప్రశ్నకు జవాబిస్తూ ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. భారత్, అమెరికాల మధ్య ఆర్థిక సంబంధాలు ఇన్నాళ్లూ ఏకపక్షంగా కొనసాగాయని, తాను అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టాకే మార్పు వచ్చిందన్నారు. అధిక సుంకాల కారణంగా హార్లే డేవిడ్ సన్ కంపెనీ భారత్‌లో ప్లాంట్‌ను నిర్మించి విక్రయాలు జరపాల్సిన పరిస్థితి వచ్చిందని ట్రంప్ ఆరోపించారు.

తాజాగా తాను విధించిన సుంకాల వల్ల వేలాది కంపెనీలు అమెరికాకు వస్తున్నాయని డొనాల్డ్ ట్రంప్ చెప్పారు.

# రష్యా నుంచి అదనంగా ఎస్-400 క్షిపణుల కొనుగోలు



## చైనా, అమెరికా, పాకిస్థాన్‌కు భారత్ చెక్!

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 4:** అమెరికాతో టారిఫ్స్ యుద్ధం, పాక్‌తో ఉద్రిక్తతల వేళ భారత రక్షణ వ్యవస్థను మరింత పటిష్ఠం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన గగనతల రక్షణ వ్యవస్థగా పేరుగాంచిన ఎస్400 ఎయిర్ డిఫెన్స్ మిస్సైల్ సిస్టమ్ అదనపు యూనిట్స్‌ని రష్యా నుంచి మరిన్ని కొనుగోలు చేసేందుకు సిద్ధమైంది. మాస్కోతో చర్చలు ప్రారంభించింది. భారత్ ఇప్పటికే ఎస్400 వ్యవస్థలను ఉపయోగిస్తున్న విషయం తెలిసిందే. ఇటీవలే పాకిస్థాన్‌తో ఘర్షణల సమయంలో ఈ ఎస్400 గగనతల రక్షణ వ్యవస్థ సమర్థవంతంగా పనిచేసింది. పాకిస్థాన్ డ్రోన్లు, మిసైల్స్‌తో దాడికి ప్రయత్నించగా ఎస్400 సహాయంతో వాటిని భారత్ విజయవంతంగా కూల్చివేసింది. సరిహద్దుల్లో మోహరించిన ఎస్ 400 మిస్సైల్ సిస్టమ్ అడ్డుకున్న విషయం తెలిసిందే. ఖచ్చితత్వంతో సరిహద్దు నుంచి వైమానిక ముప్పును ఎదుర్కోవడంలో ఈ వ్యవస్థ సమర్థవంతంగా పని చేసిన నేపథ్యంలో భారత్ తన వైమానిక రక్షణ సామర్థ్యాన్ని మరింత విస్తరించేందుకు నిర్ణయం తీసుకుంది. చైనా నుంచి పెరుగుతున్న సైనిక ముప్పును ఎదుర్కొనే లక్ష్యంతో ఎస్400 ఎయిర్ డిఫెన్స్ మిస్సైల్ వ్యవస్థలను కొనుగోలు చేసేందుకు రష్యాతో ఇండియా 5 బిలియన్ల డాలర్ల ఒప్పందం కుదుర్చుకున్నది. ఈ ఒప్పందం 2018లో కుదిరింది. ఈ ఒప్పందం కింద మొత్తం ఐదు ఎస్400 వ్యవస్థలను కొనుగోలు చేయాల్సి ఉండగా, కొన్ని కారణాల వల్ల సరఫరాలో జాప్యం జరిగింది. ఈ నేపథ్యంలో భారత్‌కు ఇవ్వాల్సిన మిగిలిన రెండు యూనిట్లను 2026లోగా అందజేసేందుకు కట్టుబడి ఉన్నామని రష్యా ఇటీవలే ప్రకటించింది. ఇప్పుడు ఎస్400 ఎయిర్ డిఫెన్స్ మిస్సైల్ సిస్టమ్ అదనపు యూనిట్స్ కోసం రష్యాతో భారత్ చర్చలు ప్రారంభించింది. ఎస్ 400 ట్రయాంఫ్ అనేది భూమిపై నుంచి గగనతలానికి ప్రయోగించే క్షిపణి వ్యవస్థ. దీన్ని ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి కూడా మోహరించవచ్చు. ఆకాశంలో దూసుకొచ్చే శత్రువుల జెట్స్, రాకెట్లను ఇది భూమిపై నుంచే కూల్చివేయగల సామర్థం వీటికి ఉంది. విమానాలు, మానవరహిత వైమానిక విమానాలు, క్రూయిజ్ క్షిపణులను ధ్వంసం చేస్తుంది. ఇది టెర్మినల్ బాలిస్టిక్ క్షిపణి రక్షణ సామర్థ్యాన్ని కూడా కలిగి ఉంటుంది. సోవియట్ యూనియన్ కుప్పకూలిన తక్షణమే వీటిని 1993లో అభివృద్ధి చేయడం ప్రారంభించారు. మిస్సైల్ స్టోరేజ్ కంటైనర్లు, లాంచర్లు, రాడార్లు ఇలా వివిధ రకాల ఆయుధాలతో దీన్ని తయారు చేశారు. 2007వ సంవత్సరంలో ఇది వినియోగంలోకి వచ్చింది. రష్యాకు చెందిన ఈ ఎస్400 మిస్సైళ్ల సర్ఫేస్ టు ఎయిర్ మిస్సైళ్ల రక్షణ వ్యవస్థలో మోస్ట్ అడ్వాన్స్‌డ్ ఆయుధాలుగా పేర్కొంటారు. ఎస్400 ప్రపంచంలోనే అత్యంత అధునాతనమైన మొబైల్ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్. దీన్ని సులభంగా ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి తరలించేందుకు అవకాశం ఉంటుంది. దాన్ని ఓ వాహనంపై అమర్చవచ్చు. ఒకేసారి మల్టిపుల్ టార్గెట్స్‌ని ధ్వంసం చేస్తుంది. ఒకేసారి 36 టార్గెట్‌లను ట్రాక్ చేసే సామర్థం దీనికి ఉంది. అలాగే, 12 టార్గెట్స్‌పై ఒకే సారి దాడి చేస్తుంది. 600 కిలోమీటర్ల దూరం నుంచే ట్రాక్ చేస్తూ.. 400 కిలోమీటర్ల పరిధిలోనే శత్రువుల మిస్సైల్స్‌ను కూల్చే సత్తా వీటి సొంతం. విమానాలు, డ్రోన్లు, క్రూయిజ్ మిసైల్స్, బాలిస్టిక్ మిసైల్స్ ఇలా వేర్వేరు లక్ష్యాలను ఒకేసారి టార్గెట్ చేసి ఛేదిస్తుంది. వీటి రియాక్షన్ టైమ్ చేలా వేగంగా ఉంటుంది. ఎస్400 యాంటీ మిస్సైల్ డిఫెన్స్ సిస్టమ్‌ను ఫైర్ చేసేందుకు ఐదు నిమిషాల్లోనే రెడీ చేయొచ్చు. ఇందులో 3డీ ఫేజ్‌డ్ అరే రాడార్ ట్రాకింగ్ సిస్టమ్ ఉంటుంది. స్టాక్‌హోమ్ ఇంటర్నేషనల్ పీస్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ప్రకారం, 2020-2024 మధ్య కాలంలో భారత్ ఆయుధ దిగుమతుల్లో 36 శాతం వాటా రష్యాదే. బ్రహ్మోస్ క్షిపణులు, సుఖోయ్30 ఎంకేఐ యుద్ధ విమానాలు, టీ90 ట్యాంకులు, ఏకే 203 రైఫిళ్ల తయారీ వంటి ఎన్నో కీలక రక్షణ ప్రాజెక్టుల్లో ఇరు దేశాలు దశాబ్దాలుగా కలిసి పనిచేస్తున్నాయి. ఇప్పుడు మరో భారీ డీల్‌కు ఇరు దేశాలు సిద్ధమవడం విశేషం.



# చైనా మిలటరీ పెరేడ్‌కు తండ్రితోపాటు పాల్గొన్న కిమ్ కుమార్తె

**బీజింగ్, సెప్టెంబరు 4:** ఉత్తర కొరియా అధినేత కిమ్ జోంగ్ ఉన్ తన రాజకీయ వారసురాలు ఎవరనే దానిపై మరోసారి బలమైన సంకేతాలు పంపారు. చైనాలో జరిగిన భారీ సైనిక కవాతుకు ఆయన తన 13 ఏళ్ల కుమార్తె కిమ్ జు యేతో కలిసి హాజరయ్యారు. ఒక విదేశీ పర్యటనకు కిమ్ తన కుమార్తెను వెంట తీసుకురావడం ఇదే మొదటిసారి కావడంతో, తదుపరి పాలకురాలు ఆమే అనే ప్రచారం ఊపందుకుంది. రెండో ప్రపంచ యుద్ధంలో జపాన్‌పై చైనా సాధించిన విజయానికి 80 ఏళ్లు పూర్తయిన సందర్భంగా బీజింగ్‌లో ఈ సైనిక ప్రదర్శనను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరయ్యేందుకు కిమ్ నిన్న తన ప్రత్యేక బుల్లెట్ ప్రూఫ్ రైలులో బీజింగ్ చేరుకున్నారు. రైలు దిగే సమయంలో ఆయన వెంటే కిమ్ జు యే కూడా ఉన్నట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. కిమ్ తన కుమార్తెను ప్రపంచానికి పరిచయం చేయడం ఇది కొత్తేమీ కాదు. 2022లో తొలిసారిగా ఒక ఖండాంతర బాలిస్టిక్ క్షిపణి ప్రయోగ కేంద్రం వద్ద ఆమె కనిపించారు. ఆ తర్వాత 2023లో జరిగిన మిలిటరీ వ్యవస్థాపక దినోత్సవ పరేడ్‌లో కూడా తండ్రితో పాటు పాల్గొన్నారు. అప్పటి నుంచి పలు కీలక అధికారిక కార్యక్రమాల్లో ఆమె కనిపిస్తూనే ఉన్నారు. భవిష్యత్తులో పాలన తన వారసుల చేతిలోనే ఉంటుందని చెప్పడానికే కిమ్ ఇలా చేస్తున్నారని విశ్లేషకులు భావిస్తున్నారు. ఆమె వారసురాలు అనే వాదనలకు ఉత్తర కొరియా అధికారిక మీడియా కూడా బలం చేకూరుస్తోంది. మొదట్లో ఆమెను ప్రియమైన కుమార్తెగా పేర్కొన్న మీడియా, ఆ తర్వాత గౌరవనీయ కుమార్తెగా అభివర్ణించడం మొదలుపెట్టింది. దేశంలో అత్యున్నత గౌరవం ఉన్న వ్యక్తులకు మాత్రమే ఈ విశ్లేషణాన్ని వాడతారు. కిమ్ కూడా అధికార పగ్గాలు చేపట్టడానికి ముందు గౌరవనీయ కామ్రేడ్‌గా పిలవబడ్డారు. ఈ పరిణామాలన్నీ వారసత్వ ప్రచారాన్ని బలపరుస్తున్నాయి. అయితే, ప్రస్తుతం కిమ్ జు యే వయసు 13 సంవత్సరాలే కావడంతో, వారసత్వ మార్పిడికి ఇంకా చాలా సమయం ఉందని నిపుణులు విశ్లేషిస్తున్నారు. దక్షిణ కొరియా నిఘా వర్గాల సమాచారం ప్రకారం, కిమ్‌కు ముగ్గురు సంతానం కాగా, వారిలో కిమ్ జు యే రెండో సంతానం. అయినప్పటికీ, ఆమెకే పాలనా పగ్గాలు దక్కే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని అంచనాలు వెలువడుతున్నాయి.

# గనుల యజమాని నన్ను ప్రలోభ పెట్టాలనిచూసారు

## మధ్యప్రదేశ్‌లో న్యాయమూర్తి సంచలన ప్రకటనలు

**భోపాల్, సెప్టెంబర్ 4:** అధికార బీజేపీ ఎమ్మెల్యే ఒకరు ఒక కేసులో తనను ప్రభావితం చేయడానికి, ప్రలోభ పెట్టడానికి నేరుగా సంప్రదింపులు జరిపాడని రాతపూర్వకంగా పేర్కొంటూ, ఆ కేసును విచారించనని ఒక జడ్జి బహిరంగంగా ప్రకటించడం బీజేపీ పాలిత మధ్యప్రదేశ్‌లో సంచలనం సృష్టించింది. గనుల కంపెనీ యజమాని, బీజేపీ ఎమ్మెల్యే సంజయ్ పాఠక్ కేసు విషయమై తనతో చర్చించడానికి ప్రయత్నించాడని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ విశాల్ మిశ్రా ఈ నెల 1న జారీ చేసిన ఉత్తర్వులో పేర్కొని, ఆ పిటిషన్‌ను విచారించడానికి తిరస్కరించారు. జడ్జి నిర్ణయం కోర్టు రూములో బాంబులా పేలి న్యాయవర్గాల్లో సంచలనం సృష్టించింది. అధికార బీజేపీ ఎమ్మెల్యే తనను నేరుగా కలిసి, కేసు విషయమై ప్రభావితం చేయడానికి ప్రయత్నించాడని సిట్టింగ్ జడ్జి ప్రకటించడం ఇదే తొలిసారి. ఈ కేసును చూస్తే మైనింగ్ మాఫియా ఎంత శక్తివంతమైనదో అర్థమవుతున్నది. ఎమ్మెల్యే పాఠక్, ఆయన కుటుంబ సభ్యులకు చెందిన మైనింగ్ కంపెనీలు పలు అక్రమాలకు పాల్పడుతున్నాయని, దీనిపై ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా దర్యాప్తు సంస్థలు కూడా ఏమీ చర్యలు తీసుకోవడం లేదని ఆరోపిస్తూ కాట్నికి చెందిన అశుతోష్ మను దీక్షిత్ ఈ ఏడాది జూన్‌లో హైకోర్టును ఆశ్రయించారు.



# దావణగెరే ఎస్పీపై ఎమ్మెల్యే వ్యక్తిగత విమర్శలు కేసు నమోదు!

**దావణగేరే, సెప్టెంబరు 4:** కర్ణాటకలో ఓ బీజేపీ ఎమ్మెల్యే మహిళా పోలీస్ ఉన్నతాధికారిపై చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారాన్ని రేపాయి. దావణగెరె జిల్లా ఎస్పీ ఉమా ప్రశాంత్‌ను ఉద్దేశించి, ఆమె కాంగ్రెస్ నేతల ఇంట్లో 'పెంపుడు కుక్క'లా వ్యవహరిస్తున్నారంటూ హరిహర బీజేపీ ఎమ్మెల్యే బి.పి. హరీశ్ చేసిన అనుచిత వ్యాఖ్యలపై పోలీసులు కేసు నమోదు చేశారు. స్వయంగా ఎస్పీ ఉమా ప్రశాంత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు బుధవారం దావణగెరెలోని కేటీజే నగర్ పోలీస్ స్టేషన్‌లో హరీశ్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. దావణగెరెలో రిపోర్టర్స్ గిల్డ్ నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఎమ్మెల్యే హరీశ్ మాట్లాడుతూ.. "నేనొక ఎమ్మెల్యేని. కానీ, ఎస్పీ నన్ను ఏదైనా కార్యక్రమంలో చూస్తే ముఖం చిట్లించుకుంటున్నారు. అదే కాంగ్రెస్‌కు చెందిన శమనూరు కుటుంబ సభ్యుల కోసం మాత్రం గేటు వద్ద పడిగాపులు కాస్తున్నారు. అచ్చం వాళ్లింట్లోని పోమరేనియన్ కుక్కలా ఆమె ప్రవర్తన ఉంటోందని తీవ్రస్థాయిలో విమర్శించారు. కాంగ్రెస్ సీనియర్ నేత శమనూరు శివశంకరప్ప ఎమ్మెల్యేగా ఉండగా, ఆయన కుమారుడు ఎస్.ఎస్. మల్లికార్జున్ రాష్ట్ర మంత్రిగా, కోడలు ప్రభా మల్లికార్జున్ దావణగెరె ఎంపీగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. కొన్ని సంఘటనలను ఉదాహరణగా చూపుతూ, హరిహరలో జరిగిన ఓ కార్యక్రమంలో ఎస్పీ తనను పట్టించుకోకుండా, అగౌరవంగా వేదికపై కూర్చున్నారని హరీశ్ ఆరోపించారు.

గాంధీ భవన్ వద్ద మండుటెండలో ఎంపీ ప్రభా మల్లికార్జున్ కోసం ఎస్పీ గంటల తరబడి ఎదురుచూశారు. నేనూ ప్రజాప్రతినిధినే, ఆమె కూడా ప్రజాప్రతినిధే. మరి ఈ వివక్ష ఎందుకని ఆయన ప్రశ్నించారు. అధికారంలో ఉన్నవారి అండ చూసుకుంటే మంచిదని ఎస్పీ భావిస్తున్నారని, కానీ ఇదంతా తాత్కాలికమేనని ఆయన వ్యాఖ్యానించారు. ఇదిలా ఉండగా, ఇటీవల మరో కాంగ్రెస్ ఎమ్మెల్యే ఆర్.వి. దేశ్‌పాండే సైతం ఓ మహిళా రిపోర్టర్‌తో అనుచితంగా ప్రవర్తించడం వివాదాస్పదమైంది. రాష్ట్రంలో బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్న మహిళలపై రాజకీయ నాయకులు చేస్తున్న ఇలాంటి వ్యాఖ్యలపై సర్వత్రా తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

# మళ్లీ నవ్వులపాలయిన పాక్ ప్రధాని షరీఫ్



**బీజింగ్, సెప్టెంబరు 4:** పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్‌ను పాత ఇబ్బందే మళ్లీ వెంటాడింది. అంతర్జాతీయ వేదికపై రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఎదుట ఆయన మరోసారి నవ్వుల పాలయ్యారు. మూడేళ్ల క్రితం జరిగిన ఘటనే పునరావృతం కావడంతో ఆయన ఇబ్బంది పడిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. చైనాలో జరిగిన షాంఘై సహకార సంస్థ సదస్సు సందర్భంగా షెహబాజ్ షరీఫ్, పుతిన్‌తో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఇద్దరు నేతలు చర్చలు ప్రారంభించేందుకు సిద్ధమవుతుండగా, షెహబాజ్ తన ఇయర్‌ఫోన్‌ను చెవికి సరిగ్గా పెట్టుకోవడానికి చాలా ఇబ్బంది పడ్డారు. అది పదేపదే జారిపోతుండటంతో ఆయన అసహనానికి గురయ్యారు. షెహబాజ్ అవస్థను గమనించిన పుతిన్, ముసిముసిగా నవ్వుతూ తన ఇయర్‌ఫోన్‌ను తీసి దాన్ని ఎలా పెట్టుకోవాలో చేతి సైగలతో చూపించారు. ఈ ఘటనతో పాక్ ప్రధాని తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. సరిగ్గా ఇలాంటి ఘటనే 2022లో ఉజ్బెకిస్థాన్‌లో జరిగిన సదస్సులోనూ చోటుచేసుకుంది. అప్పుడు కూడా పుతిన్ ఎదుటే షెహబాజ్ తన ఇయర్‌ఫోన్‌తో కుస్తీ పడ్డారు. అధికారులు సహాయం చేయడానికి ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. ఆ వీడియో కూడా అప్పట్లో విపరీతంగా వైరల్ అయింది. 'బీజింగ్‌లో షెహబాజ్ హెడ్‌ఫోన్ జారిపోవడం చూసి పుతిన్ నవ్వారు. మళ్లీ అదే జరిగింది' అని ఓ నెటిజన్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. చైనా పర్యటనలో షెహబాజ్ షరీఫ్‌కు ఇదొక్కటే కాదు, మరికొన్ని ఇబ్బందికర సంఘటనలు కూడా ఎదురయ్యాయి. ప్రధాని నరేంద్ర మోదీ, పుతిన్‌తో కలిసి నడుస్తుండగా షెహబాజ్ ఒంటరిగా పక్కన నిలబడి ఉన్న వీడియో కూడా వైరల్ అయింది.

# పాలస్తీనాను ప్రత్యేక దేశంగా గుర్తిస్తున్నాం!

## బెల్జియం ప్రధాని అధికారిక ప్రకటన



**బ్రస్సెల్స్, సెప్టెంబరు 4:** ప్రపంచ దేశాల మధ్య నెలకొన్న ఉద్రిక్తతకు, పాలస్తీనా పట్ల పెరుగుతున్న అంతర్జాతీయ సానుభూతికి అద్దం పడుతూ బెల్జియం పాలస్తీనాను ప్రత్యేక దేశంగా గుర్తిస్తామని ప్రకటించింది. ఐక్యరాజ్యసమితి సాధారణ సభలో పాలస్తీనాను పూర్తి స్థాయి దేశంగా గుర్తించనున్నట్లు అధికారికంగా ప్రకటించింది. ఇజ్రాయెల్‌పై పన్నెండు కఠినమైన ఆంక్షలను విధించనున్నట్లు కూడా స్పష్టం చేసింది. గాజాలో ఇజ్రాయెల్ బలగాలు జరుపుతున్న దాడులు, అక్కడ నెలకొన్న భయంకరమైన మానవతా సంక్షోభం, అంతర్జాతీయ చట్టాల ఉల్లంఘనలను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు బెల్జియం విదేశాంగ మంత్రి మాక్సిమ్ ప్రివోట్ తెలిపారు. ఆయన తన అధికారిక ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేశారు. ప్రివోట్ వెల్లడించిన ఆంక్షలలో ప్రధానంగా ఇజ్రాయెల్ ఆక్రమిత వెస్ట్ బ్యాంక్ ప్రాంతంలో ఉన్న అక్రమ నివాసాల నుంచి దిగుమతి చేసుకునే ఉత్పత్తులపై నిషేధం విధించారు. అలాగే ఇజ్రాయెల్ కంపెనీలతో ప్రభుత్వ ఒప్పందాలను సమీక్షించడం వంటివి కూడా ఇందులో ఉన్నాయి. తమ ఈ చర్య ఇజ్రాయెల్ ప్రజలకు వ్యతిరేకం కాదని కేవలం ఆ దేశ ప్రభుత్వం అంతర్జాతీయ, మానవతా చట్టాలను గౌరవించేలా ఒత్తిడి తీసుకురావడమే తమ లక్ష్యమని ఆయన వివరించారు. ఈ నిర్ణయం ద్వారా ఇజ్రాయెల్ సైన్యం, హమాస్ ఉగ్రవాదులపై ఒత్తిడి పెరుగుతుందని బెల్జియం భావిస్తోంది.పాలస్తీనాను దేశంగా గుర్తించింది ఒక్క బెల్జియం మాత్రమే కాదు. ఇప్పటికే ఫ్రాన్స్, యునైటెడ్ కింగ్‌డమ్, కెనడా, ఆస్ట్రేలియా వంటి పలు పాశ్చాత్య దేశాలు ఐక్యరాజ్య సమితిలో పాలస్తీనాను దేశంగా గుర్తిస్తామని ప్రకటించాయి. ఈ దేశాలన్నీ కూడా సెప్టెంబర్ 9వ తేదీ నుంచి 23వ తేదీ వరకు న్యూయార్క్‌లో జరగనున్న ఐక్యరాజ్యసమితి సాధారణ సభలో తమ నిర్ణయాన్ని అధికారికంగా ప్రకటిస్తాయి. స్పెయిన్, ఐర్లాండ్, నార్వే వంటి దేశాలు గత ఏడాదిలోనే పాలస్తీనాకు దేశ హోదాను కల్పించాయి. ప్రస్తుతం ఐక్యరాజ్యసమితిలోని 193 సభ్య దేశాలలో 147 దేశాలు ఇప్పటికే పాలస్తీనాను దేశంగా గుర్తించాయి.

## సంక్షిప్తంగా..

### లష్కరేకు అందిన నిధులపై దర్యాప్తు



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 4:** పహల్గాం ఉగ్రదాడికి పాల్పడిన లష్కరే సంస్థ ది రెసిస్టెన్స్ ఫ్రంట్‌కు పలు దేశాల నుంచి నిధులు అందినట్లు తేలింది. ఈ దాడి ఇన్వెస్టిగేషన్‌ను జాతీయ దర్యాప్తు సంస్థ వేగవంతం చేసింది. తాజాగా టిఆర్ఎఫ్‌కు ఏ దేశాల నుంచి నిధులు అందాయో అన్న వివరాలను వెల్లడించింది. ఇందుకోసం ఉగ్రమూక చేసిన మొత్తం 463 ఫోన్‌కాల్స్‌ను విశ్లేషించింది. వీటిల్లో ముఖ్యంగా పాకిస్తాన్, మలేసియా, గల్ఫ్ దేశాల నుంచి టిఆర్ఎఫ్‌కు నిధులు అందినట్లు గుర్తించింది. టిఆర్ఎఫ్‌కు మలేసియాకు చెందిన యాసిర్ హయత్ అనే వ్యక్తి రూ.9 లక్షలు అందించాడు.

### విమానంలో హరహరమహాదేవ అంటూ అల్లరి



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 4:** విమాన ప్రయాణంలో చోటు చేసుకునే కొన్ని ఘటనలు ప్రముఖంగా వార్తల్లో నిలుస్తుంటాయి. ముఖ్యంగా ప్రయాణికుల ప్రవర్తన చర్చకు దారితీస్తుంటుంది. కొందరు వ్యక్తులు తప్పతాగి వికృతచేష్టలకు పాల్పడుతుంటారు. మరికొందరు తోటి ప్రయాణికుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తుంటారు. తాజాగా ఓ వ్యక్తి ఇండిగో విమానంలో హల్‌చల్ చేశాడు. మద్యం మత్తులో మతపరమైన నినాదాలు చేస్తూ తోటి ప్రయాణికులను ఇబ్బందులకు గురి చేశారు. ఢిల్లీ నుండి కోల్‌కతాకు వెళుతున్న ఇండిగో విమానం 6571లో ఓ ప్రయాణికుడు మద్యం మత్తులో గందరగోళం సృష్టించాడు. 31డీ సీటులో కూర్చున్న ప్రయాణికుడు విమానం గాల్లో ఉండగా 'హర హర మహాదేవ' నినాదాలతో హోరెత్తించాడు. క్యాబిన్ సిబ్బంది పట్ల దురుసుగా ప్రవర్తించాడు. అనుచిత వ్యాఖ్యలు చేస్తూ తోటి ప్రయాణికులను ఇబ్బందులకు గురి చేశాడు. దీంతో క్యాబిన్ సిబ్బంది అతడిపై అధికారులకు ఫిర్యాదు చేశారు.

### ఆ మూడు దేశాల బాధితులు ఫ్రీగా భారత్‌లో తిరగొచ్చు

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 4:** పొరుగు దేశాల నుంచి వచ్చిన మైనారిటీలకు భారత ప్రభుత్వం పాస్‌పోర్టుల విషయంలో ఊరటనిచ్చింది. బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్థాన్, పాకిస్థాన్ దేశాల్లో మతపరమైన పీడనను భరించలేక భారత్‌కు వచ్చిన మైనారిటీలు (హిందూ, సిక్కు, బౌద్ధ, జైన, పార్సీ, క్రిస్టియన్ మతస్తులు) మన దేశంలో పాస్‌పోర్టుగానీ, ఎలాంటి ట్రావెల్ డాక్యుమెంట్లుగానీ లేకుండా ఉండేందుకు కేంద్ర హోంశాఖ అనుమతినిచ్చింది. అయితే గత ఏడాది అమల్లోకి వచ్చిన సిటిజన్‌షిప్ అమెండ్‌మెంట్ ఆక్ట్ ప్రకారం, 2014 డిసెంబర్ 31 కంటే ముందు పాక్, ఆఫ్ఘన్, బంగ్లాదేశ్‌ల నుంచి భారత్‌కు వచ్చిన మైనారిటీలకు మాత్రమే పాస్‌పోర్టు లేకున్నా నివాసం ఉండే అవకాశం ఉంటుంది. కానీ 2014 తర్వాత కూడా వచ్చిన చాలామంది మైనారిటీల పరిస్థితి దయనీయంగా మారుతుంది. అందుకే కొత్తగా అమల్లోకి వచ్చిన 'ఇమ్మిగ్రేషన్ అండ్ ఫారినర్స్ యాక్ట్ - 2025' కింద తాజా ఆదేశాలు జారీచేశారు.

# ఆ ముగ్గురూ అమెరికాపై కుట్రపన్నుతున్నారు: ట్రంప్

**వాషింగ్టన్, సెప్టెంబరు 4:** చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన ఆరోపణలు చేశారు. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, ఉత్తర కొరియా అధినేత కిమ్ జోంగ్ ఉన్‌లతో కలిసి జిన్‌పింగ్ అమెరికాకు వ్యతిరేకంగా కుట్ర పన్నుతున్నారని ఆయన తీవ్రంగా విమర్శించారు. చైనా నిర్వహించిన భారీ సైనిక పరేడ్‌కు పుతిన్, కిమ్ హాజరు కావడంపై ట్రంప్ మండిపడ్డారు. బుధవారం ట్రంప్ తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ట్రూత్ సోషల్' వేదికగా ఈ వ్యాఖ్యలు చేశారు. అమెరికాకు వ్యతిరేకంగా మీరు కుట్ర పన్నుతున్నప్పుడు, వ్లాదిమిర్ పుతిన్, కిమ్ జోంగ్ ఉన్‌లకు దయచేసి నా హృదయపూర్వక శుభాకాంక్షలుతెలియజేయండని ఆయన వ్యంగ్యంగా పోస్ట్ చేశారు. రెండో ప్రపంచ యుద్ధం సమయంలో చైనా స్వాతంత్రం కోసం అమెరికా సైనికులు తమ రక్తాన్ని ధారపోశారని, ఆ త్యాగాలను జిన్‌పింగ్ ప్రభుత్వం గౌరవిస్తుందో లేదో చూడాలని ప్రశ్నించారు.

చైనా విజయం కోసం ఎందరో అమెరికన్లు ప్రాణాలర్పించారని, వారి ధైర్యసాహసాలను, త్యాగాలను చైనా గుర్తుంచుకోవాలని ఆశిస్తున్నట్లు ట్రంప్ పేర్కొన్నారు.

# కర్ణాటకలో మళ్లీ రాజకీయ అలజడి

## పార్టీలు మారుతున్నారంటూ ఒకరిపై ఒకరు ఆరోపణలు



**బెంగళూరు, సెప్టెంబరు 4:** కర్ణాటక కాంగ్రెస్‌లో మరోసారి ముసలం మొదలైంది. పదవుల పంచాయితీ మళ్లీ మొదటికొచ్చింది. అధికారంలోకి రాగానే సీఎం పదవి కోసం డీకే శివకుమార్ సిద్ధరామయ్య తలపడగా మరోసారి అత్యున్నత పదవి కోసం కాంగ్రెస్‌లో కుమ్ములాటలు జోరందుకున్నాయి. సీఎం పదవి నుంచి సిద్ధరామయ్యని తప్పించి ఆ స్థానంలో డిప్యూటీ సీఎంగా ఉన్న డీకే శివకుమార్‌ను కూర్చోబెట్టాలంటూ మెజారిటీ ఎమ్మెల్యేలు గత కొంతకాలంగా డిమాండ్ చేస్తున్న విషయం తెలిసిందే. ఈ వివాదం వేళ డీకే శివకుమార్ బీజేపీలో చేరబోతున్నారన్న ప్రచారం జోరందుకుంది. ఇప్పుడు తాజాగా మరో ట్విస్ట్ చోటు చేసుకుంది. డీకే, సిద్ధరామయ్య వర్గీయులు పరస్పరం విమర్శలు చేసుకుంటున్నారు. ఒకరిపై ఒకరు మాటల యుద్ధానికి దిగుతున్నారు. ఈ క్రమంలో పలువురు కాంగ్రెస్ నేతలు బీజేపీలో చేరేందుకు సిద్ధమవుతున్నారు అని బహిరంగంగానే వ్యాఖ్యలు చేస్తున్నారు. మాజీ మంత్రి కేఎన్ రాజన్న బీజేపీలో చేరబోతున్నారంటూ ఎమ్మెల్యే హెచ్‌సీ బాలకృష్ణ ఇటీవలే కీలక వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. రాజన్న రాష్ట్ర సహకార మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు. రాహుల్ గాంధీ ఓట్ల చోరీ ఆరోపణలపై వ్యతిరేక గళం వినిపించడంతోనే ఆయనను గత నెల పదవి నుంచి తప్పించారు. ఈ నేపథ్యంలో తన తండ్రి రాజన్న పార్టీ మారుతున్నారని ఎమ్మెల్యే బాలకృష్ణ చేసిన వ్యాఖ్యలపై ఎమ్మెల్సీ, మాజీ మంత్రి తనయుడు రాజేంద్ర రాజన్న తీవ్రంగా స్పందించారు. బీజేపీలో చేరే బృందంలో బాలకృష్ణ ఉన్నారంటూ ఆరోపించారు. సీఎం పదవి కోసం పాకులాడుతున్న నేత (డీకే శివకుమార్‌ను ఉద్దేశించి)వెళ్లబోతున్నారన్నారు.

# పెర్‌ఫ్యూమ్ ఇకపై దేశీయంగా తయారీ..

## ఉత్తరాఖండ్‌లో యువతకు శిక్షణ



**డెహ్రాడూన్, సెప్టెంబర్ 4:** పర్ ఫ్యూమ్ అనగానే మనకు గుర్తొచ్చేది ఫ్రాన్స్ రాజధాని పారిస్ మాత్రమే. అయితే ఇకపై దేశీయ సువాసనలను ప్రపంచానికి పరిచయం చేయడానికి ఉత్తరాఖండ్‌లోని స్కూల్ ఆఫ్ పర్‌ఫ్యూమరీ ఇన్‌స్టిట్యూట్ సిద్ధమైంది. దేశంలో పర్‌ఫ్యూమ్‌ల తయారీని ప్రోత్సహించడమే లక్ష్యంగా ఉత్తరాఖండ్‌లోని స్కూల్ ఆఫ్ పర్‌ఫ్యూమరీ ఇన్‌స్టిట్యూట్ పలు చర్యలు తీసుకుంటోంది. పర్‌ఫ్యూమ్‌లను తయారు చేసే విధానంపై యువతకు శిక్షణనిస్తోంది. పర్‌ఫ్యూమ్‌ల తయారీలో ఏఏ మొక్కలను వాడాలనే విషయంపై వారికి తరగతులు నిర్వహిస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. పర్‌ఫ్యూమ్‌లకు మంచి డిమాండ్ ఉండడంతో యువత దీనిని ఉపాధిగా కూడా చేసుకోవచ్చని సూచించారు. తాము తయారు చేస్తున్న ఉత్పత్తులకు త్వరలో అంతర్జాతీయ గుర్తింపు లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. తమ ఇన్‌స్టిట్యూట్ నేతృత్వంలో తయారు చేసిన పర్‌ఫ్యూమ్‌లను ప్రధాని నరేంద్ర మోడీ ప్రశంసించారని అన్నారు. అయితే దేశీయంగా సంప్రదాయంగా వేల సంవత్సరాల నుంచి పరిమళాలను తయారుచేస్తున్నారు. దీనికి ప్రధాన కేంద్రం ఉత్తరప్రదేశ్‌లోని కనౌజ్.

## చేనేత ఉత్పత్తులపై క్యూఆర్ కోడ్‌తో కూడిన వీవర్ కార్డు



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్):** కూటమి ప్రభుత్వం రాకతో చేనేతకు మహర్దశ ప్రారంభమైందని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖల మంత్రి ఎస్.సవిత అన్నారు. నేతన్నల అభివృద్ధికి సంక్షేమ పథకాలతోపాటు చేనేత ఉత్పత్తులకు మార్కెటింగ్ సదుపాయాలు కల్పిస్తున్నామని, ప్రతి నెలా ఎగ్జిబిషన్లు నిర్వహించి తయారీదారులే ప్రత్యక్షంగా అమ్ముకునేలా చేస్తుండటం వల్ల వినియోగదారులకు తక్కువ ధరకే చేనేత వస్త్రాలు అందుతున్నాయని వివరించారు. నేతన్నలకు నెలకు రూ.4,000 పెన్షన్, 90 శాతం సబ్సిడీతో ఉపకరణాలు, లేటెస్ట్ డిజైన్లపై శిక్షణ, ప్రతి కుటుంబానికి 200 యూనిట్లు, మరమగ్గాలకు 500 యూనిట్ల ఉచిత విద్యుత్ అందజేస్తున్నామని తెలిపారు. చేనేత ఉత్పత్తులపై క్యూఆర్ కోడ్‌తో వీవర్ కార్డులు ఇస్తున్నామని, ఆప్కో ద్వారా కొత్త డిజైన్లను అందుబాటులో ఉంచుతున్నామని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి ప్రతి వారం చేనేత వస్త్రాలు ధరించడం నేతన్నలకు ప్రోత్సాహాన్నిస్తోందని, అన్ని వర్గాల ప్రజలను ఆకట్టుకునేలా చేనేత దుస్తులను ఆన్‌లైన్, డిజిటల్ ప్లాట్‌ఫార్మ్‌ల ద్వారా అందుబాటులో ఉంచుతున్నామని మంత్రి వెల్లడించారు.

## పది లక్షలతో లక్ష్మీగణపతి అలంకారం



**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్):** నవులూరు బత్తుల వారి వీధిలో వినాయక చవితిని పురస్కరించుకొని బాల గణపతి యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుడిని బుధవారం రాత్రి 10 లక్షల 116 రూపాయల కరెన్సీ నోట్లతో లక్ష్మీ గణపతి గా అలంకరించారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సుమారు 1500 మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కరెన్సీ నోట్లతో అలంకరించిన బాలగణపతిని దర్శించుకొని, అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. అనంతరం యూత్ ప్రతినిధులు మాట్లాడుతూ అన్నదానం కు రెండు క్వింటాళ్ల బియ్యం అందజేసిన రాష్ట్ర మంత్రివర్యులు నారా లోకేష్, సహకరించిన దాతలకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూత్ ప్రతినిధులు తాడిబోయిన సాయి, వెంకట్, గోపి, నాగబాబు, బత్తుల శివకృష్ణ, గోపి, తోట వంశీ, సారమేకల గంగాధరరావు, పల్లా బాలాజీ, గణేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎయిమ్స్‌లో ఆస్వికాన్- 2025 ఏడవ వార్షిక సదస్సు



**● యాంటీ మైక్రో బయల్ రెసిస్టెన్స్ పై వర్క్ షాప్**

**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్):** మంగళగిరి ఎయిమ్స్ సీఎఫ్ఎం డెమో హాల్లో గురువారం యాంటీ మైక్రో బయల్ స్టీవార్డ్ షిప్ ఇన్ ఇండియా, ఎయిమ్స్ క్లినికల్ మైక్రో బయాలజీ, జనరల్ మెడిసిన్ పార్మకాలజీ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో గురువారం ఆస్వికాన్- 2025 ఏడవ వార్షిక వర్క్ షాప్ ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా డిఎంహెచ్ఓ డాక్టర్ కె విజయలక్ష్మి హాజరై సదస్సును ప్రారంభించారు. వర్క్ షాప్ లో యాంటీబయాటిక్స్ ను వైద్యుల ప్రిస్క్రిప్షన్ లేకుండా తీసుకొని రెండు రోజులు వాడి ఆపేయడం వల్ల రెసిస్టెన్స్ డెవలప్ అవుతుందని, అత్యవసర పరిస్థితులలో వాడినప్పుడు పనిచేయవని, వైద్యులు వ్యాధి నిర్ధారించిన తర్వాత కోర్సు ప్రకారం యాంటీబయాటిక్స్ వాడాలని, క్రమబద్ధీకరణ లేకుండా వాడకూడదనే పలు అంశాలపై వర్క్ షాప్ లో వివరించారు. ఈ కార్యక్రమంలో ఎయిమ్స్ సీఎఫ్ఎం హెచ్ఓడీ డాక్టర్ రాజీవ్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ది. తెనాలి అర్బన్ బ్యాంక్ ఎన్నికల్లో పోటీ చేస్తా : గుమ్మడి రమేష్



**తెనాలి,(జర్నలిస్ట్ ఫైల్)** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విధానాలను స్వాగతిస్తూ, పార్టీ కోసమే నేటికీ పని చేస్తున్నానని రానున్న అర్బన్ బ్యాంక్ ఎన్నికల్లో,ఈనెల 7న నామినేషన్ వేయనున్నామని మూడో వార్డు మాజీ కౌన్సిలర్ గుమ్మడి రమేష్ పేర్కొన్నారు.

మార్కెట్ యార్డ్ లోని తమ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో గుమ్మడి రమేష్ మాట్లాడుతూ,ది. తెనాలి కోపరేటివ్ అర్బన్ బ్యాంక్ ఎన్నికలు ఈనెల 14ననిర్వహించనున్న క్రమంలో,తమ ప్యానెల్ నామినేషన్ వేయనున్నట్లు తెలిపారు. కూటమి పార్టీ విధానాలకు కట్టుబడి పార్టీ కోసం పనిచేస్తున్నామని అన్నారు.పార్టీ ఆవిర్భావం నుండి, పార్టీకి తమ సేవలు అందిస్తున్నామని, రాష్ట్ర నాయకత్వం తమ సేవలను గుర్తించి, అర్బన్ బ్యాంక్ చైర్మన్ గా అవకాశం కల్పిస్తే, సహకార రంగంలో, బ్యాంక్ ప్రతిష్టను,పెంచే విధంగా, శాఖలు పెంచి,అభివృద్ధి దిశలోనడిపిస్తామని చెప్పారు.

ఇటీవల కొందరు వారి వ్యక్తిగత నిర్ణయాలను, కూటమి పార్టీ నిర్ణయం అని చెబుతున్నారని, అది వాస్తవం కాదన్నారు. కూటమి పార్టీలు ఇంతవరకు ఎవరికీ ఎటువంటి హామీ ఇవ్వలేదని, తమకున్న సమాచారమని తెలిపారు. పోటీ చేయడం అనివార్యమని,తనపై కొందరుఅసత్య ప్రచారం చేస్తున్నారని, వాస్తవాలు ప్రజలకు, పార్టీ పెద్దలకు తెలుసని అన్నారు. తన ప్యానల్ నామినేషన్ వేయడం తథ్యమన్నారు.

## చదలవాడ ఉమేష్ చంద్రకు నివాళులు అర్పించిన ఎమ్మెల్సీ ఆలపాటి. మంత్రి నాదెండ్ల





**తెనాలి,(జర్నలిస్ట్ ఫైల్)** ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ ఉన్నతాధికారు, అభిమానులు సమక్షంలో దివంగత ఐపీఎస్ అధికారి చదలవాడ ఉమేష్ చంద్ర, వర్ధంతి వేళ ఘన మైన నివాళులు సమర్పించారు. స్థానిక చెంచుపేటలోని చదలవాడ ఉమేష్ చంద్ర విగ్రహం సెంటర్లో,ఆయన 26వ వర్ధంతిని పురస్కరించుకొని, పోలీస్ శాఖ, ఉమేష్ చంద్ర కుటుంబ సభ్యులు సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని సేవా కార్యక్రమాలతో ముగించారు.

ఈ విశిష్ట కార్యక్రమంలో రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, కృష్ణ గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, పలువురు అధికారులు హాజరై పోలీస్ ఉన్నతాధికారిగా చదలవాడ ఉమేష్ చంద్ర, సమాజానికి అందించిన సేవలను స్మరించుకుంటూ, ఆయన కాంస్య విగ్రహానికి గజమాలతో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి నాదెండ్ల మనోహర్ మీడియాతో మాట్లాడుతూ విధి నిర్వహణలో అంకిత భావంతో సేవలందిస్తూ సమాజంలో శాంతి భద్రతల స్థాపనకు ఉమేష్ చంద్ర విలువైన సేవలు అందించారని అన్నారు. వారి స్ఫూర్తితో వారి సతీమణి నాగరాణి పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ గా ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్నారని కొనియాడారు. ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ 25 సంవత్సరాల క్రితం ఓ మంచి మనసున్న అధికారిని మనం కోల్పోయామని, భౌతికంగా ఆయన లేకపోయినా, అందించిన సేవలద్వరా,ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా ఉంటారని అన్నారు. పోలీసు ఉన్నతాధికారిగా కడప జిల్లాలో, ఉమ్మడిఆంధ్రప్రదేశ్ లోని కరీంనగర్ జిల్లాలో,ఉమేష్ చంద్ర అందించిన సేవలు స్ఫూర్తిదాయకమని అన్నారు. ఫ్యాక్ష నిజాన్ని, నక్సలిజాన్ని ధైర్యంగా ఎదుర్కొని, నిజాయితీకి నిలువుటదంగా, నిలచిన ఉమేష్ చంద్ర సమాజానికి ఓ స్ఫూర్తి అని అన్నారు. అనంతరం అదే ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పలువురు వక్తలు తమ ప్రసంగాలలో, ఉమేష్ చంద్ర జీవన శైలిని, పోలీస్ అధికారిగా అందించిన సేవలను స్మరించుకున్నారు. ఉమేష్ చంద్ర సతీమణి పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతు పోలీస్ అధికారిగా తన భర్త,సమాజానికి చేసినసేవలను స్మరించుకుంటూ, నివాళులర్పించేందుకు, విచ్చేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలను తెలిపారు. ఈ సందర్భంగా నిరుపేదలకు, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ చేతుల మీదుగా దుప్పట్లు పంపిణీ చేశారు. డి.ఎస్.పి బి. జనార్దన్ రావు మాట్లాడుతూ ఉమేష్ చంద్ర అంటేనే విధి నిర్వహణలో ఉన్న పోలీసులకు ఒక స్ఫూర్తి అని, వారి విలువైన సేవలు మరపు రానివని చెబుతు, కార్యక్రమానికి వందన సమర్పణ చేశారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ సంజనసింహ, డాక్టర్ అజయ్, పట్టణంలోని కూటమి పార్టీల నాయకులు, పోలీస్ అధికారులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## మహిళా శక్తిని చాటి చెప్పండి : ఎమ్మెల్యే నసీర్

- **నేటి స్త్రీశక్తి కార్యక్రమాన్ని జయప్రదం చేయండి**
- **సీఎం చంద్రబాబుతోనే మహిళా సాధికారత**
- **ఈ విషయాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లండి**
- **పార్టీ కేడర్ సమావేశంలో గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్**



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** మహిళా సాధికారత కూటమి ప్రభుత్వంలోనే సాధ్యమని, స్త్రీశక్తి పథకం ద్వారా నారీమణుల ఆత్మగౌరవాన్ని పెంపొందించామని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. గురువారం గుంటూరు తూర్పు నియోజకవర్గ స్త్రీశక్తి కార్యక్రమానికి సంబంధించిన సన్నాహక సమావేశాన్ని బుధవారం స్థానిక తూర్పు శాసనసభ్యుల వారి కార్యాలయంలో కూటమి నేతలతో ఎమ్మెల్యే నసీర్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మహిళల ఆర్థికాభివృద్ధికి పెద్ద పీట వేశారని తెలిపారు. సూపర్ సిక్స్ పథకాలు చెప్పింది చెప్పినట్టు అమలు చేసిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందని అన్నారు. స్త్రీశక్తి పథకం అమలు ద్వారా బస్సుల్లో ఉచిత ప్రయాణానికి నాంది పలికారని, దీని ద్వారా మహిళా లోకం చాలా సంతోషంగా ఉందని అన్నారు. విద్యార్థినులు, మహిళా ఉద్యోగులకు స్త్రీశక్తి పథకం ద్వారా ప్రతి నెలా రూ. 4 వేలు నుంచి రూ. 5 వేల వరకు లబ్ధి చేకూరుతుందని తెలిపారు. రాష్ట్రంలో మహిళాభ్యుదయానికి ఉచిత కుట్టుశిక్షణతోపాటు కుట్టుమిషన్ల పంపిణీ చేస్తున్నట్లు వెల్లడించారు. దీని ద్వారా ఆయా కుటుంబాలకు మహిళలే ఆర్థిక దన్నుగా నిలుస్తున్నారని అన్నారు. ఈ విషయాలను గుంటూరు తూర్పు నియోజకవర్గ ప్రజలకు తెలియజేస్తూ స్త్రీ శక్తి కార్యక్రమానికి అధిక సంఖ్యలో తరలివచ్చేలా అవగాహన కల్పించాలని సూచించారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి లబ్ధిదారులకు అందేలా చూడాల్సిన బాధ్యత పార్టీ కేడర్ దేనని స్పష్టం చేశారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో మహిళలకు రుణాలు, ప్రభుత్వ పథకాలు చేరువయ్యేలా ప్రతి నిత్యం కృషి చేస్తున్నామని వివరించారు.

## స్వచ్ఛ ఆంధ్ర మిషన్ డైరెక్టర్ భూలక్ష్మికి అభినందనలు



**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్):** మంగళగిరి పార్క్ రోడ్డు యాదవపాలెంలో ఇటీవల రాష్ట్ర స్వచ్ఛ ఆంధ్ర మిషన్ కార్పొరేషన్ డైరెక్టర్ గా నియమితులైన ఆరుద్ర భూలక్ష్మిని ఆమె కార్యాలయంలో టీడీపీ పట్టణ బీసీ సెల్ ఆధ్వర్యంలో గురువారం టీడీపీ బీసీ నాయకులు కలసి అభినందించారు. రాష్ట్ర టీడీపీ బీసీ సెల్ అధికార ప్రతినిధి దానబోయిన సుందరరావు యాదవ్, నాయకులు భూలక్ష్మిని శాలువాతో సత్కరించి బోకే అందజేశారు. అనంతరం యాదవ్ మాట్లాడారు. నియోజకవర్గ తెలుగు మహిళ అధ్యక్షురాలుగా భూలక్ష్మి మహిళలను సమన్వయం చేస్తూ పార్టీ చేపట్టే ప్రతి కార్యక్రమంలో ముందంజలో ఉండి, పార్టీలో మంచి పేరు తెచ్చుకున్నారన్నారు. మంత్రి నారా లోకేష్ ను ఆదర్శంగా తీసుకొని పదవికి వన్నె తెచ్చే విధంగా పనిచేయాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ బీసీ సెల్ అధ్యక్షులు వాకా మాధవరావు గౌడ్, గుంటూరు పార్లమెంటు పద్మశాలి సాధికార సమితి కార్యదర్శి జొన్నాదుల బాలకృష్ణ, టీడీపీ బీసీ నాయకులు రుద్రు కోటేశ్వరరావు, శ్రీనివాసరావు, మురళి, దానబోయిన రామారావు, తన్నీరు కృష్ణబాబు, ఓడిశా నరేష్, కలవకొల్లు వీర రాఘవులు, కొత్త శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగి కుటుంబానికి చేయూత

- **రూ. లక్ష ఆర్థిక సహాయం అందజేత**
- **సమాచార శాఖ కమిషనర్ దాతృత్వం**



**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్):** సమాచార శాఖ కమిషనర్ చావలి సునీల్ దాతృత్వాన్ని మరో సారి చాటుకున్నారు. సమాచార శాఖ కార్యాలయంలో పనిచేసే ఉద్యోగి చనిపోగా, సదరు ఉద్యోగి కుటుంబ దిన స్థితిని గమనించిన సమాచార కమిషనర్ స్పందించి, తన నెల వారి జీతం నుంచి రూ. లక్ష ఆర్థిక సహాయంగా అందజేశారు.

అంబేద్కర్ కోనసీమ జిల్లా, పుల్లేటికూరు గ్రామానికి చెందిన బీరా రాముడు, సత్యవతి దంపతుల ఏకైక కుమారుడు బి. ధనరాజ్. మంగళగిరి మండలం చినకాకాని పరిధి జాతీయ రహదారి వెంబడి గల కార్యాలయంలో సబార్డినేట్ గా విధులు నిర్వహిస్తున్నాడు. దురదృష్టవశాత్తు 20 నవంబర్ 2024 న గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందాడు. ఇతనికి 11 మే 2024 న శృతి తో వివాహం జరిగింది. ధనరాజ్ అకాల మరణ సమయానికి అతని భార్య నాలుగు నెలల గర్భవతిగా ఉంది.

అయితే ధనరాజ్ మరణించిన నాటి నుంచి వారి కుటుంబం ఆర్థికంగా వెనుకబడింది. ఈ విషయం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమాచార కమిషనర్ చావలి సునీల్ దృష్టికి రావడంతో ఆయన ఛాంబర్ కు గురువారం ధనరాజ్ కుటుంబ సభ్యులను పిలిపించారు. మీడియా సమక్షంలో ధనరాజ్ కుటుంబానికి లక్ష రూపాయల నగదును సాయం అందజేశారు. భవిష్యత్తులో ఆ కుటుంబానికి అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తామని కమీషనర్ చావలి సునీల్ హామీ ఇచ్చారు. రోడ్డు ప్రమాదంలో తన వద్ద పని చేసే డ్రైవర్ మృతి చెందగా, కొద్ది నెలల క్రితం ఆ డ్రైవర్ కుటుంబానికి చావలి సునీల్ రూ. 4 లక్షలు సేకరించి ఆ నగదును బాధితుని కుటుంబ సభ్యులకు అందజేశారు.

అదే తరహాలో ప్రస్తుతం మరో ఉద్యోగి కుటుంబానికి సాయం అందించి ఆదుకొని అండగా నిలిచారు.

## రైతులతో గౌరవంగా మెలగాలి



**● వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ జవ్వాది**

**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్):** రైతులతో గౌరవంగా మెలగాలని మంగళగిరి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గుంటూరు జిల్లా కోపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ అధికారులకు సూచించారు. ఇక్కడి అధికారుల పని తీరుపై రైతుల నుండి ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు. రైతులకు యూరియా బస్తాలను సక్రమంగా అందించాలని సూచించారు. రైతుల నుంచి మరోసారి ఫిర్యాదులు వస్తే అధికారులపై చట్టపరంగా చర్యలు చేపట్టేందుకు వెనకాడమని హెచ్చరించారు.

## అన్నదాన కార్యక్రమం



**బ్రహ్మంగారిమఠం (జర్నలిస్ట్ ఫైల్):** బ్రహ్మంగారిమఠం మండల కేంద్రంలోని స్థానిక అయ్యప్ప నగర్ గ్రామంలో వెలసి ఉన్న అభయ విఘ్నేశ్వర స్వామి వద్ద గురువారము 9 రోజులు పూజలు అందుకొని వైభవంగా గ్రామ ప్రజలకు ఉన్న గ్రామస్తులు నిర్వహించి అనంతరం బ్రహ్మంసాగర్ ప్రాజెక్టులో నిమజ్జనం నిర్వహించారు మధ్యాహ్నము అభయ విఘ్నేశ్వర స్వామి వద్ద స్థానిక స్వచ్ఛంద కార్యకర్త పి జోగయ్య ధర్మపత్ని మహాలక్ష్మి కుటుంబ సభ్యులు భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు గ్రామ ప్రజలు భక్తులు పాల్గొన్నారు.

## వైభవంగా బ్రహ్మంగారి భాద్రపద మాస కల్యాణ మహోత్సవం



**బ్రహ్మంగారిమఠం (జర్నలిస్ట్ ఫైల్):** జగద్గురు శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి మఠం నందు నూతనంగా నిర్మించబడిన కళ్యాణమండపంలో శ్రీ గోవింద మాంబ సమేత శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి వారి భా ద్రపద మాస కల్యాణ మహోత్సవ కార్యక్రమం అత్యంత వైభవోపేతంగా జరిగినది. ఈ మహోత్సవంలో పాల్గొన్న పూర్వపు మఠాధిపతులు వీర భోగ వసంత వెంకటేశ్వర స్వామి వారి జ్యేష్ట కుమారుడు వెంకటాద్రి స్వాములవారు బ్రహ్మంగారిమఠం దేవస్థానం మేనేజర్ ఈశ్వర చారి మఠం ఆస్థాన సిద్ధాంతిలు మఠం పురోహితులు శాశ్వత ఉభయ దాతలు మరియు భక్తుల సమక్షంలో స్వామివారి కల్యాణ మహోత్సవం అత్యంత వైభవముగా జరిగినది.

## ఏపీ ఎస్ఆర్ఎంలో ఘనంగా గురుపూజోత్సవం



- **10 మంది ప్రొఫెసర్లకు అవుట్ స్టాండింగ్ ఫ్యాకల్టీ అవార్డులు**
- **డాక్టర్ అనిర్బన్ కు వీఎస్ రావు ఫౌండేషన్ బెస్ట్ ఫ్యాకల్టీ అవార్డ్**
- **ఐదేళ్ల సర్వీసు పూర్తయిన అధ్యాపకులకు ప్రశంసా పత్రాలు**

**అమరావతి, (జర్నలిస్ట్ ఫైల్):** ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో గురువారం సాయంత్రం గురు పూజోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. టాటా ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్ సెంటర్ ( హైదరాబాద్) ప్రొఫెసర్ చంద్రశేఖర్ ముఖ్య అతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సమాజంలో ఎంతో గౌరవ ప్రదమైన వృత్తిలో కొనసాగుతున్న గురువులందరూ దేశభక్తి, ఆలోచనాత్మక పౌరులుగా విద్యార్థులను తీర్చిదిద్దాలని కోరారు.

ఈ సందర్భంగా తన గురువైన డాక్టర్ ప్రఫుల్ల చంద్ర రే జీవిత ప్రస్థానాన్ని ప వర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా. వివరించారు. యూనివర్సిటీ పో-వైస్ ఛాన్సలర్ ఆచార్య సిహెచ్ సతీష్ కుమార్ మాట్లాడుతూ, విద్యార్థుల భవిష్యత్తును నిర్దేశించే శక్తి గల టీచర్లు దేశాభివృద్ధిలోనూ కీలక పాత్ర పోషిస్తున్నారన్నారు. యూనివర్సిటీ ప్రొఫెసర్లందరూ బాధ్యతగా బోధన, పరిశోధనల్లో తమకున్న ప్రతిభను విద్యార్థులకు పంచాలన్నారు. ఎస్ఆర్ఎం విద్యానం స్థల రీసెర్స్ (గ్రూప్) ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆచార్య డి నారాయణరావు మాట్లాడుతూ, ప్రపంచ వ్యాప్తంగా ఉపాధ్యాయులకున్న విలువ వెలకట్టలేనిదనీ, ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు కలిగిన సుందర్ పీచాయ్, సత్య నాదెళ్ల వంటి వారంతా వారివారి టీచర్ల ద్వారా అభివృద్ధి పథంలో నడిచిన వారేఉన్నాడు.


**10 మందికి అవుట్ స్టాండింగ్ ఫ్యాకల్టీ అవార్డులు.....**

ఈ సందర్భంగా యూనివర్సిటీ యాజమాన్యం బోధనలో రాణిస్తున్న 10 మంది ప్రొఫెసర్లకు అవుట్ స్టాండింగ్ ఫ్యాకల్టీ ఆవార్డులను ప్రకటించింది. డాక్టర్ కే ఏ సునీత, డాక్టర్ తో సిఫ్ ఖాన్, డాక్టర్ ప్రద్యుల్ కుమార్ సాంకి, డాక్టర్ రమేష్ వడ్డి, డాక్టర్ జేసిపీ భగత్ సింగ్, డాక్టర్ జాకర్ అహమ్మద్ దార్, డాక్టర్ జతీష్ కుమార్ దాస్, డాక్టర్ లలిత్ మహాపాత్ర, డాక్టర్ వినీ త్ థామస్, డాక్టర్ నలే టి సుమలతలు అవార్డులను అందుకున్నారు. డాక్టర్ వీ ఎస్ రావు ఫౌండేషన్ ఏటా డాక్టర్ హెచ్పీ తివారీ పేరిట అందజేసే ప్రతిష్టాత్మక పురస్కారం ఈ ఏడాది డాక్టర్ అనిర్బన్ ఘోష్కు లభించింది.. వీరందరికీ అవార్డు కింద రూ. 50 వేల నగదు పారితోషికం, ప్రశంసా పత్రం జ్ఞాపికలను ప్రదానం చేశారు. అనంతరం ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న మరో 22 మంది అధ్యాపకులను వేదికపైకి ఆహ్వానించి ప్రశంసా పత్రాలను అందజేశారు. విద్యార్థులు స్వయంగా ఎంపిక చేసిన మరో 9 మంది ప్రొఫెసర్లకు పాపులర్ బెస్ట్ ఫ్యాకల్టీ పురస్కారాలను అందజేసి గౌరవించారు.

ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్ ప్రేమ్ కుమార్, హెచ్ ఆర్ డైరెక్టర్ సామల ఐజక్, శివరంగన్, రేవతీ బాలక్రిష్ణన్ తదితరులు పాల్గొన్నారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక చందాదారులుగా చేరాలని అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

## విశాఖ, విజయవాడల్లో పర్యటించనున్న సీఎం



- విశాఖలో ఇంటర్నేషనల్ మీడియేషన్ కాన్ఫరెన్సుకు హాజరు కానున్న చంద్రబాబు
- విజయవాడలో టీచర్స్ డేలో పాల్గొననున్న ముఖ్యమంత్రి

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్)** : వివిధ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు సీఎం చంద్రబాబు శుక్రవారం విశాఖ, విజయవాడల్లో పర్యటించనున్నారు. విశాఖలో జరిగే ఇంటర్నేషనల్ మీడియేషన్ కాన్ఫరెన్సుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హాజరు కానున్నారు. శుక్రవారం ఉదయం 7.30 గంటలకు క్యాంపు కార్యాలయం నుంచి హెలికాప్టర్ లో సీఎం విశాఖ బయల్దేరి వెళ్లనున్నారు. విశాఖలోని రాడిసన్ బ్లూ హెూటల్ లో ఉదయం 10 గంటలకు జరిగే ఏసీఐఎఎం ఇంటర్నేషనల్ మీడియేషన్ కాన్ఫరెన్సుకు ముఖ్యమంత్రి హాజరు కానున్నారు. స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ జస్టిస్ లో భాగంగా ఆల్టర్నేటివ్ డిస్ప్యూట్ రిజల్యూషన్ (ఏడీఆర్) పై ముఖ్యమంత్రి ప్రసంగించనున్నారు. ఈ సమావేశంలో జాతీయ, అంతర్జాతీయ స్థాయి న్యాయ నిపుణులు పాల్గొంటారు. సమావేశం అనంతరం ఆయన అమరావతికి తిరిగి రానున్నారు. సాయంత్రం 6 గంటలకు విజయవాడలో జరిగే ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో సీఎం పాల్గొననున్నారు. ఉత్తమ పని తీరు కనబరిచిన 175 మంది టీచర్లకు అవార్డులు ప్రదానం చేయనున్నారు.

## జీఎస్టీ సంస్కరణలు పేద, మధ్యతరగతి ప్రజల భవిష్యత్తుకు బలమైన భరోసా



- తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు

**విశాఖపట్నం (జర్నలిస్ట్ ఫైల్)**:జీఎస్టీ భారాన్ని తగ్గించడం ద్వారా పేద, మధ్యతరగతి ప్రజల భవిష్యత్తుకు బలమైన భరోసా కల్పించే కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని తెలుగుదేశం పార్టీ హృదయపూర్వకంగా స్వాగతిస్తోందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు అన్నారు. నిత్యావసర వస్తువులు, వైద్యం, విద్య, వ్యవసాయ పరికరాలపై జీఎస్టీ రేట్ల తగ్గింపు సామాన్య ప్రజలు, రైతుల కొనుగోలు శక్తిని పెంచుతుందని, 33 రకాల ప్రాణాధార ఔషధాలపై పన్ను రద్దు, ఇతర మందులపై పన్ను తగ్గింపుతో ఆరోగ్య ఖర్చులు గణనీయంగా తగ్గుతాయని పేర్కొన్నారు. విద్యపై జీఎస్టీ రద్దు విద్యార్థుల కుటుంబాలకు ఊరటనిస్తుందని, వ్యవసాయ పరికరాలపై పన్ను తగ్గింపు గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు బలాన్నిస్తుందని, వ్యక్తిగత వస్తువులపై పన్ను తగ్గింపు చిన్న, మధ్య తరగతి వ్యాపారాలకు మేలు చేస్తుందని తెలిపారు. వ్యక్తిగత బీమాపై పన్ను రద్దు కోట్లాది కుటుంబాలకు రక్షణను చేరువ చేస్తుందని ఆయన అన్నారు. ప్రజల ఖర్చులు తగ్గించి వినియోగాన్ని పెంచే ఈ జీఎస్టీ సంస్కరణలు దేశీయ మార్కెట్‌కి ఊతమివ్వడంతో పాటు పెట్టుబడుల వృద్ధికి దోహదం చేసి ఆర్థిక వ్యవస్థను విస్తరింపజేస్తాయని పల్లా పేర్కొన్నారు. టీడీపీ స్థాపన నుంచి పేద, మధ్యతరగతి, రైతుల సంక్షేమమే లక్ష్యమని, ఈ దిశగా కేంద్ర ప్రభుత్వం తీసుకున్న చారిత్రాత్మక నిర్ణయం ప్రజలకు నిజమైన దీపావళి బహుమతిగా నిలుస్తుందన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, జీఎస్టీ కౌన్సిల్‌కు పార్టీ తరఫున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

## సీఎస్‌ను కలిసిన మహిళా కమిషన్ ఛైర్ పర్సన్ శైలజ



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్)** : జాతీయ మహిళా కమిషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమానికి రాష్ట్రం తరుపున అధికారులు హాజరయ్యేలా చర్యలు తీసుకోమని సీఎస్ విజయానంద్‌ను రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్ పర్సన్ శైలజ రాయపాటి కోరారు.

మహిళా కమిషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహిళల రక్షణ, చట్టాలు, భద్రతపై అవగాహన కార్యక్రమాలను సీఎస్ కు ఛైర్ పర్సన్ వివరించారు. జాతీయ మహిళా కమిషన్, లాల్ బహదూర్ శాస్త్రి నేషనల్ అకాడమీ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్ సంయుక్తంగా నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమానికి రాష్ట్రం నుండి అధికారులతో పాటు పోలీసు అధికారులను నామినేట్ చేయాలని సీఎస్ విజయానంద్ కు తెలియజేశారు. సెప్టెంబర్ 12 నుంచి 14 వరకు డామన డయూలో జరుగుతున్న జాయింట్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ కు దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాల నుండి అధికారులు హాజరయ్యేలా జాతీయ మహిళా కమిషన్ చర్యలు తీసుకుందన్నారు. మహిళలకు రక్షణ, హక్కులు, భద్రత, చట్టాలు, పథకాల అమలుపై అధికారులకు దిశానిర్దేశం చేయనున్న జాతీయ మహిళా కమిషన్ అని తెలిపారు. లింగ సంబంధిత పరిపాలన, చట్టం అమలులో పౌర, పోలీసు పరిపాలన కలసి పనిచేయడం అవసరం అనే బలమైన సిఫారసుల ఆధారంగా ఈ కార్యక్రమం చేపడుతోంది. ఈ శిక్షణలో పౌర, పోలీసు అధికారుల మధ్య సమన్వయాన్ని పెంపొందించడం, మహిళా సంక్షేమ పథకాలు, చట్టాల అమలులో మెరుగుదల, అలాగే భారతీయ న్యాయ సంహిత 2023, భారతీయ నగరిక సురక్షా సంహిత 2023 వంటి కొత్త చట్టాలపై ఉన్నతాధికారులకు తాజా పరిజ్ఞానం అందించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం సాగుతుంది. అదే విధంగా రాష్ట్ర మహిళా కమిషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహిళల రక్షణ, హక్కులు, చట్టాలపై అవగాహన కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన అంశాన్ని సీఎస్ దృష్టికి తెచ్చిన శైలజ. అంతేకాకుండా మహిళల సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాల విజయవంతంపై సీఎస్ కు ఆమె ధన్యవాదాలు తెలియజేశారు. మహిళలను పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై మహిళా కమిషన్ ఛైర్ పర్సన్ హర్షం వ్యక్తం చేశారు.

# సీఎం రిలీఫ్ ఫండ్ ఆర్థిక తోడ్పాటు అనారోగ్య బాధితునికి భరోసా





- ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్

**తెనాలి,(జర్నలిస్ట్ ఫైల్)** : ఆరోగ్యశ్రీ ద్వారా వైద్య సేవలు పొందలేని వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా అందించే ఆర్థికసహాయం వారికి ఎంతో ఓదార్పుగా ఉంటుందని పట్టభద్రుల ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో గురువారం ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక సహాయానికి అర్హత సాధించిన,15 మందికి, 10 లక్షల 8వేల 194 రూపాయల, నగదు చెక్కులను, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం సంక్షేమం పరంగా సూపర్ సిక్స్ పథకాలను విజయవంతంగా ప్రజల్లోకి తీసుకు వెళుతుందని అన్నారు. మరోవైపు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ మెగా డీఎస్సీ ద్వారా 16,700 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించారని, వీటితోపాటుగా ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా తీవ్రమైనఅనారోగ్య సమస్యలున్న, బాధితులకు అందిస్తున్న సహాయం ప్రాధాన్యత అంశమని అన్నారు. ఈ సందర్భంగా,రాష్ట్ర సుందరి కరణ కార్పొరేషన్ డైరెక్టర్ గా అవకాశం లభించిన అంగలకుదురు మాజీ సర్పంచ్, సీనియర్ తెలుగుదేశం నాయకురాలు నలుకుర్తి విజయను,ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ ప్రత్యేకంగా అభినందించారు. రాష్ట్ర సుందరీకరణ కార్పొరేషన్ డైరెక్టర్ గా అవకాశం పొందిన నలుకుర్తి విజయ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ క్రియాశీలక రాజకీయాల్లో వెనుకబడిన వారిని గుర్తించి, అవకాశాలు ఇవ్వడం ఆనందంగా ఉందన్నారు. పార్టీ కోసం తమ జీవితకాలం సేవలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షులు మహమ్మద్ కుద్దూస్ పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ జొన్నాదుల మహేష్ మంగమూరి హరిప్రసాద్, గుమ్మడి ప్రసాద్, వి అశోక్ వర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

# 'జాయింట్ పెన్షనర్స్ కౌన్సిల్' ఏర్పాటు చేయాలి

- పెన్షనర్ల సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లిన ఆంధ్రా పెన్షనర్స్ పార్టీ



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్)**: రాష్ట్ర సచివాలయంలో ఆంధ్రా పెన్షనర్స్ పార్టీ అధ్యక్షుడు సుబ్బరాయన్ పాలంకి నాయకత్వంలో రాష్ట్ర కార్యవర్గం ముఖ్యమంత్రి నారా చంద్రబాబును కలిసి ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించింది. వందలాది మంది పెన్షనర్లు తమ జీవితకాల కష్టార్జితం అయిన బకాయిలు అందుకోకుండానే మరణిస్తున్నారని, కావున పెన్షనర్లకు ప్రాధాన్యతగా బకాయిలు వెంటనే చెల్లించాలని కోరారు. తెలుగుదేశం పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చిన పెన్షనర్స్ సంక్షేమ కార్పోరేషన్‌ను వెంటనే ఏర్పాటు చేయాలని, తగ్గించిన 3% క్వాంటమ్ ఆఫ్ పెన్షన్‌ను పూర్వ స్లాబ్ ప్రకారం తిరిగి చెల్లించాలని, మెడికల్ అలవెన్స్ సీలింగ్‌ను రూ. 2 లక్షల నుంచి రూ. 5 లక్షలకు పెంచాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు ఉచితంగా మందులు అందిస్తున్నట్లుగా, రాష్ట్ర ప్రభుత్వం నేరుగా ఫార్మసీ కంపెనీల వద్ద మందులు కొనుగోలు చేసి, పెన్షనర్లకు 50% ధరలకు అన్ని మండల కేంద్రాల ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రత్యేక కౌంటర్ల ద్వారా అందించాలన్నారు. అలాగే ఉద్యోగ సంఘాలకు ఉన్న "జాయింట్ స్టాఫ్ కౌన్సిల్" మాదిరిగానే, "జాయింట్ పెన్షనర్స్ కౌన్సిల్" ఏర్పాటు చేయాలని కోరారు. మూడున్నర దశాబ్దాలుగా ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో, విపత్తులు, తుఫానులు, వరదలు, కోవిడ్ వంటి సంక్షోభ సమయాల్లో ప్రాణాలను లెక్కచేయకుండా పనిచేసిన రిటైర్డ్ ఉద్యోగుల సంక్షేమ బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వం చేపట్టాలని సుబ్బరాయన్ అభ్యర్థించారు. పెన్షనర్లు ముఖ్యమంత్రిని తమ పెద్ద కుమారుడిగా భావిస్తున్నారని, అందువల్ల బకాయిల చెల్లింపులో ముందుగా పెన్షనర్లకు ప్రాధాన్యత ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసి 30 ఏళ్లు పూర్తయిన సందర్భంగా చంద్రబాబుకు అభినందనలు తెలిపారు.

ఈ సమావేశంలో పాలంకి సుబ్బరాయన్, జీ. రామస్వామి, మునెయ్య, పి. యస్. ఎన్. మూర్తి, ఏ.వి. ప్రసాద్ రావు, తోట రవీంద్రనాథ్ పాల్గొన్నారు.

# సమస్యల సుడిగుండంలో విద్య : ఫోర్టో

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్)** : రాష్ట్రంలో విద్య సమస్యల సుడిగుండంలో, వెంటిలేటర్ పై ఉందని, దాన్ని పునర్జీవింపచేయాలని ఫోర్టో (ఫోరం ఆఫ్ రిజిస్టర్డ్ టీచర్ అసోసియేషన్స్) ఛైర్మెన్ కరణం హరికృష్ణ, సెక్రెటరీ జనరల్ అంకాల కొండయ్య, గౌరవ అధ్యక్షులు వెంకట రెడ్డి, ముఖ్య సలహాదారులు బలివాడ ధనుంజయరావు, కో చైర్మన్లు బోనెల రమేష్, బృంద బాన్ డొలై, సోమరౌతు శ్రీనివాసరావు, చల్లగుండ్ల శ్రీనివాస రావు, పెద్దన్న, బీరప్ప, గాండ్లపర్తి శివానందరెడ్డి, మాగంటి శ్రీనివాసరావు, గరికపాటి సురేష్ ప్రకటనలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బోధనేతర పనులతో ఉపాధ్యాయులు సతమతమవుతుండడంతో బోధన కుంటుపడుతోందని వివరించారు. మూల్యాంకన విధానం ఉపాధ్యాయులపై ఆశని పాతంలా తయారైందని పేర్కొన్నారు. యాపుల భారం ఉపాధ్యాయులకు గుదిబండలా తయారైందన్నారు. మారుమూల ప్రాంతాలలో ఉపాధ్యాయుల కొరతతో విద్యా బోధన కుంటుపడుతోందని సోదా హరించారు. విద్యార్థుల మనోస్థాయిని పరిగణన లోకి తీసుకోకుండా, అభ్యసన అవధిని పెంచి విద్యార్థులపై మానసిక ఒత్తిడిని పెంచుతోందన్నారు.

క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాలు కొరవడి విద్యార్థులలో శారీరక మానసిక వికాసం దెబ్బతింటోందని విశ్లేషించారు. విద్యార్థులలో విపరీత ధోరణులు చోటుచేసుకుంటున్నాయని తెలిపారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యను అందించాల్సిన పాఠశాలలు, విద్యార్థుల పాలిట ఒత్తిడి నిలయాలుగా మారుతున్నాయన్నారు.

మనో విజ్ఞాన శాస్త్రం ప్రకారం, కొఠారి కమిషన్,లాంటి కమీషన్ల సూచనలను పెడచెవిని పెట్టడం విద్యార్థుల వ్యక్తిత్వ వికాస హరణనానికి తోడ్పడుతున్నాయని చెప్పారు. విద్యాశాఖలో వింత ప్రయోగాలు చోటు చేసుకోవడం వలన అభ్యసన నైపుణ్యాలు కొరవడుతున్నాయని తెలిపారు.

స్వేచ్ఛాయుత వాతావరణంలో బోధించాల్సిన ఉపాధ్యాయులకు సంకెళ్లు వేయబడి బోధన కృత్రిమంగా సాగడంతో విద్యార్థులలో అసలైన సామర్థ్యాలు వెలికి తీయలేకపోతున్నారని తెలుపుతూ.. ఉపాధ్యాయులు స్వేచ్ఛ వాతావరణంలో బోధన చేసే అవకాశాన్ని కల్పించాలని ఉద్బోధించారు. ఉపాధ్యాయులను కేవలం బోధనకే పరిమితం చేసి బోధనేతర పనుల నుంచి మినహాయింపు ఇవ్వాలన్నారు.

పాఠశాలల్లో స్వేచ్ఛాయుత, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించాలని కోరారు. మనోవైజ్ఞానిక శాస్త్రవేత్తల సూచనల ప్రకారం పాఠశాలల పని వేళల్లో మాత్రమే విద్యాబోధన జరిగేలా పటిష్టమైన చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. విద్యా శాఖలో వింత ప్రయోగాలను మానుకోవాలన్నారు. ప్రతి పాఠశాలకు బోధనేతర సిబ్బందిని నియమించాలని విన్నవించారు.

## ఏయూకు స్టేట్ పబ్లిక్ యూనివర్సిటీ విభాగంలో 4వ స్థానం

### అభినందించిన విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్)** : జాతీయ స్థాయిలో కేంద్ర విద్యమంత్రిత్వ శాఖ అందించే ఎన్.ఐ.ఆర్.ఎఫ్ ర్యాంకింగ్ లో స్టేట్ పబ్లిక్ యూనివర్సిటీ విభాగంలో ఆంధ్ర విశ్వవిద్యాలయం 4వ స్థానంలో నిలిచింది. గతేడాది ఈ విభాగంలో ఏయూ 7వ స్థానంలో నిలవగా.. ఈ సంవత్సరం మూడు స్థానాలు మెరుగుపరుచుకుని 4వ స్థానంలో నిలిచింది. దీంతో రాష్ట్రంలో ప్రభుత్వ విశ్వవిద్యాలయాల విభాగంలో నెంబర్ వన్ స్థానాన్ని ఏయూ కైవసం చేసుకుంది. విశ్వవిద్యాలయాల విభాగంలో గతేడాది 25వ స్థానంలో నిలవగా.. ఈ సంవత్సరం 23వ స్థానానికి చేరుకుంది.

కేంద్రీయ, రాష్ట్ర విశ్వవిద్యాలయాలు, పరిశోధన సంస్థలు ఓవరాల్ విభాగంలో ఆంధ్ర విశ్వవిద్యాలయం 41 వ స్థానంలో నిలిచింది. గతేడాది సైతం ఏయూ 41వ స్థానాన్ని సంపాదించింది. అదేవిధంగా ఫార్మసీ కళాశాల 34వ స్థానం నుంచి 31వ స్థానానికి, ఇంజనీరింగ్ కళాశాల 90వ స్థానం నుంచి 88వ స్థానానికి చేరుకున్నాయి. అదే విధంగా డాక్టర్ బి. ఆర్ అంబేద్కర్ న్యాయ కళాశాల 16వ స్థానాన్ని నిలుపుకుంది.

స్టేట్ పబ్లిక్ యూనివర్సిటీ విభాగంలో ఆంధ్ర విశ్వవిద్యాలయం 4వ స్థానంలో నిలవడం పట్ల విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ అభినందనలు తెలిపారు. ర్యాంకు మెరుగుపర్చుకున్నందుకు యూనివర్సిటీకి శుభాకాంక్షలు తెలిపిన మంత్రి.. ఇంకా సాధించాల్సింది చాలా ఉందని, సుదీర్ఘ లక్ష్య సాధన మరింతగా కృషి చేయాలని పేర్కొన్నారు.

## గ్రామ పంచాయతీల ఎన్నికలకు ముందస్తు ఏర్పాట్లు



- ప్రభుత్వానికి రాష్ట్ర ఎన్నికల కమిషన్ లేఖ

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్)** : గ్రామ పంచాయతీ ఎన్నికల పదవీ కాలం వచ్చే ఏడాది ముగియనున్న నేపథ్యంలో ఎన్నికల నిర్వహణకు అవసరమైన ముందస్తు కార్యకలాపాలను నిర్వహించాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వానికి రాష్ట్ర ఎన్నికల కమిషన్ లేఖ రాసింది. వచ్చే ఏడాది ఏప్రిల్ 2వ తేదీ నాటికి గ్రామ పంచాయతీల పదవీ కాలం ముగియనుంది. అప్పటిలోపు ఎన్నికలను నిర్వహించాల్సి ఉంది. అందుకోసం సర్పంచ్‌లు, వార్డు సభ్యుల రిజర్వేషన్లు, డీలిమిటేషన్, ఖరారు వంటి ముందస్తు ఎన్నికల కార్యకలాపాలను పూర్తి చేయాల్సి ఉంది. పక్కనే ఉన్న పట్టణ స్థానిక సంస్థల్లోని పంచాయతీలను విలీనం చేయడం, పంచాయతీలను మున్సిపాల్టీలు, నగర పంచాయతీలుగా అప్‌గ్రేడ్ చేయడం, డీలిమిటేషన్, రిజర్వేషన్లు వంటి ముందస్తు ఎన్నికల కార్యకలాపాలను ప్రభుత్వం నిర్వహించాల్సి ఉంది. ప్రభుత్వం రిజర్వేషన్లను ఖరారు చేసిన తర్వాతే రాష్ట్ర ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ జారీ చేయాల్సి ఉంది. నిర్దేశిత గడువు లోపు ఎన్నికలు నిర్వహించేందుకు వీలుగా ముందస్తు ఎన్నికల కార్యకలాపాలను సకాలంలో పూర్తి చేయాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్ ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, పంచాయతీరాజ్ అండ్ గ్రామీణాభివృద్ధి శాఖకు, పిఆర్ అండ్ ఆర్‌డి, ఎన్నికల అథారిటీ కమిషనర్‌కు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ బుధవారం లేఖ రాశారు.

# వైసీపీది రప్పా రప్పా.. మాది అభివృద్ధి మంత్రం

- స్త్రీశక్తితో మహిళా సాధికారత
- చెప్పింది చెప్పినట్లు చేసిన ఘనత కూటమిదే..
- రైతుల గురించి చంద్రబాబుకు బాగా తెలుసు
- ఉల్లిపై జగన్ వన్నీ సొల్లు మాటలు
- గుంటూరు తూర్పు నియోజకవర్గ స్త్రీశక్తి కార్యక్రమంలో మంత్రి సవితమ్మ
- హాజరైన గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్, ఎమ్మెల్సీ ఆలపాటి



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్)**: వైసీపీ ప్రభుత్వం రప్పా రప్పా అంటుంటే కూటమి ప్రభుత్వం అభివృద్ధి మంత్రం పఠిస్తోందని చేనేత జౌళి, బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితమ్మ అన్నారు. గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ ఆధ్వర్యంలో గుంటూరులో నిర్వహించిన స్త్రీశక్తి కార్యక్రమాన్ని గుంటూరులో గురువారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితమ్మ, ఎమ్మెల్సీ ఆలపాటి రాజా, మాజీ మంత్రి రాజకుమారి, జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వర్లు హాజరయ్యారు. సభకు ఎమ్మెల్యే నసీర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మంత్రి సవితమ్మ మాట్లాడుతూ జగన్ స్త్రీశక్తి పథకం ద్వారా రాష్ట్రంలో మహిళా సాధికారతకు పెద్ద పీట వేశామని తెలిపారు. తల్లికి వందనం, మెగా డీఎస్సీ, స్త్రీశక్తి, అన్నదాత సుఖీభవ వంటి పథకాల ద్వారా రాష్ట్రంలో పేదల సంక్షేమాన్ని లిఖించామని చెప్పారు. ఉల్లి, మిర్చి గురించి జగన్ మాట్లాడుతుంటే రైతులు నవ్వుకుంటున్నారని ఎద్దేవా చేశారు. ఉల్లి, మిర్చి రైతుల గురించి చంద్రబాబు నాయుడుకు తెలిసినంత రాష్ట్రంలో మరెవరికీ తెలియదని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. అందుకే రైతుల కోసం అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేశారని వివరించారు. రాష్ట్రంలో సువర్ణపాలన సాగుతోందని, యువత ఉజ్వల భవితకు దిశానిర్దేశం జరుగుతోందని పేర్కొన్నారు. మెగా డీఎస్సీ ద్వారా నిరుద్యోగులకు కలలు సాకారం చేశామన్నారు. తల్లికి వందనంతో ప్రతి ఇంటా బిడ్డల చదువులకు భరోసా కల్పించామని తెలిపారు. స్త్రీ శక్తి పథకం ద్వారా బస్సుల్లో మహిళలు ఉచితంగా ప్రయాణించి ఆర్థిక శక్తిగా ఎదుగుతున్నారని అన్నారు. యువనేత, మంత్రి నారా లోకేశ్ ఆధ్వర్యంలో విద్యా వ్యవస్థ బలపడిందని, దీంతో తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. 20 లక్షల ఉద్యోగాల కల్పన కోసం నారా లోకేశ్ కాలికి బలపం కట్టుకుని తిరుగుతున్నారని వివరించారు. ఎంఎంఎంఈ ద్వారా మహిళా సంఘాలకు రుణాలు అందిస్తున్నట్లు తెలిపారు. ఇది కదా మహిళా లోకానికి నిజమైన సాధికారత అని పేర్కొన్నారు.

### సూపర్ సిక్స్ సూపర్ హిట్: ఎమ్మెల్యే నసీర్

రాష్ట్రంలో చెప్పిన మాట చెప్పినట్లు అమలు చేసిన ఘనత సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వానికే దక్కుతుందని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు. స్త్రీ శక్తి కార్యక్రమం సందర్భంగా మాట్లాడుతూ మైనారిటీ ప్రజానీకం అధికంగా ఉన్న గుంటూరు తూర్పు నియోజకవర్గానికి సూపర్ సిక్స్ పథకాలతో అధిక శాతం మంది లబ్ధి చేకూరిందని అన్నారు. ఐదేళ్లపాటు అభివృద్ధి సంక్షేమంలో వెనుకబడిన ప్రాంతంగా గుర్తింపు పొందిన గుంటూరు తూర్పు నియోజకవర్గాన్ని సీఎం చంద్రబాబు నాయుడు సహకారంలో అభివృద్ధిలో రోల్ మోడల్ గా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. తల్లికి వందనం ద్వారా బిడ్డలను పాఠశాలలకు పంపిస్తున్న తల్లుల ఆనందమే స్త్రీశక్తి అని పేర్కొన్నారు. ప్రతి రోజూ బస్సుల్లో ప్రయాణిస్తున్న మహిళల మోముల్లో కనిపించే ఆనందమే కూటమి ప్రభుత్వానికి ఆశీర్వాదమని స్పష్టం చేశారు.

### చిన్న పిల్లలను మోసం చేసిన మేనమామ జగన్: ఎమ్మెల్సీ ఆలపాటి

గత ప్రభుత్వంలో అమ్మ ఒడి పేరిట చిన్న పిల్లలను సైతం మోసం చేసిన మేనమామగా జగన్ చరిత్రహీనులుగా మిగిలిపోతారని ఎమ్మెల్సీ ఆలపాటి రాజా విమర్శించారు. రాష్ట్రంలో సూపర్ సిక్స్ పథకాలను సూపర్ హిట్ చేసిన కూటమి ప్రభుత్వానికి ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని పేర్కొన్నారు. అభివృద్ధితోపాటు సంక్షేమాన్ని ఒకేతాటిపై నడిపిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ షేక్ సజీల, కూటమి నేతలు చిట్టాబత్తుని చిట్టిబాబు, జాగర్లమూడి శ్రీనివాసరావు, దాసరి రాజా మాస్టర్, జీ రాఘవేంద్ర, గుడిపల్లి శైలజ, షేక్ గౌస్, పోతురాజు సమత, యల్లావుల అశోక్, ముప్పవరపు భారతి, వేముల జ్యోతిపద్మజ, షేక్ మీరావలి, కన్నా రజని, వేల సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467